


ఈనాడు



హైదరాబాద్ 9-2-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 180
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

చేపను అనుకరించే రోబో

పాము.. కుక్క.. తేళ్లను పోలిన రోబోలను తయారుచేసిన శాస్త్రవేత్తలు ఇప్పుడు సరికొత్తగా చేపను అనుకరించే రోబోలను రూపొందించారు. లోతైన సాగరాల్లో సంచరించే ప్రాణుల గురించి పరిశోధనల కోసం ఈ మార్గాన్ని ఎంచుకున్నారు వారు. చేపల్లా చల్లగా సాగిపోయే ఈ రోబోలు చేపల మధ్య సంభాషణలను పసిగడతాయనేది వారి ఊహ!



2లో

చెక్కను ఉక్కులా చేశారు

ఎన్నేళ్లయినా చెక్కు చెదరకుండా ఇనుప ముక్కలా ఉండే పాతకాలంనాటి టేకు మంచాలు, కుర్చీలను చూస్తే ముచ్చటేస్తుంది. ఇప్పుడు శాస్త్రవేత్తలు అంతకంటే ఉక్కులాంటి దృఢమైన చెక్కను రూపొందించారు.. విశేషమేమిటంటే అది బుల్లెట్‌ప్రూఫ్ కూడానట!



2లో

నేరం మాది కాదు కాలుష్యానిది!

వాయు కాలుష్యం అంటే ఇంతవరకు ఆరోగ్యానికి ముప్పు అని మాత్రమే అందరూ భావించే విషయం. కాని ఇది మానసిక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోందట. అనైతిక ఆలోచనలకు, అబద్ధాలకు వాతావరణ కాలుష్యం కూడా కారణమవుతోందని పరిశోధనలు నిరూపిస్తున్నాయి.



2లో

ఆధార్‌తో బోలెడు ఆదా

- రూ.75,000 కోట్లు మిగులు
- రూ.1.20 లక్షల కోట్లకు చేరిన చెల్లింపులు
- 63 కోట్ల మందికి లబ్ధి

ఈనాడు, దిల్లీ: ఆధార్ ప్రాతిపదికగా ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) చేస్తున్నందు వల్ల మోదీ సర్కారు రూ.75,000 కోట్లు ఆదా చేయగలిగింది. యూపీఏ సర్కారు హయాంలోనే ఆధార్ మొదలైనా ఇటీవలి ఏళ్లలో ఇది అనేక రెట్లు విస్తరించింది. 2014 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఉన్న గణాంకాలను పరిశీలిస్తే ఇంత భారీ మొత్తం ప్రభుత్వానికి మిగిలిందని తేలింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ప్రకటన కూడా వెలువరించే అవకాశాలున్నాయి. ఒక్క ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే డీబీటీ ద్వారా బుధవారం వరకు రూ.లక్ష కోట్లు పైచిలుకు మొత్తాన్ని పంపిణీ చేశారు. మార్చి మాసాంతానికి (మిగతా 2లో)

భూమాయపై కన్నెర్ర

- ఇంటెలిజెన్సు, రెవెన్యూ అధికారులతో విచారణ
- రిజిస్ట్రేషన్ పత్రాలు రద్దు
- బాధ్యులపై కఠిన చర్యలు
- తహశీల్దార్ కార్యాలయంలో దస్త్రాల తనిఖీలు
- 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు-సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి



చిన్న గొల్లపల్లిలో ఆక్రమణకు గురైన భూములు

శంషాబాద్ భూమాయ అక్రమాల్లో బాధ్యులైన వారిపై రాష్ట్రప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వ భూములను కొల్లగొట్టడానికి నకిలీ పత్రాలను సృష్టించినవారు ఏస్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలంటూ రెవిన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులను ఆదేశించింది. శంషాబాద్ విమానాశ్రయం రన్‌వే ప్రహరీ గోడకు ఆనుకొని చిన్నగొల్లపల్లి రెవిన్యూ పరిధిలో ఉన్న రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాజేయడానికి అదే గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు రచించిన వ్యూహాన్ని 'ఈనాడు' బట్టబయలు చేసింది. గురువారం 'మరో భూమాయ' అన్న శీర్షికన ప్రధాన సంచికలో వెలువడిన కథనానికి స్పందించిన రాష్ట్రప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో సమగ్ర విచారణకు అధికారులు రంగంలోకి దిగారు.

అధికారులచే భూముల పరిశీలన

పరాధీనమైన ప్రభుత్వ భూములను అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ర్యాంకు ఇద్దరు అధికారులు గురువారం పరిశీలించారు. భూముల గురించి గ్రామస్థులను ఆరా తీశారు. మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సుజీత్‌రెడ్డితో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో భూముల దస్త్రాలను తనిఖీలు చేశారు. రెవెన్యూ దస్త్రాల్లో లేని సర్వే నెంబరును సృష్టించి తయారుచేసిన దస్తావేజులపై రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అగ్రిమెంట్ ఆఫ్ సేల్‌గా రిజిస్టర్ చేయడం, నకిలీ పత్రాలతో విద్యుత్ అధికారులకు దరఖాస్తు చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రభుత్వ భూమిలో బిగించడాన్ని పోలీస్ అధికారులు విస్తుపోయారు.

దస్తావేజులు రద్దు చేస్తాం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నగొల్లపల్లి రెవిన్యూ పరిధిలో సర్వే నెంబరు-1 నుంచి 260 వరకూ ఉన్నాయని (మిగతా 2లో)

అక్రమాలపై విచారణకు ఉప ముఖ్యమంత్రి ఆదేశం



ఈనాడు, హైదరాబాద్: రాజధాని శివారుల్లో వెలుగు చూసిన భూఅక్రమాలపై రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీకి మూడు వేర్వేరు ఆదేశాలు జారీచేశారు. 'ఈనాడు' ప్రధాన పత్రికలో 'మరో భూమాయ', 'కొత్వాల్‌గూడ భూముల్లో వలస పక్షులు' శీర్షికన ప్రచురితమైన కథనాలకుగాను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించాలని సూచించారు. 'ఏ ఊరైనా 'మావూరి'దే!' కథనానికి సంబంధించి హైదరాబాద్ కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. దోషులను తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది.



అయోధ్య సమస్య భూ వివాదమే

- రోజువారీ విచారణ ఉండదు
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసు కేవలం భూ వివాదమని, దీనిని సాధారణ వ్యాజ్యంగానే విచారించనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ వివాదంపై తుదివిచారణ గురువారం ప్రారంభమయింది. దీనిపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లిన వారి వాదనలు తొలుత వింటామని తెలిపింది. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, న్యాయమూర్తులు జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్.ఎ.నజీర్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం విచారిస్తోంది. ప్రారంభంలోనే సీనియర్ న్యాయవాదుల మధ్య వాడీవేడిగా వాదోపవాదాలు జరిగాయి. వాదనల సారాంశాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని రాం లల్లా విరాజ్‌మాన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ (మిగతా 2లో)



ఏపీ బంద్ సందర్భంగా విజయవాడ ఎన్టీఆర్ సర్కిల్‌లో వివిధ రాజకీయ పార్టీల ఆందోళన

స్తంభించిన ఏపీ

- కేంద్ర బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయకపోవడంపై వెల్లువెత్తిన నిరసనలు
- విభజన హామీల అమలులో అన్యాయంపై ఆందోళనలు
- బంద్‌లో పాల్గొన్న సీపీఎం, సీపీఐ, వైకాపా, కాంగ్రెస్, జనసేన శ్రేణులు
- రోడ్డెక్కని ఆర్టీసీ బస్సులు

14లో

ప్రాణహిత.. నత్తనడక

- ప్రారంభం కాని బ్యారేజి నిర్మాణ పనులు
- మిగిలిన పనులూ మందగమనమే
- కేటాయించిన నిధుల్లో 15 శాతమే ఖర్చు

ఈనాడు - హైదరాబాద్

ప్రాణహిత ప్రాజెక్టు పనులు ముందుకు పడటం లేదు. బ్యారేజి నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కానే లేదు. మిగిలిన పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేసిన బడ్జెట్ కేటాయింపులో (మిగతా 2లో)

నాలుగేళ్లు దాటిన చిన్నారికీ శిరస్త్రాణం!



- ఎల్‌ఎల్‌ఆర్ కూడా ఎలక్ట్రానిక్ రూపంలోనే
- ఎక్కడ నుంచైనా రిజిస్ట్రేషన్, లైసెన్సు పునరుద్ధరణ
- కేంద్రం కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: ద్విచక్రవాహనాలపై ప్రయాణించే చిన్నారులకు కూడా శిరస్త్రాణాన్ని (హెల్మెట్‌ను) అనివార్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు నిబంధనలు రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. భావితరాల వారిని కాపాడుకునేందుకు కేంద్రం ఈ యోచన చేస్తున్నట్లు రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సు ప్రక్రియ ప్రక్షాళన చేయాలని కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అక్రమాలను (మిగతా 2లో)

నీట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

2లో

- మార్చి 9 వరకూ గడువు
- మే 6న పరీక్ష

ఎస్సీ, ఎస్టీలందరికీ బోధన రుసుములు

- ప్రత్యేకనిధి నుంచి చెల్లించేందుకు సన్నాహాలు
- సర్కారు అనుమతి కోరిన అధికారులు

11లో

విద్యుత్తు వాహనాలకు ప్రత్యేక టారిఫ్!

- ఛార్జీలు, ఛార్జింగ్ కేంద్రాల అనుమతి వరకే పరిమితం కావాలనుకుంటున్న డిస్కం
- ముున్ముందు పార్కింగ్ ప్రదేశాలన్నీ ఛార్జింగ్ కేంద్రాలు
- తెలంగాణ విద్యుత్తు వాహనాల విధానంపై సర్వత్రా ఆసక్తి
- దిల్లీ ఆటో ఎక్స్‌పోలో ప్రధాన ఆకర్షణగా విద్యుత్తు వాహనాలు

ఈనాడు – హైదరాబాద్

నగరాల్లో వాహన కాలుష్యం తగ్గించేందుకు కరెంటుతో నడిచే వాహనాలను ప్రోత్సహించే దిశగా తెలంగాణ ప్రభుత్వం విద్యుత్తు వాహన విధానంపై కసరత్తు చేస్తోంది. వేర్వేరు కన్సల్టెన్సీలు దీనిపై అధ్యయనం చేస్తున్నాయి. త్వరలో విధాన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు.. టారిఫ్ ప్రకటించి, విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ పాయింట్లకు అనుమతి ఇవ్వడం వరకే పరిమితమవ్వాలని డిస్కం భావిస్తోంది. ప్రధాన నగరాల్లో కాలుష్య నివారణకు ప్రపంచవ్యాప్తంగా విద్యుత్తు వాహనాలవైపే మొగ్గుతున్నారు. ఎలక్ట్రికల్ వాహనాలే పరిష్కారమని రవాణా నిపుణులూ సూచిస్తున్నారు. ప్రస్తుతం దిల్లీలో జరుగుతున్న ఆటో ఎక్స్‌పోలోనూ విద్యుత్తు వాహనాలే అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. పలు కంపెనీలు ద్విచక్ర వాహనాలు, కార్ల మోడల్స్‌ను ప్రదర్శనకు ఉంచాయి. మెట్రోరైలు మార్గంలో చివరి గమ్యస్థానం వరకు ప్రయాణికులను చేర్చేందుకు స్టేషన్ల నుంచి ఫీడర్ సర్వీసులుగా, ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్తు వాహనాలను నడిపేందుకు ఆటోమొబైల్ సంస్థలు ముందుకొచ్చాయి. రాష్ట్రంలో విద్యుత్తు వాహనాల విధానం వస్తే తప్ప ఇవి రహదారులపై కనిపించే పరిస్థితులు లేవు.

పార్కింగ్ ప్రదేశాల్లోనే..

విద్యుత్తుతో నడిచే వాహనాలకు ఛార్జింగ్ పాయింట్లు కావాల్సిందే. ప్రస్తుతం వ్యక్తిగతంగా కొందరు ఇలాంటి వాహనాలకు ఇళ్లల్లోనే ఏర్పాటు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో వాహనాల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో బహిరంగ ఛార్జింగ్ పాయింట్లు అవసరమవుతుంది. ఇప్పుడున్న పార్కింగ్ ప్రదేశాలన్నీ విద్యుత్తు ఛార్జింగ్ పాయింట్లుగా మారే అవకాశం ఉందని డిస్కం ఇంజినీర్లు అంటున్నారు. పార్కింగ్‌లో వాహనం నిలిపిన సమయంలో ఛార్జింగ్ చేసుకునే సదుపాయాలు రానున్నాయి. రెండు గంటల్లో ఛార్జింగ్ పూర్తయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రెండు గంటల్లో ఛార్జ్ అయ్యే వాహనాలను ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శిస్తున్నారు. ముందుగానే ఛార్జింగ్‌తో సిద్ధంగా ఉండే బ్యాటరీలను మార్చుకునే కేంద్రాలు వస్తాయని చెబుతున్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకు ఆటో ఎక్స్‌పోను డిస్కం ఇంజినీర్ల బృందం సందర్శించాలనే ప్రణాళిక ఉన్నా చివరి నిమిషంలో వాయిదా పడింది.




విద్యుత్తు బైక్ ★ విద్యుత్తు సైకిల్‌తో హీరో ఎలక్ట్రిక్ సంస్థ ఉన్నతాధికారులు

ప్రైవేటుకు ప్రోత్సాహం..

ప్రభుత్వ విధానాన్ని బట్టి టారిఫ్ ధర ఎంత ఉండాలనే విషయంలో డిస్కం నిర్ణయం తీసుకుంటుంది. తక్కువ టారిఫ్ ఉండాలంటే సర్కారు సబ్సిడీని భరించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈ తరహా వాహనాలను ప్రోత్సహించేందుకు టారిఫ్ సాధ్యమైనంత తక్కువగా ఉండటమే మేలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రైవేటు సంస్థలు ముందుకొస్తుండటంతో వారినే ప్రోత్సహించడం మేలని డిస్కం భావిస్తున్నట్లు తెలుస్తోంది. డిస్కం కన్సల్టెంట్లు సైతం ఇదే సూచనను చేశాయి. 'విద్యుత్తు వాహనాలకు సంబంధించి తమ పాత్ర టారిఫ్ ప్రకటించడం, ఛార్జింగ్ కేంద్రాలకు సాంకేతిక అనుమతి ఇవ్వడం వరకే పరిమితం కావాలని ప్రాథమికంగా డిస్కం నిర్ణయానికి వచ్చింది' అని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో పేర్కొన్నారు.

చేపను అనుకరించే రోబో

న్యూయార్క్: చేపను చక్కగా అనుకరించే రోబోలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. చేపను చూస్తూ దానిలానే ప్రవర్తించడం వీటి ప్రత్యేకత. సముద్రపు జీవుల గురించి మరిన్ని అంశాలు తెలుసుకునేందుకు ఇవి తోడ్పడే అవకాశముంది. సాధారణంగా రోబోల కదలికలకు అనుగుణంగా చేపలు, ఇతర జీవులు స్పందిస్తుంటాయి. అయితే చేపల కదలికలకు స్పందించేలా తాజా రోబోలను అమెరికాలోని న్యూయార్క్ వర్సిటీ నిపుణులు అభివృద్ధిచేశారు. దీనిలో చేప కదలికలను గుర్తించే అధునాతన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించారు. ప్రత్యేకంగా సిద్ధంచేసిన కృత్రిమ జలావరణంలో దీన్ని పరీక్షించారు. దీంతో ఇది జీబ్రాఫిష్‌ను చక్కగా అనుకరించగలిగింది. మరోవైపు జీబ్రాఫిష్ సైతం ఈ రోబో చేప ఆకర్షణకు గురైందని పరిశోధకులు తెలిపారు. దానిలో ఎలాంటి ఆందోళన లక్షణాలూ కనిపించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం జీబ్రాఫిష్‌ల మధ్య సంభాషణలపై దృష్టికేంద్రీకరిస్తూ.. ఈ రోబోలను మెరుగు పరిచేందుకు కృషిచేస్తున్నామని వివరించారు.

'పెయిన్ కిల్లర్ల'తో దుష్ప్రభావం

వాషింగ్టన్: అదే పనిగా నొప్పి నివారణ మందుల (పెయిన్ కిల్లర్లు)ను వాడితే మానసికంగా దుష్పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని అమెరికా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వైద్యుల చీటీ లేకుండా.. సొంత నిర్ణయంతో తరచూ వీటిని వాడితే భావోద్వేగాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని తాజాగా ఓ అధ్యయనంలో వెల్లడించారు. వాటిని వాడటం ద్వారా చాలా మంది శారీరకంగా కలిగే ఉపశమనం గురించి ఆలోచిస్తున్నారు తప్ప.. విస్తృత రీతిలో మానసిక ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలను అంచనా వేయలేకపోతున్నారని పేర్కొన్నారు. సమాచార క్రమం లోపించడం, మనోభావాలు గాయపడటం, ఏదో ఊహించుకుని తీవ్రంగా స్పందించడం వంటి ప్రభావాలుంటాయని సూచిస్తున్నారు. ఈమేరకు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకుడు కైల్ రేట్నర్ నేతృత్వంలోని పరిశోధక బృందం అనేక అంశాలను వెల్లడించింది. తరచూ నొప్పి నివారణ మందులు వాడుతున్న వారిలో - ఆటల నుంచి తప్పుకోవడం, సమాచారాన్ని పంచుకునే సామర్థ్యం తగ్గిపోవడం, యథాలాపంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తున్నట్లు అధ్యయనం పేర్కొంది. అలాంటి వ్యక్తులు తాము కొన్న ధర కంటే తక్కువకే తమ వస్తువులను విక్రయించడం వంటివి చేస్తుంటారని శాస్త్రవేత్తలు ఉదహరించారు. మొత్తంగా తమ పరిశోధనల్లో తేలిన అంశాలు ఆందోళనకరంగా ఉన్నట్లుతెలిపారు. కాగా ఇతర మందులతో కలిపి (కాంబినేషన్‌లో) వేసుకుంటే వీటి ప్రభావం ఎలా ఉంటుందన్న విషయమై మరింత పరిశోధన అవసరమని వెల్లడించారు.

ఉక్కులాంటి చెక్క

వాషింగ్టన్: చెక్కను ఉక్కులా దృఢంగా మార్చే విధానాన్ని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. దీని సాయంతో ప్రస్తుతమున్న కర్రలను పది రెట్ల కంటే ఎక్కువ గట్టిగా మార్చే వీలుంది. ఫలితంగా కార్లు, విమానాల తయారీలో వీటిని ఉపయోగించుకోవచ్చు. 'కొత్త విధానంలో మార్పులుచేసే చెక్కలు.. ఉక్కు, టైటానియం లాంటి లోహాలతో పోటీ పడగలవు. వీటి మన్నిక కూడా ఎక్కువే. అయితే తక్కువ ధరలోనే ఇవి అందుబాటులోకి రావడం విశేషం' అని అమెరికాలోని మేరీలాండ్ వర్సిటీ నిపుణులు లియాంగ్‌బింగ్ హూ తెలిపారు. 'ఉక్కులా దృఢంగా ఉండేటప్పటికీ బరువు మాత్రం ఆరు రెట్లు తక్కువగా ఉంటుంది. దీన్ని తొలి దశల్లో ఎలా కావాలంటే అలా వంచే వీలుంది. దీన్ని విరగ్గొట్టాలంటే పది రెట్లు ఎక్కువ శక్తి అవసరం'అని ఆయన వివరించారు. తూటాలను సైతం ఇది నియంత్రించ గలుగుతోందని చెప్పారు.

నైతిక విలువలను మింగేస్తున్న వాయుకాలుష్యం!

న్యూయార్క్: వాయుకాలుష్యం శారీరక ఆరోగ్యాన్నేగాక మానసిక ప్రవర్తననూ దెబ్బతీస్తుందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. ఈ కాలుష్యం బారినపడే వ్యక్తుల్లో నైతిక విలువలు తగ్గుతున్నట్లు తేల్చింది. అమెరికాలోని కొలంబియా బిజినెస్ స్కూల్‌కు చెందిన జాక్సన్ జి లూ నేతృత్వంలోని బృందం అమెరికా, భారత్‌లలో పరిశోధనలు నిర్వహించి ఈ విషయాలను నిర్ధారించింది. అమెరికాలో వాయుకాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాల్లో నివసిస్తున్న వ్యక్తులు.. పాచిక విసిరినప్పుడు వచ్చిన ఫలితాన్ని తెలియజేయడంలో ఎక్కువసార్లు అబద్ధం చెప్పినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. భారత్‌లో గాలి కాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు అనైతిక వ్యూహాలు అనుసరించేందుకు పెద్దగా వెనుకంజ వేయడం లేదని తేలినట్లు చెప్పారు. ఓ పరీక్షలో వారు రాసిన అభిప్రాయాల ఆధారంగా ఈ మేరకు అంచనాకు వచ్చినట్లు తెలిపారు. వాయుకాలుష్యంతో మానసిక ఆందోళన కూడా పెరుగుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిజంగా వాయుకాలుష్యం బారినపడకుండా.. కాలుష్య ప్రభావం తమపై ఉన్నట్లు మానసికంగా భావించినప్పుడు కూడా అవే దుష్ప్రభావాలు కలుగుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని వెల్లడించారు.

నాలుగేళ్లు దాటిన చిన్నారికీ శిరస్త్రాణం!

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకోవడానికి లైసెన్సుల ప్రక్రియను ఎలక్ట్రానిక్ రూపంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. తొలిదశలో ఇచ్చే ఎల్ఎల్ఆర్‌ను కాగితం రూపంలో కాకుండా ఎలక్ట్రానిక్ రూపంలోకి మార్చేందుకు కసరత్తు చేస్తోంది. బినామీ వ్యక్తులు పరీక్షలకు హాజరవటం, పరీక్షలకు హాజరుకాకుండానే లైసెన్సులు జారీ చేస్తుండడాన్ని అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ధ్రువపత్రాల తనిఖీ ఎలక్ట్రానిక్ రూపంలోనే చేయాలని నిర్ణయించింది. త్వరలో ఆధార్ వివరాలను రవాణా శాఖ కార్యాలయాలకు అనుసంధానించాలనీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. దరఖాస్తుదారులు ఇచ్చిన సమాచారంలోని వాస్తవికతను ధ్రువీకరించుకునేందుకు ఆధార్ అనుసంధానం ఉపయోగపడుతుంది. డ్రైవింగ్ లైసెన్సు లేదా వాహన రిజిస్ట్రేషన్ ఎక్కడ చేయించుకుంటే వాటి పునరుద్ధరణకు మళ్లీ అదే కార్యాలయానికి రావాల్సి వచ్చేది. ఇది ఇబ్బందులకు దారి తీస్తుండడంతో రాష్ట్రంలోని ఏ రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయంలోనైనా లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకునేలా చర్యలు తీసుకోనుంది.

నకిలీ పత్రాలతో దా'రుణం'

- కొత్వాల్‌గూడలో మహా మాయ
- రిజిస్ట్రేషన్ కాకుండానే తాకట్టు
- రూ.332 కోట్ల మేర అప్పు
- వెలుగు చూస్తున్న అక్రమాలు

ఈనాడు – హైదరాబాద్

హైదరాబాద్ నగర శివార్లలోని శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామానికి చెందిన 1820 ఎకరాల భూముల తాకట్టు వ్యవహారంలో తవ్వినకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అన్నీ నకిలీ పత్రాలు, అడుగడుగునా మోసాలతోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ నుంచి రూ.332కోట్ల మేర రుణం తీసేసుకొని ఎగ్గొట్టేశారని స్పష్టమవుతోంది. కనీసం భూములను రిజిస్ట్రేషన్ చేయకుండానే తాకట్టు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. దిల్లీకి చెందిన పైసిస్ ఎగ్జిమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రిజిస్ట్రేషన్‌శాఖ నిబంధనల్లో ఉన్న లొసుగులను పూర్తిగా వాడుకున్నారు. నిబంధనల్లో ఉన్న లొసుగులను ఒకవైపు వాడుకుంటూ మరోవైపు నకిలీ పత్రాలతోనే దందా మొత్తం నడిపించారు. రిజిస్ట్రేషన్ శాఖకు వారు సమర్పించిన పత్రాలు 'ఈనాడు'కు లభించాయి. కొత్వాల్‌గూడ పరిధిలోని 1నుంచి 170 సర్వే నెంబర్ల పరిధిలో ఉన్న భూములను కనీసం రిజిస్ట్రేషన్ లేకుండానే తాకట్టు పెట్టేశారని తాజాగా లభించిన దస్తావేజులు స్పష్టం చేస్తున్నాయి.

అంతా దగా!

గోల్కొండ కోటలో నివాసం ఉండే మహమ్మద్ హసన్ 1977లో తనకు కొత్వాల్‌గూడలో ఉన్న మొత్తం 1820 ఎకరాల భూమిని శివభూషణ్‌కు విక్రయిస్తున్నట్లు అమ్మకపు ఒప్పందం(సేల్‌డీడ్) రాసుకున్నారు. దీనిని రిజిస్ట్రేషన్ చేయించలేదు. 1979లో ఈ ఒప్పందాన్ని రిజిస్ట్రేషన్ చేయించకుండా.. రూ.38,600 చెల్లించి సేల్ వ్యాలిడేషన్ చేయించినట్లు పత్రాల్లో ఉంది. గ్రామాల్లో సాదాబైనామాలు రాసుకొనే తరహాలోనే ఇక్కడా అమ్మకపు ఒప్పందం రాసుకొని సేల్‌వ్యాలిడేషన్ చేయించారు. ఇది ఇరువర్గాల మధ్య ఒప్పందం జరిగినట్లుగా ఆధారం కింద మాత్రమే ఉపయోగపడుతుంది. ఇంత పెద్దఎత్తున ఉన్న ఆస్తులను కేవలం సేల్‌వ్యాలిడేషన్ పత్రాలతో ఇతరులకు విక్రయించడం, వారి పేరుతో రిజిస్టర్ చేయడం లాంటివి చెల్లవు. దీన్ని రిజిస్ట్రేషన్‌గా ఏమాత్రం పరిగణించరు. ఈ ఒప్పందం కూడా నకిలీదే కావడం గమనార్హం.

సేల్‌వ్యాలిడేషన్ కూడా తప్పుడు పత్రమే

మహమ్మద్ హసన్- శివభూషణ్‌ల మధ్య చేసుకున్న సేల్‌వ్యాలిడేషన్ కూడా పూర్తిగా బోగస్‌దేనని ఈ పత్రాలు చేస్తే నిర్ధారణ అవుతుంది. ఇద్దరి మధ్య సేల్‌వ్యాలిడేషన్‌ను 1979లో అప్పటి హైదరాబాద్ రిజిస్ట్రార్ వద్ద చేసుకున్నట్లుగా పత్రం సమర్పించారు. దీనిని జిల్లా రిజిస్ట్రార్ ముద్ర వేసినట్లుగా పత్రాల్లో చూపించారు. వాస్తవానికి వ్యాలిడేషన్ చేసే అధికారం 1979లో జిల్లా రిజిస్ట్రార్‌కు లేదు. 1985 వరకూ కూడా ఈఅధికారం రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ వద్దనే ఉండేది. ఇందుకు భిన్నంగా జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ వద్ద చేయించుకున్నట్లు పత్రం సమర్పించారు. అంటే ఇది ముమ్మాటికీ చెల్లుబాటు కాదు. ప్రాథమికంగా పరిశీలిస్తే ఇది బోగస్‌దేనని తెలుస్తోందని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి ఒకరు నిర్ధారించారు.

రిజిస్ట్రేషన్ లొసుగులను వాడేసుకున్నారు

భూములను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన పీఈసీ లిమిటెడ్‌కు తనఖా పెట్టి రుణం పొందేటప్పుడు కూడా రిజిస్ట్రేషన్‌శాఖ నిబంధనల్లో ఉన్న లొసుగులను వాడుకున్నారు. సాధారణంగా భూములను తనఖా పెట్టేటట్లైతే సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ ఈభూములకు సంబంధించిన పూర్తి దస్తావేజులన్నీ పరిశీలించాలి. ఇక్కడే తెలివిగా మెమొరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఇలా చేసినపుడు సంబంధిత రిజిస్ట్రార్‌కు పూర్వ దస్తావేజులు చూడాల్సిన అవసరం లేదనేది ఈశాఖ నిబంధన. ఇక్కడ కూడా దీనిని ఉపయోగించుకొని డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ కింద రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ పత్రంలో విలువను రూ.10లక్షలుగా చూపించారు. మొత్తం పత్రాన్ని టైపింగ్ చేయించి ఈ మొత్తాన్ని మాత్రం చేతితో రాయడం సందేహాలకు తావిస్తోంది. రుణం కోసం పైసిస్ సంస్థ సమర్పించిన ఈ ప్రతంలో రూ.10లక్షలు కనిపించకపోవడం గమనార్హం. ఈ విలువను తొలగించి రూ.332కోట్లు రుణం పొందినట్లు భావిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితే ఎవరి పాత్ర ఏమేరకు ఉందన్నది బయటపడుతుంది.

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలి

సభాపతికి తెదేపా నేతల వినతి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పార్టీ మారిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలు శాసనసభాపతి మధుసూదనాచారిని కోరారు. తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అమర్‌నాథ్‌బాబు గురువారం సభాపతిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. గతంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని వెల్లడించారు.

భూమాయపై కన్నెర్ర

(మొదటి పేజీ తరువాయి)

శంషాబాద్ తహశీల్దార్ జి.సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అక్కడ సర్వే నెంబరు 261 లేకున్నా ఉన్నట్లు పత్రాలను సృష్టించి శంషాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసిన దస్తావేజులను రద్దు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాజేయడానికి నకిలీ పత్రాలను సృష్టించిన వారిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.

ప్రాణహిత.. నత్తనడక

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఇప్పటి వరకు 15 శాతం మాత్రమే ఖర్చు చేశారు. 2008లో చేపట్టిన ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును పునరాకృతిలో ప్రభుత్వం ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకే పరిమితం చేసింది. ప్రాణహిత నుంచి 160 టీఎంసీలు కాకుండా 20 టీఎంసీలను మళ్లించి రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. ప్రాణహితపై తుమ్మిడిహట్టి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజి వల్ల చాప్రా వన్యమృగ సంరక్షణ ప్రాంతం ముంపునకు గురవుతుంది. అనుమతుల సమస్యను పరిగణనలోకి తీసుకొని బ్యారేజి నిర్మాణ ప్రాంతాన్ని ఒకటిన్నర కిలోమీటర్ దూరం పైకి జరిపారు. బ్యారేజి పూర్తిస్థాయి నీటిమట్టాన్ని 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గించడంతో నిల్వ సామర్థ్యం 1.85 టీఎంసీకి తగ్గింది. అయితే గేట్ల సంఖ్య, పొడవు పెరగడం వంటి కారణాలతో నిర్మాణ వ్యయం రూ.1,912 కోట్లకు పెరిగింది. ఇది పాత ధరల ప్రకారమే. తాజా అంచనాలను పరిగణనలోకి తీసుకొంటే నిర్మాణ వ్యయం ఇంకా పెరుగుతుంది. నాలుగు నెలల క్రితం రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీలో దీనిపై చర్చ జరిగినా ఇప్పటివరకు దీనికి తుది అనుమతి రాలేదు. ఈ అనుమతి వచ్చిన తర్వాతే టెండర్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ఈ పనిలో బ్యారేజితోపాటు ఒకటిన్నర కిలోమీటర్ దూరం కాలువ తవ్వకం కూడా ఉంది. కి.మీ 1.5 నుంచి 15 వరకు, 15 నుంచి 28.5 వరకు, 28.5 నుంచి 72వ కి.మీ వరకు మూడు ప్యాకేజీలుగా పనులు గతంలోనే గుత్తేదారులకు అప్పగించారు. ఈ పనులు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి.

సర్వేలూ సాగలేదు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.769.50 కోట్లు కేటాయించారు. కానీ జనవరి నెలాఖరు వరకు చెల్లించింది రూ.102 కోట్లు మాత్రమే. మరో రూ.128 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రూ.102 కోట్లు అటవీ పరిహారానికి సంబంధించినదని సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడానికి సర్వే చేయాలని ప్రభుత్వం కన్సల్టెన్సీ సంస్థకు అప్పగించింది. ఇది కూడా ఇంకా పూర్తి కాలేదు. ప్రాణహిత ద్వారా మళ్లించే నీటిని సుందిళ్లకు అనుసంధానించడానికి ఉన్న అవకాశాలు, ఇందుకయ్యే వ్యయంపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చే పనిని ప్రభుత్వం.. కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్‌కు అప్పగించింది. వ్యాప్కోస్ ఏడాదికిపైగా అధ్యయనం చేయడం తప్ప తుది నివేదిక ఇవ్వలేదు. మరోవైపు కన్సల్టెన్సీ సంస్థకు చెల్లించాల్సిన మొత్తం పెరిగినట్లు తెలిసింది.

అటవీ పరిహారం చెల్లిస్తేనే..: ప్రాణహిత ప్రాజెక్టుకు మొదటి దశ అనుమతి వచ్చి సుమారు ఆరునెలలైంది. 508 హెక్టార్ల అటవీ భూమిని బదిలీ చేసేందుకు కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ అంగీకరించింది. ఇందుకు పరిహారాన్ని చెల్లిస్తే రెండో దశ అనుమతి లభిస్తుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం రూ.102 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు చెల్లించకపోవడంతో రెండో దశ అనుమతి ప్రక్రియ ప్రారంభం కాలేదు. వన్యమృగ సంరక్షణ ప్రాంతంలో మరో 622 హెక్టార్ల భూమి బదలాయింపునకు కూడా మొదటి దశ అనుమతి లభించిందని, దీనికి ఎంత పరిహారం చెల్లించాలన్నది అటవీశాఖ అంచనా వేస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

అయోధ్య సమస్య భూ వివాదమే

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. తాను ఎలా వాదించాలో ఇతరులు ఎలా నిర్దేశిస్తారంటూ మరో పక్షం తరఫు న్యాయవాది రాజీవ్ ధావన్ తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ కవితాత్మకంగా వ్యాఖ్యానం చేశారు. "ప్రతిపాదనలు కావాలని మేమేమీ అడగడం లేదు. ప్రతిపాదనలు వస్తే ఊహాగానాలు వస్తాయి. ఊహాగానాల వల్ల ఏదో ఒక అభిప్రాయం కలుగుతుంది. అభిప్రాయాలు అబద్ధాలకు దారితీస్తాయి. అబద్ధాలతో అవివేకం కలుగుతుంది. అది ప్రమాదకరంగా మారి తప్పులకు కారణమవుతుంది. చివరకు మనిషినే చంపేస్తుంద"ని అన్నారు. ఈ కేసును రోజువారీ విచారించబోమని ధర్మాసనం తెలిపింది. న్యాయంకోసం దాదాపు 700 మంది పేదలు వేచి చూస్తున్నారని, వారి కేసులు పరిశీలించాల్సి ఉందని అన్నారు. సినీదర్శకుడు శ్యాం బెనెగల్, రచయిత కిరణ్ నాగర్‌కర్‌లు కేసులో జోక్యం చేసుకోవాలని భావిస్తున్నారని వారి తరఫు న్యాయవాదులు చెప్పగా, అవన్నీ తరువాత పరిశీలిస్తామని తెలిపింది. ఈ కేసులో బయట వారి జోక్యంవద్దని హిందూ, ముస్లిం సంస్థలు కోరాయి. 524 ఆధారాలను సమర్పించగా అందులో 504 వివిధ రకాల పత్రాలు ఉన్నాయి. మిగిలిన 20 ఆధారాల్లో రామాయణం, భగవద్గీత వంటి పుస్తకాలు ఉన్నాయి.

ముస్లిం నేతలతో శ్రీశ్రీ రవిశంకర్ భేటీ

బెంగళూరు: రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తిగా చేస్తున్న కృషిని ఆర్ట్ ఆఫ్ లివింగ్(ఏవోఎల్) వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ వేగవంతం చేశారు. సున్నీ వక్ఫ్ బోర్డు (ఎస్‌డబ్ల్యూబీ), అఖిల భారత ముస్లిం పర్సనల్ న్యాయ మండలి (ఏఐఎంపీఎల్‌బీ) సభ్యులు సహా ప్రధాన ముస్లిం నేతలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం కోర్టు వెలుపల పరిష్కారానికి ఎస్‌డబ్ల్యూబీ, ఏఐఎంపీఎల్‌బీ సభ్యులు మద్దతు పలికినట్లు ఏవోఎల్ ఓ ప్రకటన విడుదలచేసింది. 'మసీదును వేరే ప్రాంతానికి తరలించే ప్రతిపాదనకు ముస్లిం నేతలు మద్దతుపలికారు. ఈ విషయంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు'అని దానిలో పేర్కొంది. భిన్న సంస్థలకు చెందిన 16 మంది ముస్లిం నేతలు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, విద్యావేత్తలు సమావేశంలో పాల్గొన్నారని తెలిపింది. త్వరలో అయోధ్యలోనూ ఓ భారీ సమావేశం నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొంది. ఏఐఎంపీఎల్‌బీ కార్యనిర్వాహక సభ్యుడు మౌలానా సల్మాన్ హుస్సేన్ నద్వీ, ఉత్తర్ ప్రదేశ్ ఎస్‌డబ్ల్యూబీ ఛైర్‌పర్సన్ జుఫర్ అహ్మద్ ఫరూఖి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.అనీస్ అన్సారీ, లండన్‌కు చెందిన భారత హజ్ కమిటీ మాజీ ఛైర్మన్ అబూబకర్ సమావేశానికి హాజరయ్యారు. చర్చలకు మంచి స్పందన వస్తోందని ఇటీవల రవి శంకర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే విశ్వ హిందూ పరిషత్తు వీటికి దూరంగా ఉంటోంది.

ఆధార్‌తో బోలెడు ఆదా

(మొదటి పేజీ తరువాయి)

ఇది రూ.1.20 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 60% పెరిగింది. 2013-14లో యూపీఏ హయాంలో రూ.7367 కోట్లు బట్వాడా అయితే 2016-17కి వచ్చేసరికి అది పదింతలకు పైగా పెరిగి, రూ.74,707 కోట్లకు చేరింది.

ఇదీ 'ఆధార'ం...

- 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 63 కోట్ల మందికి పైగా ప్రజలు డీబీటీ ద్వారా మొత్తాలను పొందారు. వీరిలో ఉపాధి హామీ పథకం కింద వేతనాలను పొందిన వారు, వంటగ్యాస్ రాయితీ మొత్తాలను తీసుకున్నవారు కూడా ఉన్నారు.
- 2016-17లో 35 కోట్ల మంది ప్రజలు డీబీటీలో వివిధ పథకాల లబ్ధిని స్వీకరించారు. 2014 మేలో మోదీ సర్కారు కేంద్ర ప్రభుత్వ పగ్గాలను చేపట్టేనాటికి ఈ సంఖ్య 10 కోట్లు.
- ఈ ఏడాది మార్చి నాటికి 450 కేంద్ర పథకాలనూ డీబీటీ పరిధిలోకి తీసుకురావాలనేది సర్కారు వ్యూహం. ప్రస్తుతం 412 పథకాలు దీని కిందికి వచ్చాయి.

2017-18లో చెల్లింపులు ఇలా..

(7.2.2018 వరకు ఉన్న సమాచారం)

ఏ పద్దు కింద	ఎంత మొత్తం?
ఉపాధి హామీ వేతనాలు	రూ.28,623 కోట్లు
ఎల్‌పీజీ రాయితీ	రూ.20,610 కోట్లు
వివిధ ఉపకార వేతనాలు	రూ.10,042 కోట్లు
జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం	రూ.5831 కోట్లు
ఇతర పథకాలు	రూ.34,917 కోట్లు

గ్రహం అనుగ్రహం

9–2–2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
నవమి: మ. 2-37 తదుపరి దశమి
అనూరాధ నక్షత్రం: రా. 7-15 తదుపరి జ్యేష్ఠ
అమృత ఘడియలు: ఉ.8-02 నుంచి 9-45 వరకు
వర్జ్యం: రా. 1-22 నుంచి 3-07 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-48 నుంచి 9-34 వరకు
తిరిగి మ. 12-36 నుంచి 1-21 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-34; సూర్యాస్తమయం: సా.5-54

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.4	34.5
కరీంనగర్	15.0	32.0
రామగుండం	17.2	34.4
హైదరాబాద్	17.9	33.8
నిజామాబాద్	18.0	32.0
హన్మకొండ	18.0	34.5
మహబూబ్‌నగర్	20.0	35.0
సూర్యాపేట	20.0	35.0
ఖమ్మం	25.0	35.0

ఇదీ సంగతి!



నీట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

దిల్లీ: వైద్య, దంత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)కు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మే 6వ తేదీన నిర్వహించనున్న ఈ పరీక్ష కోసం మార్చి 9వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆన్‌లైన్‌లో రుసుమును మార్చి 10వ తేదీ రాత్రి 11.50 గం.ల వరకు చెల్లించవచ్చని సీబీఎస్ఈ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. అస్సాం, జమ్ముకశ్మీర్, మేఘాలయ మినహా మిగిలిన రాష్ట్రాల అభ్యర్థులు ఆధార్ సంఖ్యను దరఖాస్తులో నింపటం తప్పనిసరి. ఆధార్‌లో ఉన్న వివరాలతో (పేరు, పుట్టిన తేదీ తదితరాలు) సరిపోకపోతే దరఖాస్తును భర్తీ చేయటం సాధ్యంకాదని సీబీఎస్ఈ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కూడా 2018-19 విద్యా సంవత్సరం నుంచి తమకు సంబంధించిన ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల నుంచి 15శాతాన్ని అఖిల భారత కోటా కింద కేటాయించటానికి సమ్మతి తెలిపాయి. ఈ రెండు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా అఖిలభారత సీట్లను పొందటానికి అర్హులవుతారు. దీని వల్ల తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఎక్కువ సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశంఉంది. ఆన్‌లైన్ దరఖాస్తులను సీబీఎస్ఈనీట్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.


FIND YOUR
KIND OF PEOPLE
Join Groups
Whether you're into pet clubs, healthy living or sci-fi you'll always find someone that loves what you love with Facebook Groups. Just search for the Groups that interest you and click 'Join' to connect with like-minded people around the world.

ఈనాడు

వ్యర్థాల ఘన నిర్వహణ

ఘనవ్యర్థాల నిర్వహణలో వైఫల్యాల కారణంగా దోమల సంతతి విస్తరించి ప్రబలిన డెంగీ వల్ల ఏడేళ్ల బాలుడి ఆయువు ఆవిరైన ఉదంతంపై తనంత తానుగా (సు మోటో) విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం- గత డిసెంబరులో ప్రభుత్వాల అలసత్వాన్ని సూటిగా ఆక్షేపించింది. స్వచ్ఛతాస్ఫూర్తితో దేశవ్యాప్తంగా అమలుపరచ తలపెట్టిన నిబంధనావళిపై రాష్ట్రాలనుంచి సమాచారం రాబట్టి కేంద్రం తాజాగా సమర్పించిన 845 పుటల ప్రమాణపత్రాన్ని సుప్రీంకోర్టు, చెత్తగా తూష్ణీకరించింది. వ్యర్థాలు తీవ్ర అనర్థదాయకాలు కానివ్వని సమగ్ర కార్యాచరణ ఎండమావి కావడంపై 'సుప్రీం' ధర్మాగ్రహమిది! దేశంలో పద్దెనిమిదేళ్ల క్రితం వండివార్చిన నిబంధనల్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదని ఉన్నమాట చెప్పిన న్యాయస్థానం, 2016 సంవత్సరంలో క్రోడీకరించిన విధివిధానాలు నేటికీ మన్ననకు నోచుకోవడం లేదని తప్పుపట్టింది. ఇప్పటివరకు 22 రాష్ట్రాలనుంచి సేకరించి అదనపు సొలిసిటర్ జనరల్ నద్కర్ణి చేతులమీదుగా సమక్షానికి చేరిన దస్త్రాన్ని పరిశీలనార్హమే కాదంటూ తోసిపుచ్చిన గౌరవ న్యాయమూర్తుల మాట స్పందన- తక్షణ దిద్దుబాటు చర్యల్ని అభిలషిస్తోంది. 2016లో నోటిఫై అయిన ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ నిబంధనావళి- సంవత్సరాలలోపు, రెండేళ్లలోగా ఎక్కడెక్కడ ఏమేమి వసతుల పరికల్పన పూర్తికావాలో స్పష్టంగా గిరిగీసింది. 2016 ఏప్రిల్ ఎనిమిదో తేదీన అధికారిక నోటిఫికేషన్ జారీ దరిమిలా దాదాపు రెండేళ్లు కావస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో తగినంత చురుకుదనం కొరవడిందనడంలో మరోమాట లేదు. సులభతర నిబంధనల్ని ఆచరించని ప్రజాప్రభుత్వాలు కఠిన నియమావళిని ఎలా పట్టాలకు ఎక్కించగలవంటున్న సుప్రీం ప్రశ్నలో- చెత్తశుద్ధి పట్ల చిత్తశుద్ధి ఎక్కడుందన్న ఆవేదన ప్రతిధ్వనిస్తోంది!

అధికారిక గణాంకాల ప్రకారం, దేశంలో ఏటా ఆరుకోట్ల 20 లక్షల టన్నుల భూరిపరిమాణంలో చెత్త ఉత్పత్తవుతోంది. అందులో ప్లాస్టిక్ వ్యర్థాల వాటా 56లక్షల టన్నులు. 79లక్షల టన్నుల వరకు హానికర వ్యర్థాలు, 15లక్షల టన్నుల మేర ఇ-వ్యర్థాలతోపాటు భారీగా జీవ వ్యర్థాలూ పోగుపడుతున్నాయి. పురపాలక సంస్థలు సేకరిస్తున్న సుమారు నాలుగు కోట్ల 30లక్షల టన్నుల చెత్తలో పరిశుద్ధీకరణ, పునర్వినియోగ ప్రక్రియలకు నోచుకుంటున్నది 22-28శాతమేనని ప్రభుత్వమే అంగీకరిస్తోంది. దిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ వంటి మహానగరాల్లో ప్రతిరోజూ వేలటన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. ఈ ఉరవడికి పగ్గాలు బిగించే మహదాశయంతో 2019 అక్టోబరు నాటికి నాలుగు వేలకుపైగా నగరాలు, పట్టణాల్లో ఘనవ్యర్థాల శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం నిబద్ధత చాటింది. 'స్వచ్ఛభారత్' నినాదంతో చెత్తనుంచి విద్యుత్, ఎరువుల తయారీకి ప్రణాళికలు అల్లింది. ఆ ఘన సంకల్పానికి, వాస్తవిక కార్యాచరణకు మధ్య ఎంత అంతరముందో రెండున్నర నెలలనాటి క్షేత్రస్థాయి అధ్యయన వివరాలు తెలియజెప్పాయి. దేశవ్యాప్తంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం సగం పురపాలక వార్డుల్లోనే అమలవుతోందన్న యథార్థం బహిర్గతమై దిగ్భ్రాంతపరచింది. రమారమి 83వేల మున్సిపల్ వార్డుల్లో 44,650 వార్డుల్లోనే చెత్తసేకరణ జరుగుతుండటం తక్షణ మరమ్మతు చర్యల ఆవశ్యకతను ఉద్బోధించింది. అధికశాతం వ్యర్థాల్ని నగర శివార్లలో పారబోస్తుండటం, కొన్నింటిని తగలబెడుతుండటంవల్ల గాలి, నేలతోపాటు భూగర్భ జల వనరులూ విషకలుషితమైపోతున్నాయి. దేశంలో చనిపోతున్న ప్రతి ఆవు, గేదె ఉదరంలోనూ కనీసం 30 కిలోల ప్లాస్టిక్ బయటపడటం, చాలాచోట్ల భూగర్భ డ్రెయినేజీలు పూడిపోవడం, శ్వాసకోశ వ్యాధులు ముమ్మరించడం- వ్యర్థాల నిర్వహణ దుస్థితిగతుల్ని కళ్లకు కడుతున్నాయి. మరిన్ని పకడ్బందీ చర్యలు ఉపక్రమించాల్సిన దశలో ఇటీవలి కేంద్ర బడ్జెట్ 'స్వచ్ఛభారత్' పద్దుకింద కేటాయింపుల్ని తెగ్గోయడం- స్వచ్ఛతా స్ఫూర్తికి తూట్లు పొడిచేదే.

టన్నుల కొద్దీ చెత్తను పేరబెట్టినా, అశాస్త్రీయ పద్ధతుల్లో తగలబెట్టినా ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పు తప్పదు. ఈ పెను విపత్తును అధిగమించేందుకు వ్యర్థాల రాశిని ఆర్థికోత్పత్తి వనరుగా మలచడమే తెలివైన పరిష్కారమని భాగ్యనగర వేదికపై ఇటీవలి అంతర్జాతీయ సదస్సు పిలుపిచ్చింది. 2020 నాటికి ప్రతి దేశం సగానికి సగం చెత్తను పునర్వినియోగించాల్సిందేనని తనవంతుగా ఐరోపా పర్యావరణ సమాఖ్య నిర్దేశించింది. వాస్తవానికి, నలభై దశకంలోనే చెత్తనుంచి విద్యుత్ తయారీ కర్మాగారాలు నెలకొల్పిన స్వీడన్ ఇప్పుడు ఒక్కశాతం కంటే తక్కువ వ్యర్థాలనే వృథాగా పారబోస్తోంది. ఘన వ్యర్థాల్లో 47శాతాన్ని పునర్వినియోగిస్తున్న జర్మనీ 36శాతాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భస్మీకరణం (ఇన్సినిరేషన్) చెందిస్తోంది. పౌరులు, దుకాణాలు, పరిశ్రమలకు బాధ్యత మప్పి, పునశ్శుద్ధి మౌలిక సదుపాయాలు ఏర్పరచి అమెరికా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఆస్ట్రియా ప్రభృత దేశాలు మన వ్యర్థాల నిర్వహణలో సరికొత్త ఒరవడి దిద్దుతున్నాయి. దేశీయంగా పట్టణ వ్యర్థాలతో గ్రామాలకు ఎరువుల తయారీని ప్రోత్సహించడమే ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, పరిమిత సంఖ్యలోని పంచాయతీల్లోనే ఫలితాలందిస్తున్నాయి. వాడేసిన ప్లాస్టిక్‌తో రహదారుల నిర్మాణం పదకొండు రాష్ట్రాల్లో 10-12 వేల కిలోమీటర్ల నిడివిలోనే సాధ్యపడింది. వ్యర్థాల సేకరణ, విభజన, పునశ్శుద్ధి కేంద్రాలకు తరలింపు, ఎరువులుగా విద్యుత్తుగా రూపాంతరీకరణ... పకడ్బందీగా సాగే సుదృఢ యంత్రాంగాన్ని దేశంలో అవతరింపజేయడం తక్షణావసరం. వ్యర్థాల రూపేణా అనర్థాల నివారణను లక్షించి నియమ నిబంధనల్ని క్రోడీకరించడం ఒకెత్తు. ఆ స్ఫూర్తికి గొడుగుపట్టేలా పురపాలికలకు అన్నిందాలా సహాయ సహకారాల అందజేతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబద్ధ భూమిక పోషించడం మరొకెత్తు. ఆ మేరకు ప్రజా ప్రభుత్వాలు విద్యుక్త ధర్మం నిర్వర్తిస్తూ, పౌర సమాజాన్నీ జాగృతపరచి నిర్ణాయక భాగస్వామ్యం కల్పిస్తేనే- చెత్త సమస్యల పీడ దేశానికి విరగడయ్యేది!

ఖాతాదారులపై చర్నాకోలా బ్యాంకుల వసూళ్ల మేళా!





తుమ్మల కిశోర్

మొండి బాకీల భారంతో సతమతమవుతున్న బ్యాంకులు మార్గాంతరాలు అన్వేషిస్తున్నాయి. సమస్య తీవ్రతనుంచి బయటపడేందుకు రుణ ఎగవేతదారులకు చేయూతనిచ్చేందుకూ సిద్ధపడుతున్నాయి. అవి రుణ పునర్వ్యవస్థీకరణ పథకాలతో ముందుకు వచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల మొండిబాకీలు అనూహ్యంగా పెరుగుతూనే ఉన్నాయి. సగానికిపైగా పీఎస్‌బీలు 'తక్షణ దిద్దుబాటు చర్యల' జాబితాలో చేరి ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదంతా ఒక పార్శ్వం. మరోవైపు ఆశించిన మేర రుణ గిరాకీ పెరగడం లేదు. నికరవడ్డీ మార్జిన్లు తగ్గుముఖం పడుతున్నాయి. ఫలితంగా బ్యాంకులు వడ్డీయేతర ఆదాయంపై దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు ఖాతాదారులు, మదుపుదారులపై సేవా, అపరాధ రుసుముల భారం పెంచుతున్నాయి. గతంలో ఉచితంగా అందించిన పలు బ్యాంకింగ్ సేవలపై ఇప్పుడు ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. పొదుపు ఖాతాలలో నిర్దేశిత కనీస మొత్తంలేని ఖాతాలపై అపరాధ రుసుం వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు బ్యాంకులు ఈ బాదుడు భారీగా పెంచేయగా- పీఎస్‌బీలూ స్వల్పంగా ఏదో స్థాయిలో ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. అంతేకాక నగదు లావాదేవీలపై రుసుములు వసూలు చేయడంతోపాటు ఏటీఎంల ద్వారా పరిమితికి మించి లావాదేవీలు జరిపిన వారిపై రుసుములు వసూలు చేస్తున్నాయి. గతంలో అపరిమితంగా నగదు లావాదేవీలను అనుమతించిన బ్యాంకులు, ఇప్పుడు పలు ఆంక్షలు విధించడంతోపాటు అదనపు రుసుములు వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు బ్యాంకులు పొదుపు ఖాతాలలో కనీస మొత్తం లేని ఖాతాలపై రూ.350 నుంచి రూ.600 దాకా రుసుము వసూలు చేస్తుండగా- పీఎస్‌బీలు రూ.20 నుంచి రూ.50 దాకా ఛార్జి చేస్తున్నాయి. కొన్ని పీఎస్‌బీలు సాధారణ పొదుపు (నో-ఫ్రిల్స్) ఖాతాలకు, జన్‌ధన్ ఖాతాలకు, పింఛను ఖాతాలకు ఈ ఛార్జీలనుంచి మినహాయింపునిస్తున్నాయి. కానీ, ప్రైవేటు బ్యాంకులు అన్ని ఖాతాలపైనా ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. బ్యాంకులు పొదుపు ఖాతాల నిర్వహణకు, చెక్కుపుస్తకాల జారీ, ఏటీఎం/డెబిట్ కార్డుల జారీ వంటి సేవలపై కొంత వ్యయం భరించాల్సి ఉంటుందన్నది కాదనలేని వాస్తవం. వీటికయ్యే వ్యయాన్ని పూర్తిగా ఖాతాదారులపైనే వేయడం ఎంత వరకు సబబు అన్నదే చర్చనీయాంశం.

అదనపు రుసుముల బాదుడు వద్దు

ఒకవైపు ఎగవేతదారులకు వడ్డీ రాయితీలు కల్పిస్తూ- మరోవైపు ఖాతాదారులు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించే రీతిలో అపరాధ రుసుములు, ఛార్జీలు వసూలు చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఇటీవల ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్-నవంబరు) పొదుపు ఖాతాల్లో కనీస మొత్తంలేని కారణంగా వసూలు చేసిన ఛార్జీలు రూ.1,771.67 కోట్లు! ఈ మొత్తం బ్యాంకు రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబర్)లో ఆర్జించిన రూ.1,581.55 కోట్ల నికర లాభం కంటే ఎక్కువ! పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు ఉంచని ఖాతాదారుల నుంచి ఛార్జీలు వసూలు చేసే పద్ధతికి ఎస్‌బీఐ 2012లోనే స్వస్తి పలికింది. ఈ విధానాన్ని నిరుడు తిరిగి ప్రవేశపెట్టింది. ఇతర పీఎస్‌బీలు సైతం వడ్డీయేతర ఆదాయం పెంచుకొని నష్టాలు తగ్గించుకొనే లక్ష్యంతో ఖాతాదారులు, డిపాజిటర్లకు అందించే సేవలపై ఛార్జీలు వసూలు చేయడం ప్రారంభించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌బీలు సగటున రూ.50 కోట్ల నుంచి రూ.150 కోట్ల దాకా ఈ విధమైన రుసుములు వసూలు చేశాయి. కొన్ని ప్రైవేటు బ్యాంకులు సేవా రుసుముల్ని మరింత పెంచేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి! ముందస్తు రుణ చెల్లింపుల విషయంలోనూ బ్యాంకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. వ్యక్తిగత రుణగ్రహీతలు వారి రుణాలను గడువుకంటే ముందుగా చెల్లించినట్లయితే కొన్ని బ్యాంకులు అపరాధ రుసుములు విధిస్తుండగా- మరికొన్ని బ్యాంకులు షరతులు/పరిమితులు విధిస్తున్నాయి! రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం రిటైల్ రుణాలను ముందస్తుగా చెల్లించడంపై బ్యాంకులు ఎటువంటి రుసుములు, ఆంక్షలు విధించకూడదు. అయినప్పటికీ కొన్ని ప్రైవేటు బ్యాంకులు ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు చెల్లింపులపై ఆంక్షలు విధిస్తున్నాయి. ఒకవైపు రుణ ఎగవేతదారులకు వడ్డీ రాయితీలు ప్రకటిస్తూ- మరోవైపు తీసుకున్న అప్పును గడువుకంటే ముందే తీర్చివేయాలనుకున్న రుణగ్రహీతలకు రుసుముల వాత పెట్టడం పూర్తిగా అసమంజసం!

అయోమయంలో మదుపుదారులు

ఒకవైపు తగ్గుతున్న డిపాజిట్ల వడ్డీరేట్లు, మరోవైపు ఎఫ్‌ఆర్‌డీఐ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) బిల్లుపై కొనసాగుతున్న సందిగ్ధత మదుపుదారులను అయోమయంలో పడేసింది. ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లులో పొందుపరిచిన 'బెయిల్-ఇన్' నిబంధన ప్రకారం ఏదైనా బ్యాంకు విఫలమైన సందర్భాల్లో ఆ బ్యాంకులో ఉన్న డిపాజిట్లను సైతం డిపాజిటర్ల అనుమతి లేకుండా వినియోగించుకొనే వీలుంది. ఈ నిబంధనపై సర్వత్రా నిరసన వ్యక్తమవడంతో బిల్లులో కొన్ని సవరణలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తాజాగా రిజర్వుబ్యాంకు, 'ఐఆర్‌డీఏ'లతోసహా పలు ఆర్థిక సంస్థలు ఈ బిల్లుపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తం



పెచ్చుమీరిన వ్యాపార దృక్పథం

చేశాయి. తత్ఫలితంగా ప్రభుత్వం బిల్లులో పలు సవరణలు చేసేందుకు సుముఖంగా ఉంది. అయితే డిపాజిటర్లు ఇప్పటికే బ్యాంకుల నుంచి డిపాజిట్లు తిరిగి తీసుకోవడం మొదలుపెట్టారు. డిపాజిటర్ల సొమ్ము భద్రంగా ఉంటుందని ఆ బిల్లులో అవసరమైన సవరణలు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ మదుపుదారుల్లో అభద్రత భావం నెలకొంది. పెద్దనోట్ల రద్దు అనంతరం చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా సామాన్య డిపాజిటర్లు బ్యాంకులకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితిని వెంటనే చక్కదిద్దాల్సిన బాధ్యత రిజర్వుబ్యాంకుపై ఉంది. అదేవిధంగా ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుపై దూకుడుగా వ్యవహరించకుండా డిపాజిటర్ల సొమ్ముకు పూర్తి భద్రత కల్పించే దిశలో చర్యలు తీసుకోవాలి.

మరోవైపు బ్యాంకులు వాటి డిపాజిటర్ల వడ్డీరేట్లను క్రమంగా తగ్గించడంతో సామాన్య డిపాజిటర్లకు, పింఛనుదారులకు, బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీపైనే ఆధారపడ్డ వారందరికీ ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. పొదుపుపై రాబడి తగ్గి సామాన్య మదుపరులు ప్రత్యామ్నాయ మార్గాలవైపు దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికీ అధికశాతం మదుపరులు బ్యాంకు డిపాజిట్ పథకాలలోనే వెచ్చిస్తున్నారన్నది నిజం. ముఖ్యంగా పట్టణ, గ్రామ ప్రాంతాల ప్రజలు వారి సొమ్మును బ్యాంకుల్లోనే పొదుపు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో బ్యాంకులు డిపాజిట్ వడ్డీ రేట్లను తగ్గించడంతో నగరాల్లో ఉన్న కొంతమంది మదుపరులు మ్యూచువల్ ఫండ్లవైపు దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం సంవత్సర కాలపరిమితి డిపాజిట్లపై ప్రభుత్వరంగ బ్యాంకులు సగటున 6.25శాతం నుంచి 6.75 శాతం దాకా వడ్డీ ఇస్తుండగా ప్రైవేటు బ్యాంకులు 6.75శాతం నుంచి 6.85 శాతం దాకా ఇస్తున్నాయి. సహకార బ్యాంకులు 7శాతం నుంచి 7.5 శాతందాకా వడ్డీ ఇస్తున్నాయి. అదేవిధంగా బ్యాంకులు వాటి పొదుపు ఖాతాల వడ్డీరేట్లనూ తగ్గించాయి. గతంలో పీఎస్‌బీలు వాటి పొదుపు ఖాతాలపై నాలుగు శాతం వడ్డీని ఇచ్చేవి. ప్రస్తుతం చాలా బ్యాంకులు ఈ వడ్డీరేటును మూడు శాతానికి తగ్గించాయి. కొన్ని బ్యాంకులు 3.5 శాతం వడ్డీ ఇస్తున్నాయి. కొన్ని ప్రైవేటు బ్యాంకులు మాత్రం ఆరు శాతందాకా వాటి పొదుపు ఖాతాలపై వడ్డీనిస్తున్నాయి. కొంతకాలంగా రిజర్వుబ్యాంకు కీలక రేట్లలో ఎటువంటి మార్పులూ చేయలేదు. అయినప్పటికీ బ్యాంకులు వాటి డిపాజిట్లపై వడ్డీరేట్లను మాత్రం దారుణంగా తెగ్గోశాయి. రుణవితరణ అంచనాల మేరకు పెరగకపోవడం, బ్యాంకుల వద్ద నిధుల లభ్యత పుష్కలంగా ఉండటం వల్ల బ్యాంకులు వాటి డిపాజిట్ల వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. మరోవైపు కొన్ని ప్రైవేటు బ్యాంకులు వాటి ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్)లను స్వల్పంగా పెంచుతున్నాయి. తత్ఫలితంగా రుణ వడ్డీరేట్లు పెరుగుతాయి. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం క్రమంగా పెరిగి భవిష్యత్తులో వడ్డీరేట్లు ఇనుమడించే అవకాశం ఉంది. డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం 4.88శాతం నుంచి 5.21 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతం స్థాయికి పరిమితం చేయాలన్న రిజర్వు బ్యాంకు లక్ష్యం ఇప్పట్లో నెరవేరేలా కనబడటం లేదు. ఏదిఏమైనా చిన్న మదుపరుల ప్రయోజనాలను కాపాడే దిశలో బ్యాంకులు డిపాజిట్ల వడ్డీ రేట్లను సవరించాల్సిన అవసరం ఉంది. అంతేకాక అధికశాతంలో ఉన్న చిన్న డిపాజిటర్లు, ఖాతాదారుల పట్ల పీఎస్‌బీలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

సేవా స్ఫూర్తి ప్రతిఫలించాలి

దేశవ్యాప్తంగా నగదు లభ్యత విషయంలో సామాన్య ప్రజలు ఇప్పటికీ సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. కొన్ని ప్రాంతాలలో ఏటీఎంల ద్వారా నగదు తీసుకోవడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో కొన్ని బ్యాంకు శాఖల్లో పెద్దమొత్తాలలో నగదు తీసుకోవడంలో ఖాతాదారులు ఇబ్బందిపడుతున్నారు. ఒకపక్క బ్యాంకులకు తగినంత నగదు సరఫరా చేస్తున్నామని రిజర్వు బ్యాంకు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నగదు కొరత ఇంకా కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా గ్రామ ప్రాంతాలలో నగదు కోసం ఖాతాదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు అటు రిజర్వు బ్యాంకు, ఇటు బ్యాంకు యాజమాన్యాలు చర్యలు ముమ్మరం చేయాలి. అంతేకాక బ్యాంకులు వాటి వడ్డీయేతర ఆదాయాన్ని పెంచుకొనేందుకు సామాన్య ఖాతాదారులను లక్ష్యంగా చేసుకొని వారిపై సేవారుసుములు, అపరాధ రుసుముల రూపంలో అదనపు భారం వేయకుండా చర్యలు తీసుకోవాలి. పొదుపు ఖాతాల్లో కనీస మొత్తం నిబంధన పాటించని ఖాతాదారులపై అపరాధ రుసుము వసూలుచేసే విధానానికి స్వస్తి పలకాలి. ముఖ్యంగా చిన్న మదుపరులు, వయోవృద్ధులు, పింఛనుదారుల విషయంలో బ్యాంకులు మరిన్ని ప్రయోజనాలను కల్పించే దిశలో చర్యలు చేపట్టాలి. బ్యాంకులు వాటి ఆదాయాల్ని పెంచుకొనేందుకు నిర్వహణా వ్యయాలను తగ్గించుకోవడంతోపాటు ఇతరత్రా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలేతప్ప సాధారణ డిపాజిటర్లపై ఖాతాదారులపై ఎడాపెడా రుసుములు వడ్డించడం సరికాదు. బ్యాంకులు వాటి నష్టాలను పూడ్చుకొని నిరర్థక ఆస్తుల ఊబినుంచి బయటపడే క్రమంలో సామాన్య ఖాతాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాలను, విశ్వాసాన్ని పణంగా పెట్టడం అసంబద్ధం. గతంలో బ్యాంకులు ఉచితంగా అందించిన బ్యాంకు సేవలను యథాతథంగా కొనసాగించడంతోపాటు పొదుపు ఖాతాలలో కనీస మొత్తం లేని ఖాతాలపై విధించే రుసుములపై బ్యాంకులు పునస్సమీక్షించి వాటికి స్వస్తిపలికే దిశలో చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఏటీఎంల ద్వారా నగదు తీసుకోవడంపై ప్రస్తుతం బ్యాంకులు విధించిన పరిమితులను సడలించాల్సి ఉంది. గ్రామప్రాంతాల్లో ఉన్న ఖాతాదారులకు సేవారుసుములనుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలి. సేవారుసుములు, అపరాధ రుసుముల అంశాలు ఆయా బ్యాంకులకు సంబంధించినవి కాబట్టి బ్యాంకులు అన్ని సేవలను వ్యాపారదృక్పథంతో చూడకుండా సేవాస్ఫూర్తిని జోడించి ఖాతాదారులకు కొంత ఉపశమనాన్ని కల్పించే ప్రయత్నం చేయాలి.

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

అక్రమాల ఖిలీదా

పాలకులు ప్రజాధనానికి ధర్మకర్తలు. దాన్ని ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికే వినియోగించాలి. నిధుల వినియోగంలో పారదర్శకంగా, ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా, స్వలాభాపేక్షకు తావులేకుండా వ్యవహరించాలి. అందుకు భిన్నంగా మసలితే, ఏదో ఒకరోజు శిక్ష అనుభవించక తప్పదు. చరిత్ర చెబుతున్న సత్యమిది. దేశం ఏదైనా, పాలకులు ఎవరైనా ఇటువంటి పరిస్థితి అనివార్యం. అధికారంలో ఉన్నప్పుడు తమకు ఎదురులేదని భావించి అడ్డగోలుగా పాల్పడిన అనుచిత చర్యలకు ఎవరెంతటివారైనా అంతిమంగా ఎప్పుడో ఒకప్పుడు బాధ్యత వహించక తప్పదు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా పరిస్థితి ఇందుకు తాజా దృష్టాంతం.

అవినీతి పరంపర

రెండుసార్లు దేశ ప్రధానిగా చక్రం తిప్పిన 72 సంవత్సరాల ఖలీదా ఇప్పుడు కటకటాల పాలయ్యారు. చిన్న పిల్లల చారిటబుల్ ట్రస్ట్‌కు వినియోగించాల్సిన నిధులను దుర్వినియోగం చేసిన కేసులో ఆమెకు ఢాకాలోని ప్రత్యేక న్యాయస్థానం అయిదేళ్ల జైలుశిక్ష విధించింది. సమాజంలో ఆమె హోదాను, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని 409, 109 సెక్షన్ల కింద ఈ శిక్ష విధించారు. ఈ కేసులో జియా కుమారుడు తారిఖ్ రెహమాన్, మరో నలుగురికి న్యాయమూర్తి మహ్మద్ అక్తేరుజ్మాన్ పదేళ్ల జైలుశిక్ష విధించారు. మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో భాగంగా ఖలీదా ఎన్నోసార్లు కారాగారాల్లో ఉన్నారు. 80ల్లో అప్పటి సైనిక పాలకుడు ఎర్షాద్‌కు వ్యతిరేకంగా, 2007-08లో నాటి తాత్కాలిక ప్రభుత్వానికి నిరసన పోరాటంలో భాగంగా జైలుకు వెళ్లారు. కానీ ఓ కేసులో దోషిగా జైలుకు వెళ్లడం ఇదే ప్రథమం. తనను రాజకీయంగా అణచివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టిందని ఖలీదా ఆరోపిస్తుండగా, అలాంటిదేమీ లేదని ప్రభుత్వ వర్గాలు ఖండిస్తున్నాయి.

బంగ్లాదేశ్ పేరు చెప్పగానే ముందుగా ప్రస్తుత ప్రధాని షేక్ హసీనా వాజెద్, బేగం ఖలీదా జియాలే గుర్తుకు వస్తారు. రెండు దశాబ్దాలుగా దేశ రాజకీయాలు వీరిద్దరి చుట్టూనే తిరుగుతున్నాయి. హసీనా అవామీలీగ్ సారథిగా, ఖలీదా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధ్యక్షురాలిగా దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారు. బంగ్లా రాజకీయాల్లో ఉప్పునిప్పుగా వ్యవహరిస్తారని వీరికి పేరుంది. ఒకరి పొడంటే మరొకరికి ఎంతమాత్రం గిట్టదు. ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఖలీదా ఆషామాషీ నాయకురాలు కాదు. బంగ్లా రాజకీయాల్లో గట్టి పట్టున్న నేత. దేశ తొలి మహిళా ప్రధానిగా ఆమె చరిత్ర సృష్టించారు. ముస్లిం ప్రపంచంలో పాకిస్థాన్‌కు చెందిన బెనజీర్ భుట్టో తరవాత రెండో మహిళా ప్రధాని ఆమే. తన భర్త, మాజీ సైనిక పాలకుడు జనరల్ జియావుర్ రెహమాన్ స్థాపించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)ని ఆయన తదనంతరం సమర్థంగా ముందుకు నడిపించారు. రెండుసార్లు (1991-96), (2001-06) దేశ ప్రధానిగా వ్యవహరించారు. దేశంలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిందీ ఖలీదాయే. జైలుశిక్షకు గురైన తొలి ప్రధానిగానూ ఆమె పేరిప్పుడు చరిత్రలో మిగిలిపోనుంది. జైలుశిక్ష పొందిన దరిమిలా ఈ ఏడాది డిసెంబరులో జరగ



నున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ఆమె అనర్హులవుతారు. ఆమె కుమారుడిదీ ఇదే పరిస్థితి. 2006 నుంచి రెండు దఫాలుగా ఎన్నికల్లో ఓడిపోయిన ఆమెకు మున్ముందు గడ్డు కాలమే. భారత్ వ్యతిరేకిగా ఖలీదాకు పేరుంది. ఆమె హయాములో భారత్-బంగ్లా సంబంధాలు సజావుగా ఉండేవి కావు. ఖలీదాపై అవినీతి ఆరోపణలు కొత్తేమీ కాదు. గతంలోనూ ఎన్నో వచ్చాయి. ఆమె పెద్ద కుమారుడు, పార్టీ సీనియర్ వైస్ ఛైర్మన్ తారిఖ్ రహమాన్‌పై సైతం అనేక ఆరోపణలు ఉన్నాయి. తల్లి అధికారంలో ఉన్న సమయంలో ఆయన రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించారన్న విమర్శలు బలంగా వినిపించేవి. తల్లి తరఫున అన్ని

బంగ్లాదేశ్ ఉదంతం- నేర్పుతున్న పాఠాలు

పనులను చక్కబెట్టేవారు. ఖలీదా రెండో దఫా పదవీకాలంలో అవినీతి, అక్రమాలు పెచ్చరిల్లాయన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. 2003లో అనేకమంది ఆశ్రితులకు ప్రభుత్వ కాంట్రాక్టులు దక్కాయి.

ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది పాలకులు తమ పదవీకాలంలో అనుచిత చర్యలు, అక్రమాలకు పాల్పడి అనంతర కాలంలో ఫలితం అనుభవించారు. గత ఏడాదిలో బ్రెజిల్ మాజీ ప్రధాని లులాడా సిల్వా మనీ లాండరింగ్ కేసులో పదేళ్ల శిక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. నిరుడు చివర్లో సౌదీ అరేబియా రాజ కుటుంబానికి చెందిన అల్వాలీద్ బిన్ తలాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోయిన సంవత్సరం పనామా పత్రాల కుంభకోణం కేసులో పొరుగునే ఉన్న పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ పదవీచ్యుతుడయ్యారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆ కేసులో ఆయన పాత్రను నిర్ధారించడంతో షరీఫ్ గద్దె నుంచి దిగిపోక తప్పలేదు. ఇందులో పాత్ర ఉన్నట్లు వెలుగులోకి వచ్చిన సమయంలోనే ఐస్‌ల్యాండ్ ప్రధాని రాజీనామా చేశారు. ఈ కుంభకోణంలో రష్యా సహా పలువురు దేశాధినేతల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెలుగు చూశాయి. అవినీతి ఆరోపణల కారణంగా దక్షిణ కొరియా అధ్యక్షురాలు పార్క్ గ్యున్‌హై పోయిన ఏడాది మార్చిలో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అభివృద్ధి చెందిన దేశం సారథిగా గుర్తింపు పొందిన ఆమె దుస్థితికి కారణం స్వయంకృతాపరాధమే. 2012లో దేశ తొలి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికై ఆమె సంచలనం సృష్టించారు. గతంలో ఇద్దరు దేశాధ్యక్షులు పదవీ విరమణ అనంతరం కారాగారానికి వెళ్లాల్సి వచ్చింది. 2005 నుంచి 2012 వరకు హాంకాంగ్ సీఈవోగా పనిచేసిన డొనాల్డ్ తసాంగ్ అధికారంలో ఉండగా అనుచిత చర్యలకు పాల్పడినందుకు ఆ దేశ హైకోర్టు కటకటాల వెనక్కు పంపింది.

పటిష్ఠ చట్టాలతోనే ముకుతాడు

ఈజిప్టు అధ్యక్షుడు, ముస్లిం బ్రదర్ హుడ్ పార్టీ అధినేత మహ్మద్ మోర్సీకి 2017లో స్థానిక న్యాయస్థానం ఇరవై సంవత్సరాల జైలుశిక్ష విధించింది. 2012లో తన పదవీకాలంలో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమకారుల అక్రమ అరెస్టు, ఊచకోత కేసులో మోర్సీ కటకటాలపాలయ్యారు. గతంలో ఈజిప్టును సుదీర్ఘకాలం పాలించిన హోస్నీ ముబారక్ సైతం ఇదే పరిస్థితి ఎదుర్కొన్నారు. ముబారక్‌తో పాటు, ఆయన ముగ్గురు తనయులకూ జైలుశిక్ష తప్పలేదు. ముబారక్‌కు మూడేళ్లు, తనయులకు నాలుగేళ్ల చొప్పున శిక్ష పడింది. ముబారక్ మూడు దశాబ్దాలకు పైగా దేశానికి తిరుగులేని నేతగా కొనసాగారు. దేశ రాజకీయాలను గుప్పిట పట్టారు. చివరికి నిధుల దుర్వినియోగం కేసులో 90 సంవత్సరాల వయసులో జైలుకు వెళ్లాల్సి రావడం స్వయంకృతమేనని చెప్పక తప్పదు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ఉదాహరణలకు లెక్కే లేదు. మన దేశం కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. దేశాన్ని పట్టిపీడిస్తున్న అన్నిరకాల రుగ్మతలకూ తల్లివేరు అవినీతి. అటుఇటుగా రెండుకోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడినందుకే ఖలీదా జియాను జైలుపాలు చేసిన బంగ్లా ఉదంతం- వందలు, వేల కోట్ల రూపాయల అవినీతికి తెగబడీ బోరవిరుచుకు తిరుగుతున్న అక్రమార్కులు అడుగడుగునా నిండిన భారతావనికి సరికొత్త పాఠాలు నేర్పుతోంది. జాతి ఆర్థిక వ్యవస్థను నలుచుకుతింటున్న అవినీతి జాడ్యాన్ని చూసిచూడనట్లు వదలివేసే నిర్లక్ష్యానికి చెల్లుచీటీ చెప్పాల్సిన సమయమిది. దశాబ్దాల నాటి పశుదాణా కుంభకోణం కేసులో బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలు ప్రసాద్ యాదవ్, ఝార్ఖండ్ రాజధాని రాంచీలోని బిర్సా ముండాలో ఊచలు లెక్కపెడుతున్నారు. ఇదే కేసులో తాజాగా మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా జైలుకెళ్లారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఆయన అక్రమాల చరిత్ర తెలిసిందే. తెరవెనక ఉంటూ తమిళనాడు రాజకీయాల్లో చక్రం తిప్పిన శశికళ జైల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. జయలలిత అనంతరం ముఖ్యమంత్రి కావాలని ఆమె ఉవ్విళ్లూరారు. పటిష్ఠమైన చట్టాలతో పాటు పాలకుల్లో నైతిక విలువలు పాదుకొన్నప్పుడే అవినీతి, అక్రమాలకు కొంతవరకైనా అడ్డుకట్ట పడుతుంది.

– జి.మారుతీ లత

మనోధర్మం

మొగ్గ సంపూర్ణంగా విచ్చుకుంటేనే సౌరభంతో కూడిన సౌకుమార్యం ఇనుమడిస్తుంది. చూసే అందరికీ అది ఆనందం కలిగిస్తుంది. మొక్క ఏపుగా పెరిగి శాఖోపశాఖలై విస్తరిస్తేనే 'కల్ప వృక్షం'గా పేరు పొందుతుంది. చంద్రుడు ఆకాశాన దేదీప్యమానంగా వెలిగితేనే, ఆ పున్నమి ఆహ్లాదభరితం. సృష్టిలో ఏదైనా వికసిస్తేనే, దానికి పరిపూర్ణత సిద్ధించినట్లు! దాని నుంచే జ్ఞాన, మనో వికాసాలు వెల్లివిరుస్తాయి. శాస్త్రం, సాంకేతికం వంటి ఏ అంశంలోనైనా ప్రయోగపూర్వకంగా అభ్యసిస్తూ ముందుకు సాగేవారే అనుభవజ్ఞులవుతారు. జ్ఞానులుగా మారతారు. భక్తి కూడా అంతే!

మనసు ముడుచుకొని ఉన్నంత కాలం సాధకుడు పరిణతి సాధించలేడు. దేవుణ్ని పసుపు, కుంకుమ, గంధం, పూలతో అలంకరించి; దీపాలు పెట్టి, ధూపాలు వెలిగించి, నైవేద్యం సమర్పించగానే సరిపోదు. షోడశోపచారాలు చేసినంత మాత్రాన, ఆ పూజ ఫలవంతమైనట్లు కాదు. వాటన్నింటితో పాటు, అటు ఇటు చరించే మనసును అతడు కుదురుగా కూర్చోబెట్టాలి. మనసుకు గురి ముఖ్యం. ఎదురుగా ఉన్నది భగవంతుడన్న భక్తిప్రపత్తులతో వ్యవహరించాలి. మనసా వాచా కర్మణా ధ్యాన నిమగ్నం కావాలి. దానికి నిష్ఠ అవసరం.

భగవత్ సాన్నిధ్యంలో అనిర్వచనీయ అనుభూతి కలుగుతుంది. లౌకిక ప్రపంచాన్ని ఆ కొద్దిసేపూ మరవడమే పూజార్హత. పూజావిధానంపై సాధకుడికి పట్టు చిక్కితే, భగవంతుడు అతడి మనసుకు చేరువైనట్లే! అనేకమంది తీర్థులు, దాసులు, ఆచార్యులు నిరంతర ధ్యాస వల్లనే స్వామికి చేరువయ్యారు. అలౌకికానందంతో వారు పులకించిపోయారు. ఆధ్యాత్మిక రంగంలో ఎందరికో మార్గం చూపిన మహానుభావులయ్యారు.

పిల్లలు బంకమట్టితో బొమ్మను చేస్తే, వాస్తవ ఆకారంతో దానికి పోలిక లేకున్నా ఆకర్షణ ఉంటుంది. దాన్ని రూపొందించడానికి వారు పడిన తపన, చూపిన ఏకాగ్రత ముచ్చట గొలుపుతాయి. సాధకుడి కృషీ ఎందరినో ప్రభావితం చేస్తుంది.

కాలక్రమంలో ఆధ్యాత్మికత్వానికి సమయం, డబ్బు శాసనకర్తలవుతున్నాయి! మనిషి అనుభూతుల్ని అవి కబళిస్తున్నాయి. పూజ చేయడంలోని రమణీయతనూ అవే క్షీణింపజేస్తున్నాయి.



అంతర్యామి

నిర్మల తటాకం వంటి మనసుదే ప్రధాన పాత్ర. దాన్ని ప్రశాంతంగా ఉంచుకోవాలి. నిత్య సాధనతో వికాసం సాధించగలగాలి. ఏదో ఒకనాటికి సంపూర్ణ వికసిత మనో పుష్పాన్ని స్వామి చరణార్పణం చేస్తేనే, మానవ జన్మ సార్థకమవుతుంది.

పూజ అనేది తప్పించుకోలేని, తప్పనిసరి వ్యవహారం కాదు. ఎవరైనా చిన్న సహాయం చేసినందుకే, మనిషి కృతజ్ఞత చెబుతాడు. అలాంటిది- చరాచర సృష్టిలోని ఏ జీవ, జంతుజాలానికీ లేని ప్రత్యేకతల్ని దైవం ప్రసాదించినందుకు మనిషి ఎన్ని ధన్యవాదాలు సమర్పించాలి? జ్ఞానేంద్రియాలతో గ్రహించి అర్థం చేసుకునే విచక్షణ శక్తిని కలిగించాడు దేవుడు. కర్మేంద్రియాలు అనుగుణంగా వ్యవహరించడం వల్ల, జీవితానికి సార్థకత కలిగే అవకాశం కల్పించాడు. అందుకే దేవదేవుడికి ధన్యవాదాలు సమర్పించడం మానవుడి కనీస ధర్మం. అలా చేసినందువల్ల అతడు ఏ సందర్భంలోనూ 'నేను' అనే అహానికి లోను కాడు. 'నాది' అనే గర్వంతో విర్రవీగడు.

సృష్టి యావత్తు దైవ ప్రసాదంగా అందరికీ చెందుతుందన్న భావమే పరమ ఉత్కృష్టం. దాన్ని పెంపొందించుకోవడమే మనిషి పరమ లక్ష్యం. అప్పుడు- ఈ భూమి ఓ దేవాలయమవుతుంది. మనిషికి, దేవుడికి మధ్య గల తెర తొలగిపోతుంది!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతిగృహాలకు గ్రేడింగు

- అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ గురుకులాల్లో ప్రవేశం
- సీఎస్ శైలేంద్రకుమార్ జోషి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, వసతిగృహాల పనితీరును మదించి గ్రేడింగు ఇచ్చే విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి అధికారులను ఆదేశించారు. దీని ద్వారా విద్యాసంస్థల పనితీరు మెరుగవుతుందని చెప్పారు. రాష్ట్రంలో అర్హత గల ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులందరికీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం రెండో రోజు సీఎస్ ..వైద్యారోగ్యం, విద్య, ఇంధనం, గృహ నిర్మాణం, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్, పర్యాటక, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ, యువజన, కార్మిక శాఖల



సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

అధికారులతో సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలి. గురుకులాల్లో చదువు పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్యాసంస్థల్లో ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు పొందే ఏర్పాట్లు చేయాలి. స్టడీ సర్కిళ్ల ద్వారా యువత ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలి. భూ పంపిణీ పథకం కింద భూములు పొందిన వారి వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఫలితాలను కనిపెట్టాలి. గిరిజన సహకార సంస్థ కార్యకలాపాలను విస్తృతం చేయాలి. రాష్ట్రంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి. రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణ పథకం కింద రాష్ట్రంలో 1.73 లక్షల ఇళ్లకు టెండర్లు జరగగా 1.38 లక్షల ఇళ్ల పనులే మొదలయ్యాయి. మిగతా వాటి పనులను ప్రారంభించాలి. ఈ ఇళ్లకు సౌభాగ్య పథకం కింద విద్యుత్‌ను అందించాలి. రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలి. పురపాలక శాఖ పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ జరపాలి. కొత్త పర్యాటక విధానాన్ని వెంటనే రూపొందించాలి'అని పేర్కొన్నారు. సమావేశంలో ఉన్నతాధికారులు అజయ్‌మిశ్ర, చిత్రా రామచంద్రన్, వికాస్‌రాజ్, వెంకటేశం, నవీన్‌మిత్తల్ తదితరులు పాల్గొన్నారు.



'సరోగసీ' సంతానమైనా ప్రసూతి సెలవు పొందొచ్చు

దిల్లీ: సరోగసీ (మారు గర్భం) విధానంలో సంతానం పొందిన కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులూ.. ప్రసూతి సెలవును తీసుకోవచ్చని కేంద్రం వెల్లడించింది. 26 వారాలపాటు వేతనంతో కూడిన సెలవుపై వారు వెళ్లొచ్చని సిబ్బందిశాఖ జారీ చేసిన అధికారిక ఉత్తర్వులో పేర్కొంది. అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాలకూ ఈ మేరకు లేఖలు రాసింది.

డిపెండెంట్ వీసాపై చదువుకోవచ్చా?



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికా యానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

నా తల్లిదండ్రుల బి1/బి2 వీసా గడువు ఆరు నెలలే ఉంది. వచ్చే ఆరు నెలల్లో వారు అమెరికా వెళ్లేందుకు ప్రణాళిక వేసుకోవచ్చా? - *రాధ*

చెల్లుబాటు అయ్యే వీసా, పాస్‌పోర్టు ఉన్నంత కాలం వారు అమెరికా ప్రయాణం చేయవచ్చు. అమెరికాలోకి ప్రవేశం, అక్కడ ఎంత కాలం ఉండాలనే దానిపై అమెరికా ప్రవేశ ప్రాంతంలోని ఇమిగ్రేషన్ అధికారులదే తుది నిర్ణయం. ఆరు నెలలు, అంతకన్నా తక్కువ కాల వ్యవధిలో ఉన్న వారు సాధ్యమైనంత త్వరితంగా నూతన వీసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తాం. కాన్సులర్ ప్రత్యక్ష ఇంటర్వ్యూకు హాజరు కాకుండా ఇంటర్వ్యూ మినహాయింపు పథకం కింద అర్హత పొందవచ్చు. వీసా పునరుద్ధరణ కోసం https://www.ustraveldocs.com/in ను పరిశీలించండి.

నా బి1/బి2 వీసా ఈ నెలలోనే కాలం తీరనుంది. పునరుద్ధరణ చేసుకోవడమెలా? - *ప్రకాష్ కొమ్మాలపాటి*

మీ వీసా గడవు ఫిబ్రవరిలో ముగియనుండటంతో ఇంటర్వ్యూ మినహాయింపు పథకం(ఐడబ్ల్యూపీ) కింద నూతన వీసా కోసం అర్హత పొందవచ్చు. మీరు అర్హులా? కాదా? అన్నది తెలుసుకునేందుకు https://www.ustraveldocs.com/in చూడండి. ఐడబ్ల్యూపీ కింద అర్హత పొందకపోతే వెబ్‌సైట్‌లో పేర్కొన్న మేరకు సాధారణ ప్రక్రియ కింద దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

2015లో నా భార్యకు డిపెండెంట్ వీసా జారీ అయింది. ఆమె మాస్టర్స్ డిగ్రీ చేయాలనుకుంటుంది. ప్రస్తుతమున్న వీసాపై ఆమె చదువుకోవచ్చా? - *కృష్ణమోహన్ పి*

హెచ్-4 వీసా స్థితిలో ఉన్న వ్యక్తులు అమెరికాలో పాఠశాలకు హాజరు కావచ్చు. అమెరికాలో విద్యాభ్యాసం, వివిధ కోర్సులకు సంబంధించిన సమాచారం కోసం ఎడ్యుకేషన్ యూఎస్ఏ వెబ్‌సైట్ https://educationusa.state.gov ను పరిశీలించండి.

హెచ్1బి వీసాపై నా భర్త అమెరికాలో పని చేస్తున్నారు. ఆయన దగ్గరకు వెళ్దామనుకుంటున్నాను. ఏ వీసా అవసరం? ఎలా దరఖాస్తు చేయాలి? - *ప్రమీలాప్రసాద్ ఎం*

హెచ్1బి వీసాపై పని చేస్తున్న వారు తన భార్యకు హెచ్-4 వీసా కోసం దరఖాస్తు చేయాలి. హెచ్-4 వీసా ఇంటర్వ్యూ, అవసరమైన ధ్రువపత్రాలు తదితర సమాచారానికి http://www.ustraveldocs.com/in చూడండి.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.coకు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

పోలవరానికి రూ.417 కోట్ల విడుదలకు అనుమతి

- మరో రూ.2,400 కోట్ల మేర బిల్లులు పెండింగు

ఈనాడు-అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తంలో రూ. 417.44 కోట్లు విడుదలకు కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ జాతీయ జల అభివృద్ధి సంస్థకు అనుమతి ఇచ్చింది. రెండు వారాల క్రితమే ఈ మొత్తం ఇచ్చేందుకు సంతకం చేసినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర జలవనరులశాఖ అధికారులకు చెప్పారు. తాజా ఉత్తర్వులు జాతీయ జల అభివృద్ధి సంస్థ నుంచి నాబార్డుకు వెళ్లాలి. అక్కడ నుంచి నిధులు విడుదల కావాలి. అవి పోలవరం ప్రాజెక్టు అథారిటీకి అక్కడి నుంచి రాష్ట్ర జలవనరులశాఖకు రావాల్సి ఉంటుంది.

రూ.1,800 కోట్లకే ఆమోదం!

ఇప్పటికే రాష్ట్ర జలవనరులశాఖ మరో రూ. 2,400 కోట్ల ఖర్చుకు సంబంధించిన బిల్లులను పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమర్పించారు. ఆ బిల్లులపై తనిఖీ కూడా దాదాపు పూర్తయింది. ఇక కేంద్ర జలవనరులశాఖకు వెళ్లి ఆమోదం పొంది అక్కడి నుంచి వివిధ విభాగాలకు వెళ్లి వచ్చిన తర్వాత నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇందులో రూ. 1,800 కోట్ల వరకే అంచనాల ఆమోదానికి కేంద్ర ఆమోదం ఉంది. మిగిలిన మొత్తం విడుదల కావాలంటే సవరించిన అంచనాలు ఆమోదం పొందవలసి ఉంది. వాటిపై ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు అథారిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానాలు పంపారు. దిల్లీలో దీనిపై రాష్ట్ర జలవనరులశాఖకు చెందిన ఓ బృందం పని చేస్తోంది. అనుమానాలు నివృత్తికి తాను సైతం రాగలనని కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వారికి చెప్పినట్లు సమాచారం.

ఏప్రిల్‌లో బుద్వేల్ ఐటీపార్కు పనులు

ఆసక్తి కనబరిచిన 30 కంపెనీలు

ఈనాడు-హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా బుద్వేల్‌లో నిర్మించతలపెట్టిన ఐటీపార్కు పనులు ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్నాయి. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన కంపెనీలకు ఏప్రిల్ నాటికి భూకేటాయింపులు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఐటీశాఖ, టీఎస్ఐఐసీ కసరత్తును ప్రారంభించాయి. అసెంబ్లీ సమావేశాల సమయానికి క్షేత్రస్థాయి పనులు పూర్తి చేయాలని, ఆ వెంటనే కేటాయింపులు మొదలుపెట్టాలని భావిస్తోంది. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో ఐటీ కంపెనీలకు భూకేటాయింపులు చేసేందుకు అవసరమైన భూముల్లేవు. ఆ ప్రాంతానికి దగ్గర్లో రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతంలో 340 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాన్ని మరో ఐటీ పార్కుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని అభివృద్ధికి సంబంధించి బ్లూప్రింటును సిద్ధం చేసింది. ఐటీ కంపెనీలతో సంప్రదింపులు నిర్వహించగా ... 30 వరకు కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తీకరణ తెలిపాయి. ఇందులో పది వరకు పెద్ద కంపెనీలు, మిగతావి మధ్యస్థాయి కంపెనీలు ఉన్నట్లు సమాచారం. ఆయా కంపెనీలకు భూములను షరతులతో కూడిన ఒప్పందం మేరకు కేటాయించనున్నాయి. ఎకరా ధర ఎంత మేరకు పెట్టాలన్న విషయమై స్పష్టత రాలేదు. బుద్వేల్ ఐటీపార్కు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే దాదాపు 1.25 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా.

తితిదే పంచాంగం ఆవిష్కరణ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల, తిరుపతి దేవస్థానం రూపొందించిన శ్రీవిళంబినామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ గురువారం రాత్రి జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ ధర్మప్రచారంలో భాగంగా ప్రతి ఏటా తెలుగు సంవత్సరాది ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి భక్తులకు అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఉగాది కోసం 40 రోజులు ముందుగానే పంచాంగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. వచ్చేవారం నుంచి తెలుగు రాష్ట్రాల్లోని తితిదే సమాచార కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. పంచాంగం ధర రూ. 50 నిర్ణయించినట్లు తెలిపారు.

శ్రీవారికి రూ.కోటి విరాళం

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఓ ట్రస్టు రూ. కోటి విరాళాన్ని గురువారం సమర్పించింది. చెన్నైకు చెందిన శ్రీగురుచంద్రిక సమితి ట్రస్టు ఛైర్మన్ ఎ. వెంకటేశన్ తరపున ప్రతినిధి ప్రసన్నకుమార్ విరాళానికి సంబంధించిన డీడీని తిరుమల జేఈవో శ్రీనివాసరాజుకు అందజేశారు.



సహాయ ఆచార్యుల భర్తీలో సమస్యలు పరిష్కరించండి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా భర్తీ చేస్తున్న సహాయ ఆచార్యుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రస్తుతం రాష్ట్ర వైద్య మండలిలో నమోదు గడువు సెప్టెంబరు 12 2017 వరకే ఇచ్చారని.. ఈ గడువును 22 నవంబరు 2017 వరకూ పొడిగించాలని తెలంగాణ జూడాలు కోరారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డికి గురువారం పీజీ వైద్యవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సహాయ ఆచార్యులుగా దరఖాస్తు చేసుకోవాలంటే తప్పనిసరిగా వైద్య మండలిలో తమ వివరాలను నమోదు చేసుకోవాలనే నిబంధన పెట్టారని.. టీఎస్‌పీఎస్సీ ఇచ్చిన ప్రకటన ప్రకారం సెప్టెంబరు 12 వరకూ నమోదు చేసుకున్నవారి దరఖాస్తులనే పరిగణలోకి తీసుకుంటున్నారని తెలిపారు. వాస్తవానికి ప్రభుత్వ వైద్యకళాశాలల్లో చదువుకున్న పీజీ వైద్యవిద్యార్థులు తమ తొలి సంవత్సరంలో(మూడేళ్ల కిందట) 40 రోజుల పాటు సమ్మెచేశారని.. దీంతో విద్యాభ్యాసం పూర్తి చేయాల్సిన గడువు కూడా పెరిగిందని.. ఫలితంగా రాష్ట్ర వైద్య మండలిలో వివరాలను నమోదు చేసుకోవడమూ ఆలస్యమైందని వివరించారు. ప్రభుత్వ పీజీ వైద్య విద్యార్థుల ఆవేదనను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర వైద్య మండలిలో నవంబరు 22, 2017 వరకూ నమోదు చేసుకున్న విద్యార్థుల దరఖాస్తులను ధ్రువపత్రాల పరిశీలనకు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతులపై మంత్రి లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారు.



హైదరాబాద్‌లో డీఐపీసీ ఏర్పాటు చేయండి

- రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ విజ్ఞప్తి
- నేడు రాష్ట్రపతి కోవింద్‌తో భేటీ!

ఈనాడు, దిల్లీ: రక్షణ రంగ పరిశ్రమల నడవా (డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ - డీఐపీసీ)ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 2018-19కి గాను రెండు డీఐపీసీలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించినందున ఇందులో ఒకటి తెలంగాణకు కేటాయించాలని కోరారు. రక్షణ రంగానికి హైదరాబాద్‌కు అనుబంధం ఉందని.. రక్షణ రంగ సంస్థలు, పరికరాల తయారీలో హైదరాబాద్ ముందుందని కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఒక డీఐపీసీ ఏర్పాటు అవసరమన్నారు. అనంతరం కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, హర్షవర్ధన్‌లను కేటీఆర్ కలిశారు. ఈ నెల 14 నుంచి 19 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఫిక్కీ నిర్వహించే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్‌కు రావాలని ఆహ్వానించారు. హైదరాబాద్ ఫార్మాసిటీకి సహకరించాలని పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కోరారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కేటీఆర్ భేటీ కానున్నట్లు సమాచారం.

కేటీఆర్ చదువుకున్న నిరక్షరాస్యుడు: కె.లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై మంత్రి కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని.. ఆయన చదువుకున్న నిరక్షరాస్యుడని భాజపా రాష్ట్రఅధ్యక్షుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. కేంద్రమిచ్చిన నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం సరిగా ఖర్చు చేయడం లేదని.. వివిధ ప్రాజెక్టులు, పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో కేంద్ర నిధులు రూ.10,962 కోట్లు ఆగాయన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధితోపాటు, ప్రజాసంక్షేమాన్ని సమ్మిళితంతో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెడితే తెరాస, కాంగ్రెస్ నేతలు చవకబారు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెరాస కుటుంబ పార్టీ అని.. కేసీఆర్ తర్వాత పార్టీ భవిష్యత్ నీటిబుడగేనన్నారు.

రైతులకేం చేశారో చెప్పండి

- వారి ఆదాయం రెట్టింపయ్యేలా చూడాలి
- అన్ని పంటలకూ మద్దతు ధర కల్పించాలి
- ఏపీ ఎంపీల ఆందోళనకు మద్దతిస్తున్నాం
- విభజన హామీలు అమలు చేయాలి
- కాళేశ్వరానికి జాతీయహోదా ఇవ్వాలి
- తెరాస ఎంపీ కల్వకుంట్ల కవిత

ఈనాడు – దిల్లీ



అధికారంలోకి వచ్చాక తొలి బడ్జెట్‌లో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న ఎన్డీయే హామీ ఏమైందని తెరాస ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. బడ్జెట్‌లో రైతులకు నిరాశే దక్కిందని ఆవేదన చెందారు. ఎరువుల సంస్థలకు ఇచ్చే రాయితీని రైతులకు నేరుగా ఇవ్వాలన్నారు. గురువారం లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చలో ఆమె మాట్లాడారు. ఏపీ విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండు చేశారు. కాంగ్రెస్, భాజపా ఏదో ఒక ప్రభుత్వం వస్తూనే ఉంటుందని, కానీ ఏపీ, తెలంగాణలకు ఇచ్చిన హామీలు తీర్చాలన్నారు. రెండు మూడు రోజులుగా ఏపీకి చెందిన తెదేపా, వైకాపా ఎంపీలు ఆందోళన చేస్తున్నారని, వారికి మద్దతు తెలుపుతున్నామని కవిత పేర్కొన్నారు. మిత్రపక్షంగా ఉండి ఆందోళన చేస్తున్నారంటే దేశానికి చెడు సంకేతాలు వెళ్తాయని, ఈ అంశంపై వీలైనంత త్వరగా మాట్లాడాలని కేంద్రానికి సూచించారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ తప్పకుండా ప్రభుత్వంపై ప్రభావం చూపుతుందన్నారు.

వ్యాపారానికి మద్దతిస్తున్న కేంద్రం

కేంద్రప్రభుత్వం వ్యాపార రంగానికి బాగా మద్దతిస్తోందని కవిత అన్నారు. అంతర్జాతీయ వేదికపై భారత ర్యాంకింగ్ 41 స్థానాలు పెరిగిందన్నారు. "వ్యాపారుల అభివృద్ధికి ఓవిధానం రూపొందించారు. ఆదాయపన్ను మినహాయించారు. జీఎస్టీ తెచ్చారు. రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నారు. జీఎస్టీమండలి ఏర్పాటు చేశారు. అందుకే ర్యాంకింగ్ పెరిగినట్లు ఉంది. ఈ విధంగా వ్యవసాయ రంగానికి ఎందుకు చేయరు" అని ఆమె ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం వ్యాపారరంగం కోసం ఇప్పటివరకూ 31 బిల్లులను ఆమోదించిందని, వ్యవసాయానికి కేవలం రెండు బిల్లులే ఆమోదించిందని ఆవేదన చెందారు. ప్రభుత్వానికి తీవ్ర సమస్యలొచ్చినపుడు మద్దతిస్తున్నామని జీఎస్టీ, పెద్దనోట్ల రద్దుకు సహకరించామని ఆమె పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో స్టార్టప్ నుంచి కార్పొరేట్ వరకు తోడుగా ఉంటున్న సర్కారు.. రైతుల పక్షాన ఎందుకు ఉండటం లేదో అర్థం కావడంలేదన్నారు. 2016-17 బడ్జెట్‌లో ఎరువుల రాయితీ రూ.70వేల కోట్లు అన్నారని, ఇప్పటివరకూ ఏ ప్రభుత్వాన్ని చూసినా ఆహారభద్రత తర్వాత ఇది రెండో అత్యధిక రాయితీ అన్నారు. సంస్థలకు కాకుండా నేరుగా రైతులకు రాయితీ ఇస్తామన్నారని, అదేమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన తప్పులే భాజపా చేయడం తగదన్నారు. దేశంలో ఎరువుల ఉత్పత్తులు పెరగాల్సి ఉన్నా పెంచలేదని ప్రశ్నించారు. విదేశాల నుంచి ఎరువుల దిగుమతి చేసుకొనేది మూడు సంస్థలే.. అది ఎందుకో తెలియడంలేదని, దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయితీని నేరుగా వారికి అందచేయాలన్నారు. దేశంలో ఉన్న సాగుభూమిలో 51 శాతానికే సాగు సదుపాయాలు ఉన్నాయని కవిత గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకూ ఎన్డీయే ప్రభుత్వం రూ.35వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు.

కాళేశ్వరంపై కనికరమేదీ?

తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టామని జాతీయ హోదా కోరుతున్నా కేంద్రం ఇవ్వడం లేదని ఎంపీ అన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు మద్దతన్నారు దానికిచ్చే రాయితీ రెండేళ్లకు కానీ రైతులకు అందడం లేదన్న విషయం సభ్యులందరికీ తెలుసని వివరించారు. రైతు ఒక యూనిట్‌గా పరిగణించి బీమా ఉండాలని రాష్ట్రప్రభుత్వం, తెరాస నుంచి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం చేయాలని కోరారు. మద్దతు ధర 50శాతం పెంచుతామన్నారని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం 26 పంటలకు మాత్రమే రాయితీ ఇస్తున్నారని అన్ని పంటలకూ మద్దతివ్వాలని కోరారు. గోధుమలు, బియ్యం కేంద్రం సేకరిస్తోందని ఈ నేపథ్యంలో అన్ని పంటలకూ రాయితీ ఇచ్చినా కేంద్రంపై పెద్దగా భారం ఉండదన్నారు. రైతులకు ఆదాయం రెట్టింపవ్వాలంటే మద్దతు ధర అన్ని పంటలకూ ఇవ్వాల్సిందేనన్నారు. ఇలా చేస్తే ఓ విప్లవాత్మక చర్య అవుతుందని, భాజపాకు ఎన్నికల్లోనూ లాభిస్తుందని ఎంపీ కవిత లోక్‌సభలో పేర్కొన్నారు

సమస్యలు ఉన్నాయని ఆధార్‌ను పక్కనపెట్టలేం

దిల్లీ: పౌరులకు ప్రయోజనాలను నిలిపివేస్తున్నారన్న కారణం చూపి ఆధార్ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా పరిగణించలేమని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర ఆధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం విచారిస్తోంది. ఆధార్‌లేని వారికి సామాజిక ప్రయోజనాలను నిరాకరించకూడదంటూ ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఎలాంటి తాత్కాలిక ఉత్తర్వులూ ఇవ్వడానికి నిరాకరించింది.

ఆంధ్రప్రదేశ్‌కు 'ఎమిరేట్స్'

- వైమానిక రంగంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు
- ఏపీఈడీబీతో అవగాహన ఒప్పందం
- ఎమిరేట్స్ ఛైర్మన్ మక్తూమ్‌తో చంద్రబాబు భేటీ
- పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి దుబాయి పర్యటన



గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అండ్ గ్రూపు, డినాటా ఛైర్మన్ షేక్ అహ్మద్ బిన్ సయీద్ అల్ మక్తూమ్, ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిశోర్. చిత్రంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ తదితరులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైమానికరంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు దుబాయికి చెందిన ఎమిరేట్స్ గ్రూపు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఎమిరేట్స్ గ్రూపునకు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ(ఏపీఈడీబీ)కి మధ్య గురువారం కీలక అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. దీంతో రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల వరకూ పెట్టుబడులు వచ్చే అవకాశముంది.

అమరావతి సర్వీసుకు సిద్ధంగా ఉన్నాం: ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు, ఈ నెలాఖరులో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు దుబాయికి చెందిన వాణిజ్య, పారిశ్రామిక ప్రముఖుల్ని ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం దుబాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అండ్ గ్రూప్, దుబాయి నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్స్ అసోసియేషన్(డి నాటా) ఛైర్మన్ షేక్ అహ్మద్ బిన్ సయీద్ అల్ మక్తూమ్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల్ని సరళీకృతం చేస్తే అమరావతితో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర నగరాల నుంచి విమాన సర్వీసులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని మక్తూమ్ తెలిపారు. ఎంఓయూపై మక్తూమ్, ఏపీఈడీబీ సీఈఓ జాస్తి కృష్ణ కిశోర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం విమానాల తయారీ, విమానాల ఇంటీరియర్, డ్యూరబుల్స్ తయారీ కేంద్రాలను ఎమిరేట్స్ గ్రూప్ ఏర్పాటు చేస్తుంది. వైమానిక శిక్షణకు అకాడెమీని నెలకొల్పుతుంది. విమానాల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్(ఎంఆర్ఓ) సదుపాయం ఏర్పాటు చేస్తుంది. ఎమిరేట్స్ గ్రూపు, ఏపీఈడీబీ కలసి వర్కింగ్ గ్రూపులు ఏర్పాటు చేస్తాయి. ఏరోస్పేస్ రంగంలో మౌలిక సదుపాయాలు, తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించడం, వాటిలో 'ఎమిరేట్స్' పెట్టుబడులకు గల అవకాశాల్ని ఈ గ్రూపులు పరిశీలిస్తాయి.

మాతో కలసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయండి: విమానయానరంగంలో ఆంధ్రప్రదేశ్‌తో కలసి సంయుక్త భాగస్వామ్య సంస్థను ఏర్పాటు చేయాలని మక్తూమ్‌ను చంద్రబాబు కోరారు. అమరావతిని సందర్శించాలని ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణలో భాగస్వామ్యం తీసుకోవాలని కోరారు.

ఏరోసిటీ ఏర్పాటుకు దుబాయి ఏరోస్పేస్ ఆసక్తి: ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి ఏరోసిటీ ఏర్పాటు సన్నాహాల్లో ఉన్నామని, సౌదీ అరేబియా ఫైనాన్షియర్స్‌తో కలసి పనిచేస్తున్నామని దుబాయి ఏరో స్పేస్ డైరెక్టర్, దుబాయి ఎయిర్‌పోర్ట్స్ ఫ్రీ జోన్ అథారిటీ డైరెక్టర్ జనరల్, దుబాయి సిలికాన్ ఒయాసిస్ అథారిటీ (డీఎస్ఓఏ) వైస్‌ఛైర్మన్ మహమ్మద్ అహ్మద్ అల్ ఝురూనీ తెలిపారు. కేపీఎంజీ సహకారంతో మూడు నెలల్లో సవివర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.

3 లక్షల టన్నుల సామర్థ్యంతో రైస్ మిల్లు: ప్రపంచంలోనే అతి పెద్ద రైస్ మిల్లు రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోటలో 'మెగా ఇంటిగ్రేటెడ్ రైస్‌మిల్ ప్రాజెక్టు' చేపట్టేందుకు ఫీనిక్స్ గ్రూపు సంస్థ ముందుకు వచ్చింది. ఏప్రిల్ నుంచి పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ సంస్థ ఛైర్మన్, సీఈఓ గౌరవ్ ధావన్ తెలిపారు. అనంతపురం జిల్లాలో వేరుసెనగ సాగు చేపట్టేందుకున్న అవకాశాలు పరిశీలించాలని, 'పీనట్‌బటర్' తయారీయూనిట్‌నెలకొల్పాలని కోరారు.

అవసరమైన భూమి కోసం చూస్తున్నాం: భారత ప్రభుత్వం ఆహార శుద్ధి రంగానికి సంబంధించి సరైన విధానం ప్రకటిస్తే ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రితో షరాఫ్ గ్రూపు వైస్‌ఛైర్మన్ షరాఫుద్దీన్ మొహమ్మద్ హుస్సేన్ షరాఫ్ తదితరులు సమావేశమయ్యారు. ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌కి గతంలోనే ప్రతిపాదనలిచ్చామని, యూనిట్ నెలకొల్పేందుకు భూమి కోసం చూస్తున్నామని షరాఫ్ తెలిపారు.

తెలంగాణలో రమణీయ ప్రాంతాల పరిరక్షణ

- ప్రభుత్వానికి నివేదిక
- శాసనసభ పర్యావరణ కమిటీ సమావేశంలో సభాపతి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల మధ్య విస్తరించి ఉన్న ప్రకృతి రమణీయ ప్రాంతాలను పరిరక్షించుకోవడంతో పాటు పర్యాటకంగా వాటిని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని శాసన సభాపతి మధుసూదనాచారి అన్నారు. శాసనసభ పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ తొలి సమావేశం గురువారం కమిటీ హాలులో జరిగింది. ఇందులో ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, ఫరీదుద్దీన్, ఎమ్మెల్యేలు జలగం వెంకటరావు, కిషన్‌రెడ్డి, దివాకర్‌రావు, బాపురావు రాథోడ్, గువ్వల బాలరాజు, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు, పీసీసీఎఫ్ పీకే ఝా, సీఎం ప్రత్యేకాధికారిణి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాపతి, సభ్యులు పలు సూచనలు చేశారు. వన్యప్రాణుల రక్షణ, అటవీ సంపదను కాపాడుతూ పర్యావరణ పర్యాటక అభివృద్ధికి సమగ్రమైన నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని సభాపతి చెప్పారు. పర్యావరణ పర్యాటకంపై ఇప్పటికే సమగ్ర ప్రణాళిక రూపొందించామని అటవీ అధికారులు చెప్పారు. కొత్త ఉద్యోగ నియామకాల ద్వారా అటవీ శాఖ బలోపేతమవుతుందని వెల్లడించారు. సీఎం ఆదేశాల మేరకు హైదరాబాద్ ఇతర నగరాల్లోని చుట్టుపక్కల ప్రాంతాల్లో అటవీ ప్రాంత అభివృద్ధికి పెద్దఎత్తున చర్యలు చేపట్టామన్నారు.

సీపీఎస్ రద్దుపై 22న ధర్నా

ఈనాడు, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పింఛను పథకం(సీపీఎస్) రద్దు తదితర డిమాండ్లపై ఈనెల 22న మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలని పీఆర్‌టీయూ టీఎస్ నిర్ణయించింది. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి గురువారం ధర్నా నోటీసును అందజేశారు.

ప్రాజెక్టుల్ని వేగవంతం చేయాలి: ద.మ రైల్వే జీఎం

ఈనాడు, హైదరాబాద్: రైల్వే ప్రాజెక్టుల నిర్మాణంలో క్లిష్టమైన అంశాల్ని పరిష్కరించి పనుల్ని వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్‌యాదవ్ అధికారుల్ని ఆదేశించారు. భూసేకరణ, రాష్ట్రప్రభుత్వాల నుంచి నిధుల మంజూరు, అటవీ అనుమతులు, హైటెన్షన్ లైన్లను మార్చడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ, ఏపీల్లో కొత్త ప్రాజెక్టులు, రెండో, మూడో లైన్ల పనులపై బుధవారం రైల్‌నిలయంలో సమీక్షించారు.

పంచాయతీ ఎన్నికల్లో కొత్తవారు ఓటేయొచ్చు

- ఓటర్ల నమోదుకు భారత ఎన్నికల సంఘం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల్లో కొత్త వారూ ఓటు వేయవచ్చు. పద్దెనిమిదేళ్లు నిండిన వారంతా ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేయించుకోవచ్చు. చట్టసభల ఎన్నికల కోసం భారత ఎన్నికల సంఘం ఇలాంటి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతుండగా దీన్ని బాగా ప్రోత్సహించి ఎక్కువ మంది యువతీ యువకులు ఓటు హక్కును పొందేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. జిల్లాల్లో పెద్ద సంఖ్యలో అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయాలని పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ తాజాగా కొన్ని మార్గదర్శకాలను జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం 2018, జనవరి 1 నాటికి ఉన్న ఓటర్లతో ముద్రించిన ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకొని పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని తెలంగాణ ఎన్నికల సంఘం తొలుత భావించింది. ఇలాంటి కారణంగానే ప్రభుత్వం ఫిబ్రవరిలోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్తందనే అంశం ప్రచారంలోకి వచ్చింది. ఇంతలో ఓటర్ల జాబితాల సవరణపై భారత ఎన్నికల సంఘం నుంచి ఉత్తర్వులు వెలువడటంతో ఆ ప్రభావం రాష్ట్రంలోని ముందస్తు పంచాయతీ ఎన్నికలపై పడింది. రాష్ట్రంలో 36 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనవరి 1 నాటికి నమోదై ఉన్నవారి పేర్లతో జాబితాను అదే నెల 20వ తేదీన ప్రచురించగా తాజాగా మిగతా 83 నియోజకవర్గాల్లో సవరణ కసరత్తును భారత ఎన్నికల సంఘం చేపడుతోంది. ఈ నెల 11వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాల ద్వారా ఓటర్ల నమోదు జరిపి తుది జాబితాను మార్చి 24న వెలువరిస్తుంది. ఆ ఓటర్ల జాబితాలోని పేర్లనే పంచాయతీలవారీగా విభజించి పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తారు.

15వ ఆర్థిక సంఘం కార్యదర్శి భేటీ నేడు

హాజరు కానున్న దక్షిణాది రాష్ట్రాల అధికారులు

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులతో 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అర్వింద్ మెహతా శుక్రవారం భేటీ కానున్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో జరిగే సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరిల ఆర్థికశాఖ కార్యదర్శులు పాల్గొంటారు.

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన

15వ ఆర్థిక సంఘం కార్యదర్శి శనివారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పెద్ద ఎత్తున నిధులను వ్యయం చేసి నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టును సందర్శించి లక్ష్యం సహా వివిధ అంశాలను పరిశీలించనున్నారు.

తాగునీటి గ్రిడ్ కోసం... కృష్ణా-గోదావరి అనుసంధాన యోచన

రాజధానిలో మంచినీటి కొరతను పూర్తిగా నివారించేందుకు కృష్ణా, గోదావరి నదులను అనుసంధానించి తాగునీటి గ్రిడ్‌ను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ యోచిస్తున్నట్టు భగీరథ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు.

"ఈ మధ్యాహ్నం ఎండను చూస్తుంటే.. వేసవి మొదలైందేమో అనిపిస్తోంది...!"

రాత్రి చలి గిలి పెడుతున్నా.. భానూదయంతో సీను మారిపోతోంది.. వేసవి రావడానికి సిద్ధమవుతోంది. సమ్మర్ ఎంట్రీతో మండుటెండలు ఆ తర్వాత పిల్లలకూ, పెద్దలకూ హాయినిచ్చే సెలవులూ వచ్చేస్తాయి. మరి అప్పుడు ఎక్కడికి వెళ్లాలో.. ఓ మాట అనేసుకుందామా! అప్పుడే ఎందుకంటారా? ముందస్తుగా సన్నద్ధమైతే ప్రయాణం సాఫీగా సాగుతుంది. ఆర్థికంగానూ ఎంతో కొంత కలిసొస్తుంది. మీ ఆలస్యం ప్రయాణాన్ని భారం చేయవచ్చు. అందుకే ముందస్తు సన్నద్ధతతో.. అందుబాటు ధరల్లోనే ఆనందాన్ని ఆస్వాదించండి.

సంపన్నులే కాదు.. ఎగువ మధ్యతరగతి కుటుంబీకులూ విహారానికి విదేశాలకేగుతున్నారు. సిరిగలవారు బ్రిటన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ వంటి ధనిక దేశాలకు విడిదికి వెళ్తుంటారు. కాస్త భిన్నత్వం కోరుకునేవారు టర్కీ, ఈజిప్ట్, ఒమన్ వైపు మొగ్గు చూపుతున్నారు. తీరంలో ఆనందం వెతుక్కోవాలని భావించిన వారు మాల్దీవులు, సీషెల్స్ దీవులు, మారిషస్ బాట పడుతుంటారు. జంతు ప్రపంచంలో విహరించాలనుకునే వారు దక్షిణాఫ్రికా, కెన్యా, జాంబియా దేశాలకు పయనమవుతారు. బడ్జెట్ ధరలో విదేశాలను చుట్టి రావాలనుకునే

భూటాన్ నుంచి బ్రిటన్ వరకు..

వారు థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా (బాలి), నేపాల్, భూటాన్ దేశాలపై ఆసక్తి చూపిస్తుంటారు. ప్రసిద్ధ ప్రైవేట్ టూరిస్ట్ సంస్థలు విదేశీ పర్యటన ప్యాకేజీలు ప్రకటించేశాయి. 7 నుంచి 14 రోజుల వరకు ఆయా దేశాలు తిప్పిచూపిస్తామని చెబుతున్నాయి. యూరప్ ట్రిప్ ప్యాకేజీ ధర రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకూ పలుకుతోంది. కాస్త ముందుగా సంప్రదించే వారికి పది నుంచి పదిహేను శాతం తగ్గింపు లభించే అవకాశమూ ఉంది.



వేసవి వినోదాలలో విహారం కూడా ఒకటి. ప్రపంచ పటం ముందేసుకొని.. పిల్లలు వేలు పెట్టి చూపించిన దేశానికి తీసుకెళ్లే తల్లిదండ్రులూ ఉన్నారు. సెలవుల్లో ఎక్కడికి వెళ్లినా ఖర్చు తడిసి మోపెడవుతుందని పర్యటనను ఎప్పటికప్పుడు వాయిదా వేసే వాళ్లూ ఉంటారు. ఎవరి సౌకర్యం వారిది. ఎవరి కష్టం వారిది. ప్రణాళిక ప్రకారం ముందడుగు వేస్తే.. వీలైనంత తక్కువ ఖర్చులో సమ్మర్ టూర్ ముగించేయొచ్చని చెబుతున్నారు పర్యాటక నిపుణులు. ఈ లెక్కలన్నీ ఎక్కడికి వెళ్తున్నాం.. ఎలా వెళ్తున్నాం.. ఎంత తొందరగా ప్లాన్ చేసుకుంటున్నాం అన్నదానిపైనే ఆధారపడి ఉంటాయంటున్నారు.

వేళకు సన్నద్ధం హాయిగా వెళ్లొద్దాం

ఆలోచించి..

ఎక్కడికి వెళ్తున్నామన్నది ముందుగా తేల్చాలి. ఆ తరువాత ఎలా వెళ్లడం? అని ఆలోచించాలి. వేసవిలో చల్లటి నీడనిచ్చే ప్రదేశాలు మనదేశంలో ఎన్నో! ఉత్తరాదిలోనే కాదు... దక్షిణ భారతంలోనూ చాలానే ఉన్నాయి. కర్ణాటకలో కూర్గ్, తమిళనాడులో ఊటీ, కొడైకెనాల్, ఆంధ్రప్రదేశ్‌లో హార్స్‌లీహిల్స్ ఇవన్నీ వేస'వినోద' కేంద్రాలే! ఉత్తరాదిలోని కశ్మీర్ (లద్దాఖ్, శ్రీనగర్, లెహ్, పహల్గామ్), ఉత్తరాఖండ్ (చార్‌ధామ్, రుషీకేష్, హరిద్వార్, డెహ్రాడూన్, నైనిటాల్, ముస్సోరి, అల్మోరా), హిమాచల్‌ప్రదేశ్ (సిమ్లా, కులు, మనాలి, డల్హౌసి), సిక్కిం, మేఘాలయ వంటి రాష్ట్రాల్లో కావాల్సినన్ని పర్యాటక కేంద్రాలున్నాయి. వీటిలో మనసుకు నచ్చిన ప్రదేశాన్ని ఎంచుకొని వేసవి విహారం మరచిపోలేని అనుభూతిగా మిగుల్చుకోండి.



ఊరించే ధరలు.. ఊహించని ఆఫర్లు..

వేసవిలో తెలుగు రాష్ట్రాల ప్రజలు విహార యాత్రల కంటే.. తీర్థయాత్రలకు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. భక్త సంఘాలు, మిత్ర బృందాలు రకరకాల యాత్రలు చేస్తుంటాయి. నలుగురితో పాటు నారాయణ అనుకుంటే తప్ప దూర ప్రయాణాలు సాధ్యం కావు. తీర్థయాత్రల విషయంలో అయితే మరీనూ! వీటికి తోడు ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు ప్రకటించే ప్యాకేజీలు ఉండనే ఉన్నాయి. ఊరించే ధరల్లో.. ఊహించని ఆఫర్లు రారమ్మని పిలుస్తుంటాయి. రామేశ్వరం మొదలు చార్‌ధామ్ వరకు టూర్ ప్యాకేజీలు కోకొల్లలుగా ప్రకటిస్తూనే ఉంటాయి. అమర్‌నాథ్, చార్‌ధామ్, నైమిశారణ్యం, కాశి-ప్రయాగ, సోమ్‌నాథ్-ద్వారక ఇలా ఉత్తర భారతావని యాత్రలకు సంబంధించిన ప్యాకేజీలు ఎక్కువగా పలకరిస్తుంటాయి. వీటి ధర రూ.12,000 నుంచి రూ.35,000 వరకూ ఉన్నాయి. వాటిలో ఉన్నతమైన ప్యాకేజీని ఎంపిక చేసుకోవడమే మన పని. ట్రావెల్ సంస్థను ఎంచుకునే ముందు ఆ సంస్థ విశ్వసనీయత, గత చరిత్ర గురించి తెలుసుకోవడం మరచిపోవద్దు.

ఏ టూరిస్ట్ ఆపరేటర్లతోనూ సంబంధం లేకుండా.. సొంతంగా వెళ్లే వాళ్లూ ఉంటారు. అయితే మీరు వెళ్లదలచిన ప్రదేశం గురించి వీలైనంత ఎక్కువ సమాచారం తెలుసుకోవాలి. పాస్‌పోర్ట్, వీసా వగైరా ఏర్పాటు చేసుకోవాలి. వీలైనంత తొందరగా విమాన టికెట్లు బుక్ చేసుకోవాలి. ఇప్పటికిప్పుడు వెళ్లాలనుకుంటే బ్యాంకాక్ విమాన టికెట్ ధర రూ.11,000- రూ.18,000 మధ్య ఉంది. అదే.. మే రెండో వారం టికెట్ ఇప్పుడే బుక్ చేసుకుంటే రూ.8,000-రూ.12,000కే దొరుకుతుంది. అన్ని రకాల విమాన టికెట్ల ధరల్లోనూ ఇలాంటి వ్యత్యాసం కనిపిస్తుంది.

లాభంతో వెళ్లి.. క్షేమంగా రండి..

అప్పటికప్పుడు విహారానికి వెళ్దామని ఫిక్సయినవారికి ఈ ఆఫర్లు వర్తించవు. రెండు, మూడు నెలల ముందుగా ఓ నిర్ణయానికి వస్తే టికెట్ల దగ్గరే 20 శాతం లాభపడొచ్చు. ఇదే సూత్రం హోటల్ గదుల బుకింగ్‌కూ వర్తిస్తుంది. ముందుగా బుక్ చేసుకోవడం వల్ల పదోపరకో మిగుల్చుకోవచ్చు. యాప్‌ల సహకారం తీసుకుంటే.. ప్రయాణం స్మార్ట్‌గా సాగిపోతుంది. మొత్తానికి లాభంతో వెళ్లి.. క్షేమంగా తిరిగి రావొచ్చు.



ఆ రెండు నెలలు..

ప్రణాళిక ప్రకారం చేస్తే పనులన్నీ పక్కాగా జరిగిపోతాయి. ఇదే సూత్రం యాత్రలకూ వర్తిస్తుంది. ఆధ్యాత్మిక యాత్ర విషయంలో గుంపులో గోవింద అనే అవకాశం ఉంది కానీ, విహార యాత్ర విషయంలో అన్నీ ఓ పట్టాన తెమలవు. ఎక్కడికి వెళ్లాలో తేల్చడానికే కొన్ని రోజుల సమయం పడుతుంది. ఎలా వెళ్లాలో తేలేసరికి... అక్కడికి వెళ్లే రైళ్లన్నీ వెయిటింగ్ లిస్ట్‌ను సూచిస్తుంటాయి. ప్రైవేట్ ట్రావెల్ సంస్థల ఆఫర్లన్నీ అడుగంటిపోతాయి. విమానం టికెట్ ధరలకు రెక్కలొచ్చేస్తాయ్! ఎక్కడికి వెళ్లాలో.. త్వరగా నిర్ణయించుకుంటే.. రైళ్లో బెర్త్‌లు కన్‌ఫర్మ్ అవుతాయి. విమానం టికెట్ల విషయంలో మంచి బేరం కుదిరే అవకాశాలు ఉంటాయి. మంచి ప్యాకేజీలు దొరుకుతాయి. మనం చేయాల్సిందల్లా ముందుగా నిర్ణయానికి రావడమే! సహజంగా మన దేశంలో ఏప్రిల్ నుంచి జులై వరకు సమ్మర్ వెకేషన్‌గా భావిస్తారు. అందునా పిల్లలకు సెలవులుండే ఏప్రిల్-మే నెలల్లోనే ఎక్కువ యాత్రలు చేస్తుంటారు. ఫిబ్రవరి వచ్చేసింది. వెంటనే ఎక్కడికి, ఎప్పుడు, ఎలా వెళ్లాలో ఓ నిర్ణయానికి వచ్చేయండి. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు మొదలెట్టండి. మీరు సిద్ధమే కదా! రెడీ వన్.. టూ.. త్రీ.. హ్యాపీ జర్నీ!!


మహేంద్రజాలం చూడాల్సిందే!

తూర్పుకనుమల్లో అందాలు నెలకొన్న కొండలు మహేంద్రగిరులు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో పర్వత శ్రేణులపై ప్రకృతి ఎప్పుడూ పరవశిస్తూ ఉంటుంది. చెట్లు, చేమలతో పచ్చలపేరులా మెరిసిపోతున్న మహేంద్రగిరుల్లో.. అక్కడక్కడా వజ్రాలు పొదిగినట్టుగా అపురూప ఆలయాలు దర్శనమిస్తాయి. ముత్యాలు కుమ్మరించినట్టుగా నీటి చెలమలు కనిపిస్తాయి. ఈ గిరులకు ఏడాదంతా పర్యాటకుల తాకిడి ఉంటుంది. ముఖ్యంగా శివరాత్రి సందర్భంగా వేల మంది భక్తులు తరలి వస్తారు. ఇక్కడి పాండవుల ఆలయాలను సందర్శిస్తారు. ఆ చుట్టుపక్కల వాళ్లు ప్రతిష్ఠించిన మహాలింగాలను భక్తితో పూజిస్తారు.

ఇలా వెళ్లాలి..

- మహేంద్రగిరుల యాత్రకు సాహసంతో పాటు ఓపిక కూడా ఉండాలి. ముందుగా శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి బస్సుల్లో మందస మండలం సింగుపురం చేరుకోవాలి.
- మహేంద్రగిరులకు సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ పలాస. ఇక్కడి నుంచి మందస మీదుగా సింగుపురం చేరుకోవచ్చు. బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి.
- సింగుపురం నుంచి వాహనాల్లో.. చొంపాపురం మీదుగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన రాజబసకు వెళ్లాలి. ఆపై కాలినడక మొదలవుతుంది. దాదాపు 28 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. చల్లని గాలులు, ప్రకృతి సౌందర్యం, గలగల పారే సెలయేళ్లు.. యాత్రికులకు అలసట తెలియనివ్వవు.

సందర్భం





శ్రీకాకుళం జిల్లా మందస మండలం సింగుపురం సమీపంలో ఉంటాయి మహేంద్రగిరులు. సముద్ర మట్టానికి ఐదువేల అడుగుల ఎత్తులో ఉన్నాయివి. అరుదైన వృక్షసంపద వీటి సొంతం. వనవాసకాలంలో పాండవులు మహేంద్రగిరులపై కొంతకాలం గడిపారని చెబుతారు. ఆ సమయంలో ఒక్కొక్కరూ ఒక్కో మందిరాన్ని నిర్మించుకొన్నారని స్థానిక కథనం. అందుకు తగ్గట్టుగా ఇప్పుడు అక్కడ పాండవుల పేరిట ఆలయాలు కనిపిస్తాయి. ధర్మరాజు, కుంతీదేవి ఆలయాలు ఒక ప్రదేశంలో ఉండగా.. భీమసేనుడి ఆలయం ఎత్తయిన శిఖరంపై కనిపిస్తుంది. అక్కడికి కొంత దూరంలో అర్జునుడు, నకుల, సహదేవుల ఆలయాలు ఉన్నాయి. వీటి పరిసర ప్రాంతాల్లో పాండవులు ప్రతిష్ఠించారని భావించే లింగాలు కనిపిస్తాయి.



కాలప్రవాహంలో ఆలయాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా.. వాటి ప్రాశస్త్యం మాత్రం తగ్గలేదు. ఏటా శివరాత్రి సందర్భంగా మహేంద్రగిరులపై జరిగే ఉత్సవాలకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. పిల్లలు, పెద్దలు వ్యయప్రయాసలకోర్చి సాహసయాత్రకు పూనుకుంటారు. శివరాత్రికి ఒకరోజు ముందుగానే భక్తులంతా గిరులపైకి చేరుకుంటారు. పూజాసామగ్రి, మంచినీళ్లు, ఆహారం, పళ్లు అన్నీ వెంట తెచ్చుకుంటారు. శివరాత్రి ఉపవాస దీక్షలో ఉంటారు. భజనలతో రాత్రంతా జాగరణ చేస్తారు. మర్నాడు భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణం అవుతారు. శివరాత్రి సందర్భంగా జనంతో కిటకిటలాడే మహేంద్రగిరులు ఆ తర్వాత బోసిపోతాయి. సాహస యాత్రికులు మాత్రం తరచూ ఇక్కడికి వస్తుంటారు.

– సూరకాసుల వెంకటరమణ, గూన నీలకంఠం న్యూస్‌టుడే, కాశీబుగ్గ-మందస

గంగ నడుమ జంగమయ్య

త్రిశూలంతో దుష్టులను దునుమాడే శివయ్య.. ఆ ఊళ్లో గునపం పట్టి కూలీ అయ్యాడు. నెత్తిన మట్టి తట్టలు మోశాడు. తనకు ఆశ్రయమిచ్చిన గ్రామంలో నీళ్లకు కటకట లేకుండా చేశాడు. అనాథగా వచ్చి.. ఆ ఊరికి నాథుడిగా నిలిచిపోయాడు. ఆ గ్రామమే సిరిచెల్మ. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో ఉంటుంది.

లోకల్ టూర్





సిరిచెల్మలో ఒక విశాలమైన చెరువు ఉంటుంది. ఆ చెరువు మధ్యలో అందమైన శివాలయం ఉంది. వారధి మీదుగా ఆలయానికి వెళ్తారంతా. శతాబ్దాల కిందట ఇక్కడ పరమేశ్వరుడు లింగరూపంలో వెలిశాడని స్థానికుల నమ్మకం.

అనాథగా వచ్చి..

"ఏడో శతాబ్దంలో సిరిచెల్మ గ్రామంలో పిట్టయ్య, నిమ్మవ్వ అనే ఇద్దరు దంపతులు ఉండేవారు. గారెలు అమ్ముతూ జీవనం సాగించే ఆ దంపతులకు సంతానం లేదు. ఒక రోజు ఓ బాలుడు పశువులు కాస్తూ ఆ గ్రామానికి వచ్చాడు. అనాథనైన తనకు ఆశ్రయం ఇవ్వాల్సిందిగా పిట్టయ్య దంపతులను కోరాడు. ఆ బాలుడికి మల్లన్న అని పేరు పెట్టి పెంచుకోసాగారు ఆ దంపతులు. కొన్నాళ్లకు గ్రామంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఊరిలో చెరువు తవ్విస్తే లాభం ఉందనుకున్నారంతా. కానీ, చెరువు తవ్వించే శక్తి ఎవరికీ లేదు. మల్లన్న ముందుకొచ్చి తానొక్కడినే చెరువు తవ్వుతానని ప్రతిజ్ఞ చేశాడు. బాలకుడి మాటలు ఎవరూ పట్టించుకోలేదు. మర్నాడు ఊరి నడిబొడ్డున చెరువును చూసి గ్రామస్థులంతా అచ్చెరువొందారు. చెరువు కనిపించింది. అందులో నీటి ఊటా కనిపించింది. చెరువు తవ్వుతానన్న మల్లన్న మాత్రం కనిపించలేదు. అంతా వెతికారు. చెరువు మధ్యలో లింగమొకటి దర్శనమిచ్చింది. కుర్ర మల్లన్నే.. ఈ మల్లికార్జునుడని భావించారంతా! మర్నాడు పిట్టయ్య దంపతుల కలలో మల్లన్న కనిపించి.. చెరువు తవ్వినందుకు గానూ.. తనకు ఆలయం కట్టించాల్సిందిగా ఆజ్ఞాపించాడట. ఆ మాట ప్రకారం చెరువులో మల్లన్న ఆలయం కట్టించారు" అని స్థానికంగా ఓ కథ ప్రచారంలో ఉంది. అందుకు తగ్గట్టుగానే మల్లన్న ఆలయంలో లింగం పైన ఎవరో మొత్తినట్టు ఉంటుంది. రాత్రంతా తట్టలు మోయడం వల్ల లింగాగ్రభాగం అలా లోనికి ఉంటుందని విశ్వసిస్తారు.

ఎలా వెళ్లాలి

సిరిచెల్మ ఇచ్చోడ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇచ్చోడ నుంచి సిరిచెల్మకు బస్సులు, ఆటోలు నడుస్తాయి. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్లే దారిలో ఇచ్చోడ వస్తుంది. ఆదిలాబాద్ నుంచి ఇచ్చోడ 32 కిలోమీటర్లు ఉంటే.. నిర్మల్ నుంచి 48 కిలోమీటర్లు.

జలపాతాలు చూసుకొని..

- ఇచ్చోడ నుంచి కుంటాల జలపాతానికి దూరం 23 కిలోమీటర్లు. కుంటాల నుంచి గాయత్రి జలపాతానికి కూడా వెళ్లొచ్చు.
- ఇచ్చోడ నుంచి పొచ్చెర జలపాతానికి 19 కిలోమీటర్లు.

ఎన్నో విశేషాలు..


సిరిచెల్మ ఆలయంలో రెండు నందులు ఉంటాయి. ఒకటి గర్భగుడిలో ఉంటే మరొకటి ఆలయం వెలుపల 25 అడుగుల దూరంలో ఉంటుంది. సూర్యుడు ఉత్తరాయణం నుంచి దక్షిణాయనానికి సంక్రమించే సమయంలో బయటి నందిపై పడిన సూర్యకిరణాలు గర్భగుడిలోని లింగంపై ప్రతిబింబిస్తాయి. అపురూప శిల్ప సంపద ఈ ఆలయం సొంతం. బుద్ధుడు, వర్ధమాన మహావీరుడి విగ్రహాలు ఇక్కడ కనిపిస్తాయి. ఏకశిలపై గణపతి సహా సప్తమాతృకలతో కలిసి ఉన్న చండీ విగ్రహం ఆకర్షణీయంగా ఉంటుంది. సప్తర్షులతో కలిసి ఉన్న ఆదియోగి శిల్పం ఆనాటి శిల్పకారుల ప్రతిభకు తార్కాణంగా నిలుస్తోంది. ఇవన్నీ పర్యాటకులకు ఆధ్యాత్మిక భావనను పంచుతాయి. సిరిచెల్మ మల్లన్నను దర్శించుకోవడానికి వారాంతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

– అన్నెల లక్ష్మణ్, న్యూస్‌టుడే, ఇచ్చోడ

విహారంలో ఆహారం

విహార యాత్రలో తినే వేళలు.. తినే పదార్థాల విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. ఎక్కడపడితే అక్కడ, ఏది పడితే అది తినేస్తుంటారు. దీనివల్ల మీ ప్రయాణం భారంగా మారే ప్రమాదం ఉంది. ఆహారం విషయంలో ఈ సూచనలు పాటిస్తే మీ ప్రయాణం ఆద్యంతం ఆనందంగా సాగిపోతుంది.

- ప్రయాణంలో ఉన్నప్పుడు ప్రతి రెండు గంటలకోసారి తేలికపాటి ఆహారం తీసుకోవాలి. దీనివల్ల జీవక్రియలు సాఫీగా సాగుతాయి.
- అన్ని ప్రదేశాల్లో మనకు నచ్చిన ఆహారం దొరకదు. అందుకే పళ్లు, డ్రైఫ్రూట్స్, చాక్లెట్లు, బిస్కెట్లు దగ్గరుంచుకోవాలి.
- సోడా, కూల్‌డ్రింక్స్‌కు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు తాగండి.
- తరచూ నీళ్లు తాగుతుండాలి. దీనివల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది.
- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల జోలికి వెళ్లకపోవడం మంచిది.
- ప్రయాణంలో ఫలానా ఆహారమే కావాలంటే కుదరదు. పట్టువిడుపులు ఉండాలి. ఏది తిన్నా.. మితంగా తినడం ఉత్తమమైన మార్గం. మసాలాలు లేని పదార్థాలను ఎంచుకోండి.



దిక్సూచి

వైఫై మీ చుట్టూ..

ప్రయాణాల్లో చరవాణి సేవలు ఇప్పుడు ఎక్కువయ్యాయి. అంతర్జాలం తప్పనిసరి. విదేశాలకు వెళ్లినప్పుడు మొబైల్ డేటా సేవల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. అంతర్జాతీయ రోమింగ్ ఛార్జీలు మొబైల్ డాటా వాడకంపై ప్రభావం చూపుతాయి. ఇలాంటప్పుడే వైఫై సదుపాయం ఉంటే బాగుండనిపిస్తుంది. మీ ఫోన్‌లో 'వైఫై మ్యాప్' (WiFi Map) యాప్ ఉంటే.. వైఫై మీ చుట్టూ ఉంటుంది. ఈ యాప్ మన చుట్టూ అందుబాటులో ఉన్న ఉచిత వైఫైల వివరాలు, పాస్‌వర్డ్స్ సహా చెప్పేస్తుంది. ఆ వైఫై జోన్‌లో కాసేపు ఉండి.. అంతర్జాలంలో కావాల్సిన సమాచారం



రాబట్టవచ్చు. రూట్ మ్యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొని.. సాఫీగా ప్రయాణం కొనసాగించవచ్చు.

ఈనాడు సినిమా


కాజల్

పండగొస్తే... ఏడుపొస్తుంది

అమ్మాయిల మనసు బహు సున్నితం. ఇంటితో, కుటుంబ సభ్యులతో వాళ్లకు గట్టి అనుబంధమే ఉంటుంది. కొన్ని రోజుల పాటు కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తే తట్టుకోలేరు. కథానాయికలకూ ఇలాంటి బెంగ సహజం. కాజల్‌కి అది కాస్త ఎక్కువేనట. "షూటింగుల కోసం ఇంటికి దూరంగా ఉండాల్సివస్తుంటుంది. అమ్మా, నాన్న నాతో ప్రయాణం చేస్తుంటారు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల వాళ్లకు ప్రతీసారీ నాతో ఉండడం కుదరని పని. ఒంటరిగా విదేశాలకు వెళ్లినప్పుడు, సుదూర ప్రాంతాలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఏమీ అనిపించదు. సినిమాపై ఇష్టంతో సర్దుకుపోతుంటాను. కానీ షూటింగులో ఉన్నప్పుడు పండగల్ని, పుట్టిన రోజు వేడుకల్ని, శుభకార్యాల్ని మిస్ అవుతుంటా. అలాంటప్పుడు ఏడుపొస్తుంది. అందుకే దాదాపుగా పండగ రోజుల్లో నా కాల్షీట్లు ఇంటికే కేటాయిస్తా. ఇంట్లో అందరి మధ్య సంతోషంగా గడిపే సందర్భాల్ని ఎప్పుడూ కోల్పోను" అంది కాజల్.


బాలకృష్ణ

గెటప్పులు రెడీ అవుతున్నాయ్!

ఎన్టీఆర్ అంటే... ఓ రాముడు, ఓ కృష్ణుడు, ఓ కర్ణుడు, ఓ దుర్యోధనుడు.. ఇలా ఎన్నో! ఆయన పోషించినన్ని పాత్రలు బహుశా వెండి తెరపై ఎవ్వరూ చేయలేదేమో! ఇప్పుడు ఆయా పాత్రల్లో పరకాయ ప్రవేశం చేస్తున్నారు నందమూరి వారసుడు బాలకృష్ణ. ఎన్టీఆర్ ఆత్మ కథని 'ఎన్టీఆర్' అనే పేరుతో వెండితెరపైకి తీసుకొస్తున్నారు. ఇందులో బాలకృష్ణ ఏకంగా 62 గెటప్పుల్లో కనిపించబోతున్నారు. ఎన్టీఆర్ వెండి తెరపై పోషించిన పాత్రలన్నింటినీ బాలయ్య ఇప్పుడు మళ్లీ చేసి చూపిస్తారన్నమాట. అందుకోసం తగిన కసరత్తులు మొదలయ్యాయి. బాలీవుడ్ నుంచి ఓ టీమ్ ఇప్పుడు రంగంలోకి దిగింది. బాలయ్య కోసం కొన్ని స్కెచ్చులు తయారు చేస్తున్నారు. ఆయన కేశాలంకరణ ఎలా ఉండాలో, మీస కట్టు ఎలా ఉండాలో... బొమ్మలు వేసి చూపిస్తున్నారు. ఈ కసరత్తు పూర్తయిన తరవాత ఆయా గెటప్పులకు సంబంధించిన కాస్ట్యూమ్స్ డిజైన్ చేస్తారు. వారాహి చలన చిత్రం సంస్థ రూపొందిస్తున్న ఈ సినిమా మార్చిలో సెట్స్‌పైకి వెళ్తుంది.

గీతోపదేశం

ఒకటే జననం ఒకటే మరణం
ఒకటే గమనం ఒకటే గమ్యం
గెలుపు పొందే వరకూ
అలుపు లేదు మనకు
బ్రతుకు అంటే గెలుపూ
గెలుపు కొరకే బ్రతుకు

గీతం: ఒకటే జననం...
చిత్రం: భద్రాచలం
రచన: సుద్దాల అశోక్‌తేజ

- పంపినవారు: మహ్మద్ జయినోద్దీన్, ఉమ్మెడ

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్- 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

అమెరికాలో మొదలెడతారు


శ్రీనువైట్ల

'నీకోసం' 'దుబాయ్ శీను', 'వెంకీ'... ఇలా ప్రతి కథతోనూ పుష్కలమైన వినోదం వడ్డించారు శ్రీనువైట్ల. ఆయా పాత్రల్లో రవితేజని మలిచిన విధానం కూడా ఆకట్టుకుంది. ఇప్పుడు వీరిద్దరి కలయికలో నాలుగో చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. స్క్రిప్టు పనులు పూర్తయ్యాయి. వచ్చే నెల తొలివారంలో సెట్స్‌పైకి వెళ్తుంది. ముందుగా అమెరికాలో కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారు. ఈ చిత్రం కోసం 'అమర్ అక్బర్ ఆంటోనీ' అనే పేరు పరిశీలిస్తున్నారు. అయితే ఇది కేవలం వర్కింగ్ టైటిల్ అని, కొత్త పేరు త్వరలో చెబుతారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ కథలో ముగ్గురు కథానాయికలకు చోటుందని, సునీల్ ఓ కీలకమైన పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.


రవితేజ

గాల్లో మేడలు కట్టేస్తాడు


మానస్, నిత్య నరేష్

మానస్, నిత్య నరేష్, కారుణ్య ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'సోడా గోలీసోడా'. మల్లూరి హరిబాబు దర్శకుడు. సత్య సింధూజ నిర్మాత. ఈనెల 16న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "గాల్లో మేడలు కట్టే కుర్రాడి కథ ఇది. గొప్పలు చెప్పుకుంటూ జీవితాన్ని గడిపేస్తాడు. అలాంటి కుర్రాడు ప్రేమలో పడితే ఏమవుతుందో చూపిస్తున్నాం. ఈ తరానికి స్ఫూర్తినిచ్చే కథ ఇది. వినోదాత్మకంగా సాగుతుంది. వాణిజ్య అంశాలన్నీ ఉన్నాయి. సంగీతం: భరత్

ఆవు... పిల్లినడకలు నడుస్తుందేంటి?


సోనాక్షి సిన్హా

బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా వెండితెరకు రాకముందు చాలా బొద్దుగా ఉండేది. సినిమాల్లోకి అడుగుపెట్టేనాటికి కొంచెం తగ్గింది. ఆ సమయంలో సోనాక్షిని చాలా మంది విమర్శించేవారు. ఓ సారి ఫ్యాషన్ షోకి హాజరైనప్పుడు ఓ కాలమిస్ట్ ఆమెని ఆవుతో పోల్చారట. ఈ మధ్య ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సోనాక్షి ఈ సంగతి గుర్తుచేసుకొంది. "నేను ఓ ఫ్యాషన్ షోకు హాజరయ్యాను. తెల్లరంగు దుస్తుల్లో మెరిసిపోయాను. అలా హొయలొలికిస్తూ వెళుతున్నప్పుడు "ఇదేంటి ఆవు క్యాట్ వాక్ చేస్తోంది?" అని ఓ కాలమిస్ట్ అన్నారట. ఆ విషయం నాకు డిజైనర్ మనీష్ మల్హోత్రా ద్వారా తెలిసింది. కానీ నేనేమీ పట్టించుకోలేదు. ఇలాంటి వ్యాఖ్యల గురించి ఆలోచిస్తే నెగెటివ్ ఆలోచనలు వచ్చేస్తాయి. స్కూల్లో చదువుకొనేటప్పుడు, టీనేజ్‌లోకి వచ్చాకానూ నా బరువు గురించి చాలామంది హేళన చేసేవారు. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టే సమయానికి 90 కిలోల నుంచి 60 కిలోలకు తగ్గాను. ఎందుకంటే సాధారణ వ్యక్తులు ఎలా ఉన్నా సమస్య లేదు. సినిమా తారలు అంటే అందంగా కనిపించాల్సిందే కదా. విచిత్రం ఏంటంటే అప్పుడు నేను అంత బరువున్నా నా తొలి చిత్రం 'దబాంగ్' సూపర్ హిట్ అయింది"అని చెప్పింది సోనాక్షి. ఇప్పుడైతే సోనాక్షి చాలా నాజూగ్గా తయారైంది.


పూజాగాంధీ

ఈ కథ ఎలా ముగుస్తుందో...

బొమ్మాళి రవిశంకర్, పూజా గాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'దండుపాళ్యం 3'. శ్రీనివాసరాజు దర్శకత్వం వహించారు. శ్రీనివాస్ మీసాల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. మార్చి 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "దండుపాళ్యం సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలూ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఇదే ఆఖరి భాగం. అందుకే ముగింపు ఎలా ఉంటుందా అని ప్రేక్షకులంతా ఎదురు చూస్తున్నారు. వాళ్ల అంచనాలకు తగ్గట్టే పతాక సన్నివేశాలు ఉద్వేగభరితంగా సాగుతాయి. ప్రచార చిత్రాలకు వస్తున్న స్పందన బాగుంది" న్నారు.



బాలయ్య... ప్రభాస్ ఎంతో నేర్పించారు!

ఫేస్ కాస్త లెఫ్ట్ టర్నింగ్ ఇచ్చుకుంటే చిరంజీవిలా... రైట్ టర్నింగ్ తీసుకుంటే... పవన్ కల్యాణ్‌లా కనిపిస్తుంటాడు సాయి ధరమ్ తేజ్. మావయ్యల పోలికలనే కాదు, వాళ్లలో ఉన్న ప్రతిభనూ వారసత్వంగా అందుకున్నాడు. అందుకే తన నటనతో, డాన్సులతో మురిపిస్తున్నాడు. తాజాగా 'ఇంటిలిజెంట్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. శుక్రవారం 'ఇంటిలిజెంట్' విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం **సాయిధరమ్ తేజ్** 'ఈనాడు సినిమా'తో మాట్లాడారు.

'ఇంటిలిజెంట్'లో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

నేనో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కనిపిస్తా. చిన్నప్పటి నుంచి కంఫర్ట్ జోన్‌లో బతకాలనే తత్వం తనది. కానీ... ఎప్పటికప్పుడు క్లిష్టపరిస్థితులు ఎదురవుతుంటాయి. వాటిని తన తెలివితేటలతో ఎలా ఎదిరించాడన్నదే కథ. మనకు సహాయం చేసినవాళ్లని ఎప్పటికీ మర్చిపోకూడదు అనే మంచి మాట కూడా అంతర్లీనంగా చెబుతున్నాం.

మీ వరకూ కొత్తగా అనిపించిన అంశం ఏమిటి?

తొలిసారి పూర్తిస్థాయి కమర్షియల్ సినిమా చేస్తున్నా. అందుకే నాకు కొత్తగా అనిపిస్తుంది. చెప్పాలనుకున్న విషయాన్ని వినోదం జోడించి చెప్పారు వినాయక్.

వినాయక్ లాంటి అగ్ర దర్శకుడితో సినిమా చేస్తానని ఎప్పుడైనా ఊహించారా?

లేదండీ. ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో అస్సలు ఊహించలేను. వరుసగా నాలుగు పరాజయాలొచ్చాయి. మరోవైపు వినాయక్ 'ఖైదీ నంబర్ 150'లాంటి సినిమా చేశారు. ఆ వెంటనే నాతో సినిమా చేస్తానని ఎలా అనుకుంటాను? ఓ రోజు ఫోన్ చేసి.. 'మనమిద్దరం సినిమా చేద్దామా' అని అడిగేసరికి నోట మాట రాలేదు. ఆయనకు చాలా ఓపిక. ప్రతీ విషయాన్నీ చిరునవ్వుతో చెబుతారు. అనుభవజ్ఞులతో పనిచేయడంలో ఉన్న సౌలభ్యం నాకు తొలిసారి తెలిసొచ్చింది. 'ఇంటిలిజెంట్' ప్రచార కార్యక్రమాలకు బాలకృష్ణ, ప్రభాస్ వచ్చి ఆశీర్వదించారు. వాళ్ల ప్రేమని ఎప్పటికీ మర్చిపోలేను. బాలకృష్ణ, ప్రభాస్ మా తరానికి ఎంతో నేర్పారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండడం, తోటి కళాకారుల్ని ప్రోత్సహించడం వాళ్లని చూసి నేర్చుకోవాలి.

నాలుగు పరాజయాలు వచ్చాయని మీరే అంటున్నారు.. మరి తప్పులెక్కడ జరుగుతున్నాయో గమనించారా?

పరాజయాలకు కారణాల్ని అన్వేషించా. మంచి కథలు ఎంచుకున్నా, వాటిని ప్రేక్షకుడికి నచ్చేలా తీర్చిదిద్దలేకపోయామేమో అనిపిస్తుంది. సినిమా అనేది సమష్టి కృషి. తప్పొప్పుల్ని ఒకరిమీదకు నెట్టేయలేం.

'జవాన్'పై మీరు చాలా ఆశలే పెట్టుకున్నారు కదా?

అవును. ఆ కథంటే ఇప్పటికీ గౌరవమే. కథానాయకుడి ఇంట్లోనే ప్రతినాయకుడు ఉండడం అనే అంశం నాకు కొత్తగా అనిపించింది.

కథానాయికల ఎంపిక విషయంలో జోక్యం చేసుకుంటారా?

లేదు. దర్శకులకంటూ కొన్ని లెక్కలుంటాయి. వాళ్ల ఆలోచనలకు విలువ ఇస్తా.

మీ వయసులో ఉన్న మిగిలిన కథానాయకులు కొత్త తరహా కథలతో ప్రయోగాలు చేస్తున్నారు. మీకు కూడా అలాంటి ఆలోచనలున్నాయా?

'సుప్రీమ్' టైమ్‌లో రాజేంద్రప్రసాద్ ఓ మాట చెప్పారు. 'మన దగ్గరకు వచ్చిన అవకాశాన్ని ఎంత బాగా వాడుకున్నామా అనేదే ముఖ్యం' అన్నారు. అప్పటి నుంచీ నేనూ అలానే ఆలోచిస్తున్నా. నా పనిని ఎంత శ్రద్ధగా, ప్రేమగా చేస్తున్నానన్నదే ముఖ్యం. నా దగ్గరకు అన్నీ కమర్షియల్ కథలే వస్తున్నాయి. అందులో నాకు నచ్చినవే చేస్తున్నా.

వరుణ్‌తేజ్ 'తొలిప్రేమ', 'ఇంటిలిజెంట్' ఒక్క రోజు తేడాలో విడుదల అవుతున్నాయి. మీలో మీకు పోటీ అని అభిమానులు అనుకుంటారేమో?

అదేం లేదండీ. మా ఇద్దరి చేతుల్లో కూడా ఏం లేకుండా పోయింది. విడుదల తేదీ ఖరారు చేసేది నిర్మాతలే కదా. మా ఇద్దరి సినిమాలూ బాగా ఆడాలని కోరుకుంటున్నా.

చిరంజీవి పాటల్ని రీమిక్స్ చేయడం సెంటిమెంట్ అనుకుంటున్నారా?

అదంతా దర్శకుల ఇష్టమేనండీ. 'ఇక్కడ ఫలానా పాట వస్తే బాగుంటుంది' అని దర్శకులు అనుకోబట్టే రీమిక్స్‌లు చేస్తున్నా. ఇప్పటి వరకూ చేసిన నాలుగు పాటల్నీ ఇష్టపడి చేశా.

పంచ్ డైలాగ్

కంప్యూటర్ కాలంలో కూడా కట్టిన తాళికి ఇంకా విలువ ఉందంటే ఆ గొప్పతనం కట్టినవాడిది కాదురా.. కట్టించుకున్న ఆమెది.

చిత్రం: పెదరాయుడు
- పంపినవారు: వి. డేనియల్, జోన్

పసిడి మెరుపుల పట్టు పావడా...!



పండగలైనా, శుభకార్యాలైనా పడతులు ప్రత్యేకంగా కనిపించాలనుకుంటారు. అలాంటి సంప్రదాయ వేడుకలకు నిండుదనం తెస్తాయి ఈ కంచిపట్టు పావడాలు. విభిన్న రంగులూ, ఆధునిక డిజైన్లలో అతివల కోసమే అలరిస్తున్నాయివి. ఇక నచ్చింది ఎంచుకోవడమే తరువాయి...

ఆకర్షణీయమైన అంచూ.. మురిపించే మోటీఫ్‌లతో అందంగా తీర్చిదిద్దిన పావడ.

పసిడి వర్ణంలో మెరిసిపోయే ఈ పావడకు ఖాదీ పనితీరుతో డిజైన్ చేసిన అంచు ప్రత్యేకం!

ఫ్యాషన్ ఫ్యాషన్

ఫొటోలు: దండా శ్రీనివాసరావు
మోడల్: అమీక్షపవార్

ముదురు గులాబీ రంగు కంచిపట్టు పావడాకు కళ తెచ్చిన అంచూ.. మోటిఫ్‌ల మెరుపులు.

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
040-23231147, సైఫాబాద్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, (హైదరాబాద్), విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి.

రంగుల కలబోతగా మలచిన ఈ పావడాకు ప్రత్యేకత తెచ్చిన మోటిఫ్‌లు... ఆహా అనిపించే అంచు.

హ్యాండ్‌బ్యాగులో ఇవి తప్పనిసరి...

ఆఫీసుకు వెళ్లినప్పుడూ, దూర ప్రయాణాలు చేసేటప్పుడు మన హ్యాండ్‌బ్యాగులో కొన్ని వస్తువులు తప్పనిసరిగా ఉంచుకోవాలి. అవి అత్యవసర పరిస్థితుల్లో మన అవసరాల్నీ తీరుస్తాయి.

- మన బ్యాగులో తప్పనిసరిగా ఉంచుకోవాల్సినవి టిష్యూ పేపర్లు. వీలైతే వెట్ టిష్యూ పేపర్లు ఉంచుకుంటే మంచిది. ఏవైనా దూర ప్రయాణాలు చేసినప్పుడు ఇవి పనికొస్తాయి.
- మన చేతులతో ఎప్పుడూ ఏదో ఒక వస్తువు తాకుతూనే ఉంటాం. చేతుల్ని ప్రతి సారీ నీటితో శుభ్రం చేసుకోవడం వీలుకాకపోవచ్చు. అందుకే ఒక శానిటైజర్‌ను తప్పకుండా దగ్గరుంచుకోవాలి. అవసరమైనప్పుడల్లా సులభంగా చేతులు శుభ్రం చేసుకోవచ్చు.
- కొన్ని పిన్నులు కూడా తప్పనిసరే. అనుకోకుండా దుస్తులు చిరిగినప్పుడు వీటి అవసరం ఎంతో మనకి తెలుసు.
- కొన్నిసార్లు పర్సు తీసుకెళ్లడం మర్చిపోతాం. అందుకే డబ్బు మొత్తం ఒకే దగ్గర కాకుండా హ్యాండ్‌బ్యాగులో కూడా కాస్త డబ్బు ఉంచుకోండి.
- ఒక చిన్న నోట్‌బుక్, పెన్ను దగ్గర ఉంచుకోవడం మంచి అలవాటు. ఏదైనా గుర్తొచ్చినప్పుడు అందులో రాసుకోవచ్చు. ప్రతిసారీ ఫోను మీద ఆధారపడకుండా కొన్ని నంబర్లూ, చేయాలనుకున్న పనులు దాంట్లో రాసి ఉంచుకోండి.



- కొంతమందికి తరచూ జలుబూ, తలనొప్పి లాంటివి వస్తూ ఉంటాయి. అందుకే వాటి తాలూకు మాత్రలు ఎప్పుడూ దగ్గర పెట్టుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు.
- ఎప్పుడూ ఒకటిరెండు శానిటరీ న్యాప్‌కిన్‌లు బ్యాగులో ఉంచుకోవడం మర్చిపోవద్దు. ఇది అత్యవసర పరిస్థితుల్లో మీకే కాదు ఇంకెవరికైనా ఉపయోగపడొచ్చు.

బంగారం వెండి

8 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,960	31,150	-------	30,950
ఆర్నమెంట్	28,910	29,100	-------	28,800
వెండి (కిలో)	38,900	39,100	-------	40,000
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	-------	30,850	30,580	30,890
ఆర్నమెంట్	-------	28,610	28,580	28,890
వెండి (కిలో)	-------	39,700	38,100	38,900
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,040	31,040	-------	-------
ఆర్నమెంట్	28,870	28,870	2,858	2,889 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	40.70	41.50

email:
vasundhara@eenadu.net

వ్యాయామానికి ముందు ఏం తినాలంటే..!!

జిమ్‌కు వెళ్లే ముందు కొంతమంది ఏమీ తినరు..మరి కొందరు ఎలాగో కసరత్తులు చేస్తాం కదా అని ఇష్టమైన ఆహారం లాగించేస్తారు. కానీ ఆ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పూర్తి ప్రయోజనం ఉండదు.

- ఓట్స్‌ను తీసుకోవడం వల్ల పిండిపదార్థాలు శరీరంలోకి నెమ్మదిగా విడుదలవుతాయి. అంటే కసరత్తులు చేస్తున్నంతసేపు ఉత్సాహంగా ఉండటానికి కావల్సిన శక్తి వస్తూ ఉంటుంది. ఒకేసారి అలిసిపోయినట్లు అనిపించదు. అందుకే జిమ్‌కు వెళ్లే ముందు ఒక గిన్నె నిండా ఓట్స్ తిని చూడండి.
- అరటిపండ్లలో పొటాషియం, త్వరగా జీర్ణమయ్యే పిండిపదార్థాలు పుష్కలంగా ఉంటాయి. పైగా కావల్సిన శక్తి కూడా అందుతుంది.
- గుడ్డులోని తెల్లసొన తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన మాంసకృత్తులు అందుతాయి. రెండు గుడ్ల తెల్లసొనలో 8 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి. పైగా కొవ్వు సమస్య ఉండదు.
- నిద్ర లేవగానే జిమ్‌కు వెళ్తుంటే ఖాళీకడుపున కాకుండా ఒక గిన్నెనిండా పెరుగు తిని చూడండి. దీని వల్ల శరీరం చురుగ్గా ఉంటుంది.



- గుడ్డు తినని వారు కూరగాయలూ, సెనగపిండీ కలిపి దోసెలా వేసుకుని తినొచ్చు. దీంట్లో వీలైనన్ని ఎక్కువ కూరగాయల ముక్కలు ఉండేలా చూసుకోవాలి.
- యాపిల్‌ముక్కలూ, పీనట్ బటర్ కలిపి తింటే ఒక కొత్త రుచి మన నోటికి పరిచయం చేసినట్లే. ఈ రెండింటినీ కలిపి తినడం వల్ల శరీరానికి కావల్సిన పిండిపదార్థాలూ, మాంసకృత్తులు శరీరానికి అందుతాయి.

అమ్మ మొదటిసారి నవ్వింది

రగ్బీ ఆటంటే అందరికీ తెలియకపోవచ్చు. అదే రాజమౌళి 'సై' సినిమాలో ఆట అంటే ప్రతి ఒక్కరికీ తెలుస్తుంది. రెండు బృందాలుగా ఏర్పడి బంతిని తన్నుకుంటూ ఆడే ఆట. ఈ క్రీడలోనే దూసుకుపోతోంది అనూష. అయితే ఏంటి అనుకుంటున్నారా... కష్టాల నేపథ్యం నుంచి.. బాల్యవివాహం అనే అడ్డు గోడల్ని దాటుకుంటూ.. మైదానంలోకి వచ్చింది. అమ్మ కష్టాలను తీర్చడమే లక్ష్యంగా ఆటలో పరుగులు తీస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో జరుగుతోన్న జాతీయ రగ్బీ క్రీడలో రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తోన్న అనూష జీవితమిది.



'మంచి సంబంధం వచ్చింది.. ఇక పెళ్లి చేసుకో... నీ పోషణ ఖర్చు మిగులుతుంది. మాకు బరువు తీరుతుంది' అని అమ్మ చెప్పినప్పుడు ఎంతో బాధ కలిగింది. అదే సమయంలో అమ్మ మీద జాలేసింది. నాన్న మీద పట్టలేని కోపం వచ్చింది. ఎందుకంటే తనే ఉంటే... ఆ రోజున అమ్మ నాతో అలా అని ఉండేది కాదు. నాకూ పెళ్లి ఇష్టం లేదు. చదువుకుంటూ.. ఆటలు ఆడుకోవాలని ఉండేది. కానీ అమ్మ పరిస్థితి బాగోలేదు. నాలుగిళ్లలో పాచి పని చేస్తేనే ఆమె నన్నూ, తమ్ముణ్ని పోషించగలదు. కనీసం నేను పెళ్లి చేసుకుంటే అయినా అమ్మ భారం, బెంగ తీరతాయని ఒప్పుకున్నా. పెళ్లి చేసుకోబోయే అబ్బాయితో కూడా మాట్లాడి చదివించమని కోరుకున్నా. అతనూ అందుకు ఒప్పుకున్నాడు. పెళ్లి విషయం బడిలోకూడా చెప్పలేదు. చుట్టుపక్కల వారికీ తెలియదు. కానీ ఇక పెళ్లి పది రోజులు ఉంది అనగా బాలలహక్కుల సంఘం వాళ్లు పోలీసులతో వచ్చి పెళ్లి ఆపేశారు. అమ్మకీ, మా బంధువులకీ కౌన్సెలింగ్ ఇచ్చారు. నన్ను కొన్ని రోజులు ఇంటికి దూరంగా ఓ వసతి గృహంలో ఉంచారు. అదీ నా మంచికే జరిగింది. చదువులో ఎప్పటిలా కొనసాగడమే కాదు...రగ్బీ క్రీడలోనూ ముందుకు సాగా. తెలంగాణలో రంగారెడ్డి తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే స్థానం దక్కించుకున్నా. ఇదంతా సంతోషంగా ఉన్నా.. మా అందర్నీ నిర్దాక్షిణ్యంగా వదిలేసిన నాన్నని తల్చుకుంటే మాత్రం కోపం కట్టలు తెచ్చుకుంటుంది.

నాన్న వదిలేశాడు: మా సొంతూరు నల్గొండ జిల్లాలోని దేవరకొండ మండలం కందుకూరు. అమ్మానాన్నలు వ్యవసాయ కూలీలు. వాళ్లకి తమ్ముడు, నేను. చిన్నతనంలో నాన్న కొంత కాలం మమ్మల్ని హైదరాబాద్‌లో ఉంచాడు. తను లారీ డ్రైవర్‌గా పనిచేశాడు. తరవాత మళ్లీ ఊరు వెళ్లాను. అక్కడ ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నా. అయితే నాన్న మాకు కనిపించేది చాలా తక్కువ. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఎప్పుడో ఒకసారి ఇంటికి వచ్చాడు. కొన్నాళ్లకు అసలు ఇంటివైపు రావమే మానేశాడు. కారణం అమ్మనడిగితే బోరున ఏడ్చింది. ఇంకో పెళ్లి చేసుకున్నాడని చెప్పింది. నాన్న మాకంటూ ఏమీ ఉంచలేదు. సొంత ఇల్లు కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్‌లోని అమ్మమ్మ, మేనమామల దగ్గరకు వెళ్లాం. వాళ్లే మమ్మల్ని ఆదరించారు. అమ్మకి పని చూపించారు. మమ్మల్ని ప్రభుత్వ బడిలో చేర్పించారు. అక్కడే నా జీవితం మలుపు తిరిగింది. అక్కడ ఆటలను ఎక్కువ ప్రోత్సహిస్తారు. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘవరెడ్డి సర్ సహకారంతో క్రికెట్ నేర్చుకుని..పలు పోటీల్లో పాల్గొన్నా.

రేషన్ బియ్యమే: ఆటలాడేటప్పుడు దృఢంగా ఉండాలి. మంచి ఆహారం తీసుకోవాలి. నాకు అలాంటి పరిస్థితి లేదు. నెల నెలా వచ్చే రేషన్ సరకులే మాకు ఆధారం. మా అమ్మ అప్పుడప్పుడు చికెన్ మాత్రం వండిపెడుతుంది. తనకి తమ్ముణ్నీ, నన్నూ చదివించడం, పోషించడం భారంగా మారిందని తరవాత అర్థమైంది. అందుకే బంధువుల సలహాతో పెళ్లి చేద్దామని నిర్ణయించుకుంది. అమ్మ కష్టాలు విన్నాక ఇష్టం లేకపోయినా పెళ్లి చేసుకుందామనిపించింది. నాన్నే ఉంటే ఇలా ఉండదు కదాని అనిపించేది. నాకు ఎన్ని సమస్యలున్నా చదువుని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఉదయం సాయంత్రం ఆటలు సాధన చేస్తూ బడికి వెళ్లేదాన్ని. పదోతరగతి కూడా ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యా. ఆ తరవాత ఇంటర్‌లో చేరగానే పెళ్లి సంబంధం వచ్చింది. లోలోపన ఏడ్చేదాన్ని. కానీ పోలీస్‌ల చొరవతో ఆగిపోవడంతో సంతోషంగా అనిపించింది. మరోవైపు అమ్మ బాధను చూస్తే ఇబ్బంది అనిపించేది. అయినా సరే క్రీడాకారిణిగా ఎదగాలనే తపనతో ఆటల మీద దృష్టి పెట్టా. రగ్బీ నేర్చుకున్నా. శిక్షకుల సహకారంతో పలు పోటీల్లో పాల్గొన్నా. గత డిసెంబర్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక జరుగుతుందని తెలిసి నేను పాల్గొన్నా. రంగారెడ్డి జిల్లాలో నేను నంబర్‌వన్‌గా నిలవడంతో జట్టులో స్థానం సంపాదించా. ఇది తెలిసే రాచకొండ సీపీ మహేష్‌భగవత్ అభినందించడమే కాదు.. పదివేల రూపాయల నగదు ప్రోత్సాహం అందించారు. ఇదంతా చూసిన మా అమ్మ మొదటి సారి నవ్వింది.

జుట్టు ఊడుతోందా... నిద్రలేదేమో!

అతిగా స్మార్ట్‌ఫోన్‌ల వాడకం, ఒత్తిడీ వంటివాటితో పాటు తినడానికీ, నిద్రపోవడానికి కూడా సమయం పాటించకపోవడం వంటివి మన జీవనశైలిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంటాయి. వాటి ఫలితాల్లో నిద్రలేమి కూడా ఓ సమస్య. దీనివల్ల మరెన్నో ఇబ్బందుల్నీ ఎదుర్కోవలసి వస్తుంది. అవేంటో తెలుసుకుంటే పరిష్కారం సులువే.



- కొంతమందికి ఎంతసేపు ప్రయత్నించినా సరిగ్గా నిద్రపట్టదు. దీనికి కారణాలేంటో ఒకసారి విశ్లేషించుకోవాలి. ఒత్తిడి కూడా ఓ కారణం కావొచ్చు. అదే అయితే... సరైన ప్రణాళిక వేసుకున్న తర్వాతే నిద్రపోండి. ఏ సమయానికి ఎంత పని పూర్తి చెయ్యగలమో వివరంగా ఒక పేపర్ మీద రాసుకోండి. అప్పుడు మీ పని మీద స్పష్టత వచ్చి పెద్దగా భారం అనిపించదు.
- మన శరీరంలో వచ్చే చిన్న చిన్న మార్పులు జుట్టు మీద ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా సరిగ్గా నిద్ర లేకపోవడం, సరైన సమయానికి పడుకోకపోవడం తరచూ చేస్తూంటే హార్మోన్ల స్థాయుల్లో హెచ్చుతగ్గులు వస్తాయి. దీనివల్ల జుట్టు రాలిపోయే అవకాశం ఎక్కువవుతుంది. ఇలాంటి మార్పులేమైనా కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి.
- సరిగ్గా నిద్రపట్టకపోతే పడుకునే ముందు ఒక అరగంటైనా పుస్తకాలు చదవడం, ధ్యానం చేయడం లాంటివి చేసి చూడండి. దానివల్ల సులువుగా నిద్రలోకి జారుకునే అవకాశం ఉంటుంది.
- సరైన సమయంలో తినకపోవడం, రాత్రివేళల్లో మసాలా పదార్థాలూ, ఘనాహారం తీసుకోవడం వంటివి కూడా దీనికి కారణం కావొచ్చు. అలాంటి అలవాట్ల ప్రభావం ఏమైనా మీమీద ఉందేమో చూసుకోండి. వీలైనంత తొందరగా వాటిని పరిహరించుకోవడానికి ప్రయత్నించండి.



నలుగురికీ నచ్చినవి మాకసలే నచ్చవురో!

షోరూమ్ నుంచి షోకుగా బయటికొచ్చిన వాహనాలు మళ్లీ షెడ్‌లోకి వెళ్లిపోతాయి... మోజుపడి కొనుక్కున్న బైక్‌లు చిత్రంగా రూపాంతరం చెందుతాయి... ఖరీదైన కార్లైనా అంతా విస్తుపోయేలా ముస్తాబవుతాయి... ఆనక రోడ్డుపై పరుగులు పెట్టేస్తాయి... మాడిఫికేషన్, పర్సనలైజేషన్, కస్టమైజేషన్ పేరేదైతేనేం... నలుగురికీ నచ్చినదీ మాకసలే నచ్చదురో అనుకునేవారు... కాసులెన్ని ఖర్చయ్యాయన్నది కాదు కంఫర్టే ముఖ్యం అనుకున్నవాళ్లూ.. ఈ ట్రెండ్ ఫాలో అవుతున్నారు.



మారుతీ, హ్యుందాయ్, హీరో, హోండా.. చెప్పుకొంటూ పోతే ఆటోమొబైల్ కంపెనీల జాబితా పెద్దదే. ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ నచ్చుతుంది. ఒక్కొక్కరు ఒక్కో వెహికిల్‌ని ఇష్టపడతారు. కానీ కొందరు దీంతోనే సర్దుకుపోరు. తమ అభిరుచికి అనుగుణంగా సొంత వాహనానికి మరిన్ని మెరుగులు దిద్దాలనుకుంటారు. ఆలోచన వచ్చింది మొదలు స్టూడియోల్లోకి బయల్దేరతారు. అదేనండీ.. ఆటోమొబైల్ కస్టమ్ స్టూడియోల్లోకి. ఇక చూస్కోండి. పొడవాటి, ఎత్తైన ఫోర్క్‌లున్న హ్యాండిళ్లు.. మెలికలు తిరిగిన సీట్లు.. విచిత్ర ఆకారాల్లో ఇంధన ట్యాంకులు.. ఫైవ్‌స్టార్ హోటళ్లను తలపించే కారు లోపలి భాగాలు.. బరువు తగ్గడాలు.. వినైల్ రాపింగ్‌లు.. అదనపు హంగులు.. పాతవే కొత్తవాటిలా తళతళా మెరిసిపోవడాలు.. అన్నీ సిద్ధమైపోతాయి.

మూడు కోసం మాడిఫై..

'అవసరానికి అనుగుణంగా మార్పులు.. సెంటిమెంట్.. ప్రత్యేకంగా కనిపించాలనే తపన.. ఈ మూడే వాహనాల మాడిఫికేషన్‌కి కారణం' అంటాడు ఐమోర్ కస్టమ్స్ ప్రతినిధి జాయ్. ఉదాహరణకు లాంగ్‌డ్రైవ్‌లకు వెళ్లేవాళ్లకి బైక్ సౌకర్యవంతంగా ఉండాలి. లగేజీ తీసుకెళ్లడానికి అదనపు ఫిటింగ్‌లు అవసరం. త్వరగా అలసిపోకుండా నాణ్యమైన సీట్లు బిగించాలి. బైక్ బరువు తగ్గించుకోవడమూ తప్పదు. తాము ఇష్టపడి కొనుక్కున్న మొదటి వాహనం, అభిమానంతో ఎవరైనా ఇచ్చిన గిఫ్ట్ ఎంత పాతబడ్డా కొనసాగించాలనుకుంటారు చాలామంది. దీనికోసం మరిన్ని ఏళ్లు మన్నేలా చేర్పులు చేయించుకుంటారు. ఆఖరి రకం అందరిలో భిన్నంగా ఉండాలనుకునేవారు. వాహనం రంగు డిజైన్ నుంచి విడిభాగాలు మార్చేయడం వరకు ఏదైనా చేస్తారు. ఈ రకంగా లక్ష రూపాయలు పెట్టి కొన్న బైక్‌కి లక్షన్నర వెచ్చించే షోకిల్లారాయుళ్లు ఉన్నారు. టేస్ట్ కోసం కారుపై కోట్లు గుమ్మరించేవారికి కొదవ లేదు. ఇలాంటి వాహనప్రియుల అభిరుచులు, ఆశల్ని తీర్చే డిజైన్ స్టూడియోలు దేశవ్యాప్తంగా బాగా పేరున్నవి పది వరకు ఉన్నాయి. అందులో ఐమోర్ కస్టమ్స్, డీసీ డిజైన్ అని రెండు హైదరాబాద్‌వే. ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు.. వీరికి మహారాజపోషకులు.

ఏమేం మార్చుతున్నారంటే..

వాహనం ఏదైనా మోడిఫికేషన్‌తో ఎన్ని అద్భుతాలైనా సృష్టించొచ్చు. వెహికిల్ రాపింగ్‌తో మోడర్న్ ఆర్ట్ నుంచి తాము పూజించే దేవుళ్లు, అభిమానించే వాళ్ల చిత్రాలు.. ప్రకృతి దృశ్యాలు వేయించుకునేవాళ్లున్నారు. రేసింగ్‌ని ఇష్టపడేవాళ్లు రోల్ కేజ్, ఏరో అప్‌గ్రేడ్‌లు మార్చేస్తున్నారు. హార్స్‌పవర్ పెంచుకోవడానికి కొందరైతే ఏకంగా ఈసీయూ (ఎలక్ట్రానిక్ చిప్ యూనిట్)లనే మార్చేస్తున్నారు. సౌకర్యంగా ఉంటుందని కారులో అల్యూమినియం స్పోర్ట్ పెడల్స్ వాడుతున్నారు. కారు, బైక్ సీట్లను పూర్తిగా మార్చేయడం మామూలైపోయింది. సంగీతంతో కేరింతలు కొట్టాలనుకునేవారు బైక్‌లకు కూడా మ్యూజిక్‌సిస్టమ్ బిగించేస్తున్నారు. పెద్దగా శబ్దం కావాలనుకునే కుర్రకారైతే ఎగ్జాస్ట్ గొట్టాలను అదనంగా అమర్చుకుంటున్నారు. గేర్లు త్వరగా వేయడానికి, చూడ్డానికి అందంగా కనిపించడానికి షిఫ్ట్ నాబ్‌లు సహా చిన్న పరిమాణంలో ఉండే త్రో షిఫ్టర్ ఉపయోగిస్తున్నారు. కారు బరువు తగ్గించుకోవడానికి తేలికగా ఉండే రూఫ్‌పై మోజు పడే మహానుభావులున్నారు. వీటితోపాటు అలాయ్ వీల్స్, టైర్లకు రంగులు అద్దడం వాళ్లకి నచ్చే స్టైల్. వాహనం బరువు తగ్గేలా, వేగం పెరిగేలా ఫైబర్‌తో రూపొందించిన వింగ్ అద్దాలు, ఇంధనం ట్యాంకు మూతలు, డోర్ హ్యాండిళ్లు, బాడీ ప్యానెళ్లు, బంపర్ ముందుభాగాలు.. మొత్తం కారు రంగు డిజైన్‌నే మార్చేశాలా వెహికిల్ రాపింగ్ ఇప్పుడు జోరు మీదుంది.



పరిమితులున్నాయ్



డబ్బులు పెడుతున్నాం కదాని బండిని ఇష్టం వచ్చినట్టుగా మార్చుకుంటామంటే కుదరదు. దీనికి వాహన చట్టాల నిబంధనలు ఒప్పుకోవు. భారతీయ ఆటోమొబైల్ పరిశోధక సంస్థ, రవాణాశాఖల నిబంధనలకు అనుగుణంగానే ఏదైనా చేయాలి. ప్రయాణికుల భద్రత, వాహన రక్షణ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతివాహనం తయారవుతుంది. వీటిని అతిక్రమిస్తే శిక్షార్హులవుతారు. ఈమధ్యే పొడవాటి ఎగ్జాస్ట్‌లతో శబ్దకాలుష్యానికి కారణమవుతున్నాయని బెంగళూరులో ఓ కంపెనీకి చెందిన బైక్‌ల ఎగ్జాస్ట్‌లను విడదీసి రోడ్డురోలర్‌లతో తొక్కించారు. మామూలు బేసిక్ కారు ఓ లగ్జరీ కారులా మాడిఫై చేయడం గుర్తించి ఏకంగా రిజిస్ట్రేషనే రద్దు చేశారు. కేరళలో జరిగిందిది. అందుకే ... నిబంధనలకు అనుగుణంగానే చేయాలి.

- సాయిభరత్ బొప్పరాజు,
ఆటోమొబైల్ నిపుణుడు

కొలువులు వదిలి.. గ్యారేజీ బాట



బైకింగ్ అనేది ఇప్పుడు అవసరాన్ని మించి ఓ జీవనశైలిగా మారిపోయింది. చాలామంది లాంగ్‌డ్రైవ్‌లను ఇష్టపడుతున్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే చికాకుల్ని తప్పించుకునే మార్గంగా దీన్ని భావిస్తున్నారు. కొంతమందికి వాహనం ఓ స్టేటస్ సింబల్ కూడా. ఇలా ప్రత్యేకంగా ఆలోచించేవాళ్లు, అందరిలో ప్రత్యేకంగా ఉండాలనుకునేవారు వెహికిల్ మోడిఫికేషన్‌కి ఓటేస్తున్నారు. ఒక బైక్‌నే తీసుకుంటే చాలారకాలుగా మాడిఫై చేయొచ్చు. అత్యధిక వెలుగునిచ్చే బ్లింకరు, జీపీఎస్, మొబైల్ ఛార్జింగ్, పెద్ద ఆయిల్ ట్యాంకు, మడ్‌గార్డ్ పరిమాణం పెంచడం..వీటిని కాస్మటిక్ మోడిఫికేషన్ అనొచ్చు. వీటితోపాటు మమ్మల్ని దేశంలోనే టాప్ మోటార్‌సైకిల్ ఆర్టిస్టులుగా నిలిపింది మా కస్టమ్ పెయింటింగ్. ఒకాయన శివభక్తుడు.. కైలాసగిరి, మానససరోవరం, శివుడు.. కలిసి వచ్చేలా బైక్ పెయింట్ చేయమన్నాడు. దీనికోసం పెద్ద పరిశోధనే చేశాం. స్టోరీబోర్డింగ్ చేశాం. దేశంలోని శివాలయాల నమూనాలు గాలించాం. అవన్నీ.. గుదిగుచ్చి ఒక అర్థవంతమైన డిజైన్ చేశాం. ఇంకో కార్పొరేట్ ఉద్యోగి సిల్వెస్టర్ స్టాలోన్ అభిమాని. అతడి కోసం రాకీ బాల్బోవా థీమ్‌తో ఇంకో బైక్‌ని తీర్చిదిద్దాం. ఇలా చేయడానికి నెల్లాళ్లు కష్టపడతాం. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతాం. ఇప్పటికి ఎనభై వాహనాలు మాడిఫై చేశాం. పెయింటింగ్ చేసినవి అంతకు రెట్టింపు ఉన్నాయి.

మా అవసరమే మమ్మల్ని ఐమోర్ కస్టమ్స్ ప్రారంభించేలా చేసింది. ఇద్దరం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేసేవాళ్లం. బైక్‌లు, ఆర్ట్ అంటే ఇద్దరికీ పిచ్చి అభిమానం. అదే మమ్మల్ని కలిపింది. ఇద్దరిలో ఒకరి బైక్ మోడిఫికేషన్ కోసం ఒక గ్యారేజ్ చుట్టూ ఏడాది పాటు తిరిగి అలసిపోయాం. ఆ చిరాకులోంచి మేమే ఎందుకు ఓ గ్యారేజ్ ప్రారంభించకూడదు అనే ఆలోచన వచ్చింది. 2010లో ఓ చిన్నగదిలో ఐమోర్ మొదలైంది. 'కస్టమైజ్డ్ బైక్‌లా.. ఇక్కడ కుదరదు. అమెరికా వెళ్లండి' అని గేలి చేశారు కొందరు. మా సత్తా చూపించడానికి దగ్గరివాళ్ల బైక్‌ల్ని ఉచితంగా మాడిఫై చేసి ఇచ్చేవాళ్లం. తర్వాత ఎలాంటి ప్రచారం లేకుండానే మాపై నమ్మకంతో చాలా ప్రాజెక్టులొచ్చాయి. ఇప్పుడైతే దిల్లీ, కోల్‌కతా, పంజాబ్, చెన్నై, కేరళల నుంచి ఇక్కడికొచ్చి వాళ్లకి నచ్చినట్టు మార్పులు చేయించుకుంటున్నారు. ఇప్పటివరకు గుర్తింపుగా దాదాపు ముప్పైవరకు జాతీయస్థాయి అవార్డులొచ్చాయి. హార్లే డేవిడ్‌సన్ బెస్ట్ కస్టమ్ బైక్, ఇండియా బైక్ వీక్‌లో వరుసగా మూడేళ్లు అవార్డు అందుకున్నాం. అయితే మేం ఏం చేసినా కచ్చితంగా ఆర్‌టీఏ నిబంధనలకు అనుగుణంగానే మార్పులు చేర్పులు చేస్తుంటాం. ఇంజిన్, ఛాసిస్‌లాంటి కీలకమైన భాగాలు మార్చకుండా పూర్తిగా బైక్ రూపాన్ని మార్చేస్తాం.

- మృత్యుంజయదాస్ (ఎంజే), సైకత్ బసు (జాయ్)



మెకానిక్ గురూ

ఇంజిన్‌లో శబ్దాలేంటి?

నా బైక్ అరవై వేగం దాటగానే ఇంజిన్ నుంచి ఏవో శబ్దాలు వస్తున్నాయి. బ్రేక్ వేసినట్టు బండి జర్క్‌లు ఇస్తోంది. వేగం తగ్గిస్తే మళ్లీ ఎప్పట్లాగే బాగున్నట్టే అనిపిస్తోంది. అసలు సమస్యేంటి? ఏం చేయమంటారు?

- ఎస్.శ్రీనివాసరావు, ఆత్మకూరు

బైక్‌ని స్వయంగా పరిశీలిస్తేగానీ సమస్య ఏంటో పూర్తిగా అర్థమయ్యేలా లేదు. మీరు చెబుతున్న వివరాల ప్రకారం బైక్‌లో వాడుతున్న ఇంధనం బహుశా కల్తీదై ఉండొచ్చు. ఆయిల్ ఇంజిన్, కార్బురేటర్‌కి చేరే మార్గంలో ఏవైనా మలినాలు అడ్డుపడుతుంటే ఇలా జర్క్‌లు వచ్చే అవకాశం ఉంది. ఇది కాకుండా ఆయిల్ సంప్ కిందిభాగంలో ఏదైనా బలంగా ఢీకొట్టడంతో డ్యామేజీ అయ్యి కొద్దికొద్దిగా ఆయిల్ కారిపోతుందేమో చూడండి. పిస్టన్‌లో ఏవైనా వ్యర్థాలు ఇరుక్కొని జామ్ అయినా ఇలా జరుగుతుంది. ఇవన్నీ ఒకసారి పరిశీలించాలి.

వ్యాపార పనులరీత్యా నేను రోజుకి కనీసం వంద కిలోమీటర్లు బైక్‌పై తిరుగుతుంటా. ఇప్పుడు కొత్తగా నా శ్రీమతి పిల్లల్ని స్కూల్లో దింపడానికి, ఇంట్లో పనులకూ కూడా ద్విచక్రవాహనం వాడాలనుకుంటున్నాం. ఇద్దరికి సరిపోయేలా మంచి మైలేజీ ఇచ్చే బండి ఏదైనా సూచించండి. నా బడ్జెట్ రూ.70వేలు.

- మతీన్, హైదరాబాద్

వంద సీసీ స్కూటర్ మీకు అవసరాలకు చక్కగా సరిపోతుంది. మార్కెట్లో అందుబాటులో ఉన్న అన్ని బ్రాండ్ల వాహనాలు దాదాపు కొంచెం అటుఇటుగా ఒకే మైలేజీ ఇస్తున్నాయి. బండి నడిపే వేగం, ట్రాఫిక్, డ్రైవింగ్ అలవాట్లు ఇవన్నీ మైలేజీపై ప్రభావం చూపిస్తాయి. టీవీఎస్ జూపిటర్, హోండా యాక్టివా, హీరో మాస్ట్రో.. మీ బడ్జెట్‌లో దొరుకుతాయి.

ఈమధ్యే మారుతిసుజుకీ ఆల్టో కారు కొన్నాను. మంచి మైలేజీకి ఏవైనా టిప్స్ చెప్పండి.

- ఆర్.రమేశ్, శాయంపేట్

- కారు కంపెనీ సూచించినట్టు టైర్లలో గాలి ఒత్తిడి సరిగ్గా మెయింటెయిన్ చేయాలి.
- ఏదైనా ఆయిల్ కంపెనీ నిర్వహించే ఔట్‌లెట్‌లోనే పెట్రోలు లేదా డీజిల్ పోయించండి. అక్కడ కల్తీకి ఆస్కారం తక్కువ.
- వాహనం స్టార్ట్ చేసేటప్పుడు యాక్సిలరేటర్‌పై కాలు వేసి నొక్కి పట్టొద్దు. డ్రైవింగ్‌లో క్లచ్, బ్రేక్‌లపై అదేపనిగా కాలు వేయొద్దు.
- కారు స్టార్ట్ చేయడానికి ముందే ఏసీ, బ్లోయర్ ఆన్ చేయొద్దు.
- తరచూ గేర్లు మార్చే అలవాటు మానుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువగా వాహనం టాప్‌గేర్‌లో నడపడానికి ప్రయత్నించండి.
- తయారీ కంపెనీ సూచించినట్టు క్రమంతప్పకుండా సర్వీసింగ్ చేయించాలి.

www.motofix.in

పౌరుషం.. రాజసం

లోగోట్టు

లగ్జరీ కార్ల లాంబోర్ఘినీ లోగో జోరు మీదున్న ఎద్దు (బుల్) అనే సంగతి ఆటోమొబైల్ ప్రియులందరికీ తెలుసు కదా! అయితే దీని వెనక పెద్ద కథే ఉంది. లాంబోర్ఘినీ కార్ల కంపెనీ వ్యవస్థాపకుడు ఫెరూసియో లాంబోర్ఘినీది వృషభరాశి. ఆయనకు జాతకాలపై బాగా నమ్మకం. అదీకాకుండా బుల్‌ఫైటింగ్ అంటే మహా ప్రీతి. ఈ రెండూ కలిసి వచ్చేలా తాను కంపెనీ మొదలుపెట్టినపుడు బంగారు వర్ణంలో మెరిసిపోయే పోట్లగిత్తను లోగోగా ఎంపిక చేసుకున్నాడు. పోట్లగిత్త అంటే నిలకడ, పౌరుషం, అంతులేని సామర్థ్యాలకు సైతం సంకేతం.

సొట్ట తీసేద్దాం

చిట్కా

ఖరీదైన కారు, సూపర్ బైక్.. దేనికైనా సొట్ట పడితే చూడ్డానికి అసహ్యంగా ఉంటుంది. అయితే ఇలాంటి సొట్టల్ని చిన్న చిట్కాతో మెకానిక్ షెడ్డుకు వెళ్లకుండానే తీసేయొచ్చు. ముందు సొట్టపడిన చోట వేడినీటిని పోయాలి. ఇంట్లో సింక్‌లు, డ్రైనేజీలు శుభ్రం చేయడానికి వాడే ప్లంజర్‌తో సొట్టపడిన చోట గట్టిగా అదిమిపట్టి ఒక్కసారిగా బయటికి లాగాలి. ఇలా దాదాపు యాభై నుంచి వందసార్లు చేస్తే సొట్ట మెల్లిమెల్లిగా మాయమవుతుంది. అయితే ఇది చిన్న, మధ్యస్థాయి డెంట్‌లకు మాత్రమే సుమా!



మంటలు.. చెలరేగవిక

జరభద్రం



కారులో మంటలు చెలరేగి కర్నూలులో బ్యాంకు మేనేజరు సజీవదహనం... గురుగ్రామ్‌లో మంటల్లో చిక్కుకున్న కారు.. ముగ్గురు ఆహుతి... ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి...పైగా రాబోతున్నది వేసవికాలం. ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతాయి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? నిపుణుల సలహాలివి.

నిర్లక్ష్యం: మండే స్వభావం ఉన్న వస్తువులు కారులో పెట్టి మర్చిపోవడం.. కారులోని ఏవైనా విడిభాగాలు విరిగితే అలాగే వదిలేయడం.. ఆయిల్‌ఇంధనాలు లీకేజీ అవుతున్నా తేలికగా తీసుకోవడం.. చెడిపోయిన గాస్కెట్‌ని మార్చకపోవడం.. ఇలాంటి నిర్లక్ష్యం వదిలేయాలి. నిర్వహణ లోపాలు ఎప్పటికప్పుడు సవరించుకోవాలి.

ప్రమాదాలు: ముందు, వెనకభాగంలో బ్యాటరీలు, ఆయిల్ ట్యాంక్, ఇతర ఇంధనాలు నిల్వలు ఉంటాయి. కారు దేన్నైనా ఢీకొట్టినపుడు ఆ ఇంధనాలు బయటికి వచ్చే ప్రమాదం ఉంటుంది. ఆ క్షణంలో చిన్న నిప్పురవ్వ వాటిపై పడ్డా క్షణాల్లో మంటలు విస్తరిస్తాయి. ప్రమాదం జరిగినపుడు సాధ్యమైనంత తొందరగా వాహనానికి దూరంగా వెళ్లిపోవాలి.

హైబ్రీడ్, విద్యుత్తు ఇంజిన్లు: డీజిల్, పెట్రోల్‌లాంటి సంప్రదాయ ఇంధనాలతో పోలిస్తే బ్యాటరీలు, హైబ్రీడ్ ఇంజిన్లతో నడిచే కార్లలో మంటలు చెలరేగడానికి ఎక్కువ అవకాశం ఉందంటారు నిపుణులు. నాలుగైదేళ్ల కిందట టెస్లా, చెవ్రోలెట్ విద్యుత్తు కార్లలో తరచూ ప్రమాదాలు జరిగాయి. ఈ సమస్య పరిష్కరించేలా ఎప్పటికప్పుడు పరిశోధనలు జరుగుతున్నాయి.

ఇంజిన్ వేడెక్కడం: ఇంజిన్ అత్యధికంగా వేడెక్కితే ఒక్కోసారి ఆయిల్ ట్యాంకర్, కూలంట్‌లు పేలిపోతాయి. లీకేజీలు ఉన్నపుడు గాస్కెట్, రేడియేటర్లు సరిగా పనిచేయనపుడు సైతం ఈ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా వేసవి కాలంలో అత్యధిక దూరం ప్రయాణం చేస్తుంటే మధ్యమధ్యలో విరామం ఇవ్వాలి.

పైపులు, గొట్టాలు: ఇంధన ట్యాంకు, ఇంజిన్‌ఆయిల్, ట్రాన్స్‌మిషన్ ఫ్లూయిడ్, పవర్‌స్టీరింగ్ ఫ్లూయిడ్, బ్రేక్ ఫ్లూయిడ్, ఇంజిన్ కూలంట్‌లు.. కారు ఆన్ చేయగానే పైపులు, గొట్టాల నిరంతరం ప్రయాణిస్తూ ఉంటాయి. వీటిలో ఒకదానితో ఒకటి కలిసినా ప్రమాదకరం. పైపులు, గొట్టాల్లాంటివి బాగున్నాయో, లేదో పరీక్షిస్తూ ఉండాలి.

విద్యుత్తు లోపాలు: అత్యధికంగా ఫైర్ ప్రమాదాలకు కారణం కారులోని విద్యుత్తు వ్యవస్థ. కారు హెడ్‌లైట్ల నుంచి డోర్లు, మ్యూజిక్ సిస్టమ్, స్పీకర్లు, కార్పెట్, సీట్లు, వెనక లైట్లు, బ్యాటరీని కలిపే తీగెలు.. ఇలా ప్రతి చోటా ఉంటాయి. ఎక్కడ రెండు వైర్లు కలిసినా, షార్ట్‌సర్క్యూట్ అయినా మంటలు చెలరేగవచ్చు. కేబుళ్లు నాణ్యమైనవి వాడాలి. తరచూ చెక్ చేయాలి.

అది ప్రమాదకరం: కొంతమంది కారు, బైక్‌కి ఎక్కువ శబ్దం రావాలనే ఉద్దేశంతో కాటలిస్టిక్ కన్వర్టర్‌ని తీసేసి దాని స్థానంలో ఎక్కువ పొడవుండే పొగగొట్టాన్ని అమర్చుతారు. ఇది ప్రమాదకరం. కాటలిస్టిక్ కన్వర్టర్ ఇంజిన్ నుంచి వెలువడే విషపూరిత కర్బనవ్యర్థాలను వడబోస్తుంది. పైగా బయట కొని అమర్చే విడిభాగాలు తక్కువ నాణ్యతతో ఉంటాయి. ఎగ్జాస్ట్ పైపు సరిగ్గా ఇంధన ట్యాంకు కిందే ఉండటంతో ఏదైనా తేడా వస్తే నిప్పు అంటుకునే ప్రమాదం ఉంది.

చిన్నచిన్న జాగ్రత్తలు: సైలెన్సర్ బాగా వేడిగా ఉన్నప్పుడు త్వరగా మండే స్వభావం ఉన్న వస్తువుల దగ్గర పార్కింగ్ చేయొద్దు. కారులో సిగరెట్ కాల్చడం, పెట్రోల్ స్టేషన్లలో సెల్‌ఫోన్లు వాడటం మానేయాలి. ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌ని శుభ్రం చేసిన గుడ్డల్ని అక్కడే వదిలేయొద్దు.

- హర్షిన్ లాల్‌పేట్

రైతుల ముసుగులో అమ్మకాలు జరిపితే చర్యలు

- అలాంటివారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం

ఈనాడు – న్యూస్‌టుడే



రైతుల ముసుగులో క్రయవిక్రయాలు జరిపే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. నకిలీ రైతుల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి ఘటనలపై జిల్లా కలెక్టర్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను ఇకపై వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోనే ఏర్పాటు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయం నుంచి మార్కెటింగ్ కార్యకలాపాలు, కందులు, సెనగలు, వేరు సెనగ పంటల కొనుగోలు కేంద్రాల అమలు తీరు, ఏర్పాట్లపై హరీశ్‌రావు అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గిన వెంటనే సెనగ, వేరుసెనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారుల ధ్రువీకరణ పొందిన రైతుల వద్ద నుంచి మాత్రమే ప్రభుత్వ కొనుగోళ్లు జరిగేలా చూడాలన్నారు. నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి క్రయవిక్రయాలపై, 25 క్వింటాళ్లకు మించి అదనంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. సమీక్షలో మార్కెటింగ్ కార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ కమిషనర్ డా.జగన్మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రులకు అప్పజెప్పిన కాంగ్రెస్: హరీశ్

ఈనాడు, సంగారెడ్డి: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా కార్పొరేట్ ఆసుపత్రులకు అప్పజెప్పిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామని... దీంతో ప్రజలకు ప్రభుత్వ దవాఖానాలంటే విశ్వాసం పెరిగిందని తెలిపారు. ప్రైవేటుకు వెళ్లేవారు సైతం మళ్లీ చికిత్స చేయించుకోవడానికి ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి గురువారం ఆయన సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభించారు.



కొత్వాల్‌గూడ ప్రజలతో మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి

కొత్వాల్‌గూడ ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం

మాజీ హోంమంత్రి సబితారెడ్డి

శంషాబాద్, న్యూస్‌టుడే: నకిలీ పత్రాలు సృష్టించి ఊరునే విక్రయించాలని చూసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శంషాబాద్ మండల పరిధిలోని కొత్వాల్‌గూడ గ్రామాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు సమస్య వివరించి కన్నీళ్లు పెట్టుకోవడంతో ఆమె వారిని ఓదార్చారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజులుగా కొత్వాల్‌గూడ గ్రామాన్ని అమ్మేస్తారంటూ ప్రసారమాధ్యమాల్లో వస్తున్న వార్తలతో ఇక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇక్కడి భూముల మీద ఈ గ్రామ ప్రజలకే హక్కులున్నాయని ఈ విషయాన్ని కలెక్టర్, తహసీల్దార్ సైతం స్పష్టం చేశారని తెలిపారు. కొత్వాల్‌గూడ ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ప్రజలను అమాయకులను చేసి భూములను అమ్మాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఊరు అమ్ముకుంటామన్న వార్త కలకలం సృష్టిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ భూకుంభకోణంపై ప్రభుత్వం స్పందించి సదరు వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకొని ప్రజలకు భరోసా కల్పించాలన్నారు.

కంపెనీ నన్ను మోసం చేసింది

- బతుకు భారంగా ఉందని వలసజీవి ఆవేదన
- స్నేహితులకు వాయిస్ మెసేజ్ పంపి దువాఖతర్‌లో యువకుడి ఆత్మహత్య



తోట నాగరాజు (పాత చిత్రం)

సారంగాపూర్, జన్నారం, న్యూస్‌టుడే: 'హాయ్ ఫ్రెండ్స్ ఏం చేస్తున్నారు.. అందరూ ఎట్లున్నరు.. కంపెనోళ్ల మూలంగా నేను మోసపోయా.. జీతం డబ్బులు తక్కువ ఇచ్చిండ్రు. మొన్నటి నెలలో అమ్మకు నా జీతం పంపించలే. వచ్చే నెల పంపిస్తానని చెప్పా. జీతం పోయిన నెలకంటే ఈ నెల తక్కువగా వచ్చింది. అవి కూడా చేతికి ఇవ్వలేదు.. ఏం చేయాలో అర్థం కావడం లేదు. అందుకే చనిపోవాలనుకుంటున్నా. అందరూ మంచిగా ఉండండి. ఇది నా ఆఖరు మెసేజ్, మళ్లీ జన్మంటూ ఉంటే మిమ్మల్ని కలుస్తా. రాజు, మహేశ్, రాజేశ్, విజ్జీ బై బై నా గురించి ఏమనుకోకండి. ఇక ఉంటా' అంటూ స్నేహితులకు ఓ యువకుడు పంపిన వాయిస్ మెసేజ్ పలువురిని కలిచివేసింది... బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లికి చెందిన తోట శంకరయ్య, కళావతికి ఇద్దరు కుమారులు. ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో కొన్నేళ్ల కిందట ఆ కుటుంబం జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లకు వలస వెళ్లింది. ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండటంతో అప్పు చేసి నాగరాజు(24)ను ఐదేళ్ల కిందట దువాఖతర్ దేశానికి పంపించారు. ఆయన అక్కడ వాహనాలను శుభ్రం చేసే కంపెనీలో పనికి కుదిరాడు. కొంత కాలంగా వేతనం తక్కువగా ఇవ్వడమే కాకుండా అందులో మరింత కోత విధించారు. ఈ క్రమంలో రెండు నెలలుగా ఆయన ఇంటికి వేతనం పంపించలేదు. దీంతో మనోవేదనకు గురైన నాగరాజు బుధవారం రాత్రి స్నేహితులకు వాట్సప్ వాయిస్ మెసేజ్ పంపి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

నెల రోజుల్లో వచ్చి పెళ్లి చేసుకుంటా..: నాగరాజు నెల రోజుల్లో ఇంటికి వచ్చి పెంబట్లలో ఇల్లు నిర్మించుకొని, పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఓ అమ్మాయిని వివాహానికి నిశ్చయించారు. ఈ క్రమంలోనే అతను ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. స్థానిక నాయకులు, అధికారులు స్పందించి మృతదేహాన్ని వెంటనే గ్రామానికి రప్పించేలా చర్యలు తీసుకొని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సచివాలయం తరలింపును వ్యతిరేకించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారూ చేరుకునేందుకు అనువుగా ఉన్న సచివాలయాన్ని మరో చోటుకు తరలించే ఆలోచనను తెలంగాణ సమాజమంతా వ్యతిరేకిస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బైసన్ పోలో మైదానాన్నీ కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఐకాస హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో సచివాలయం తరలింపును నిరసిస్తూ.. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకుందాం.. బైసన్‌పోలో మైదానాన్ని రక్షించుకుందాం.. అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐకాస నగర అధ్యక్షులు సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐకాస ఛైర్మన్ కోదండరాం మాట్లాడుతూ.. సచివాలయాన్ని తరలించి ఆ స్థలాన్ని బహుళజాతి సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందన్నారు. నగరంలో హౌసింగ్‌బోర్డుకు చెందిన 150 ఎకరాల స్థలం ఉందని, అక్కడ పేద, మధ్య తరగతి వారికి.. అందులోనే భాగంగా ఉన్న పాత్రికేయులకు ఇళ్లు కట్టించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్ని కాపాడుకునే అంశాలపై అన్ని పార్టీలు కలిసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు మాట్లాడుతూ సచివాలయం ఉన్నచోటే ఉండాలి, కొత్తది అవసరంలేదని ఉద్ఘాటించారు. న్యూడెమోక్రసీ నేత గోవర్దన్ మాట్లాడుతూ.. కేసీఆర్ హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న భూముల్ని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేశారని.. అందులో భాగమే సచివాలయం తరలింపు అని ఆరోపించారు. సమావేశంలో ప్రజా తెలంగాణ కన్వీనర్ గాదె ఇన్నయ్య, భాజపా నాయకులు ఎ.రామకృష్ణ, తెదేపా నేత వనం రమేష్, న్యూడెమోక్రసీ నేత ఝాన్సీ, సీపీఐ నేత గెలవయ్య, ఆర్‌ఎస్‌పీ నేత జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ పరిధిలోకి 'మైనింగ్' కళాశాల!

- నిధులిస్తే అభ్యంతరం లేదన్న వర్సిటీ
- ముఖ్యమంత్రి పరిశీలనలో ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలను కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి జేఎన్‌టీయూహెచ్ పరిధిలోకి తీసుకురానున్నారు. సాంకేతిక విద్య కోసమే ప్రత్యేకంగా స్థాపించిన జేఎన్‌టీయూ పర్యవేక్షణలోకి మైనింగ్ కళాశాలను తెస్తే డిగ్రీకి ప్రాధాన్యం పెరిగి తమకు లాభిస్తుందని విద్యార్థులు కోరుతున్నారు. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపించామని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య చెప్పినట్లు సమాచారం. 1978లో ప్రారంభమైన కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో మైనింగ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఈసీఈ, ఐటీ బ్రాంచీలున్నాయి. 62 మంది ఆచార్యులు అవసరం కాగా 20 మందే పనిచేస్తున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఈ కళాశాలపై నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలున్నాయి. కళాశాలను జేఎన్‌టీయూహెచ్ పరిధిలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో జేఎన్‌టీయూహెచ్ ఓ కమిటీని నియమించి కళాశాలలో మౌలిక వసతులను పరిశీలించింది. కళాశాల అభివృద్ధికి రూ.300 కోట్లు అవసరమని, ప్రభుత్వం ఆర్థికంగా సహకరిస్తే ఆ కళాశాలను తీసుకుంటామని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్యకు నివేదిక అందజేసింది. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి కూడా ఆమోదించే అవకాశాలున్నాయి.

కాంగ్రెస్ దిక్కుమాలిన పార్టీ

వచ్చే ఎన్నికల్లో ఏడు సీట్లు కూడా రావు: మంత్రి తలసాని

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ దిక్కుమాలిన పార్టీ అని, ఆ పార్టీ నేతలకు అధికారంలోకి రావాలనే ఆరాటం తప్ప ప్రజల గురించి, రాష్ట్రం బాగు గురించి ఏ మాత్రం పట్టింపు లేదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధ్వజమెత్తారు. గత నాలుగేళ్లుగా తెలంగాణలో ఏ పథకాన్ని, కార్యక్రమాన్ని అడ్డుకుందామా? అనే ప్రయత్నించారు తప్ప సాధించిందేమీ లేదని అన్నారు. ఆ పార్టీ నేతలు ఎన్ని వేషాలేసినా వచ్చే ఎన్నికల్లో ఏడు సీట్లు కూడా రావని అన్నారు. గురువారం ఎమ్మెల్యేల నివాస సముదాయంలో విలేకరులతో మాట్లాడారు. '2014 ఎన్నికల్లో కేసీఆర్ గెలిచి అధికారంలోకి రావడం తెలంగాణ ప్రజల అదృష్టం, అదే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనమయ్యేది. గాంధీభవన్‌లో మాట్లాడటం తప్ప.. ప్రతిపక్షంగా కూడా ఆ పార్టీ పనికిరాదని తేలిపోయింది. ఇప్పటికీ పదిమంది తాము సీఎం అవుతామని కలలు కంటున్నారు. నేల వైపు చూడటమే లేదు. కేటీఆర్ ఆ పార్టీపై చేసిన వ్యాఖ్యలు నూటికి నూరుశాతం నిజం. కాంగ్రెస్‌కు తెలంగాణలో ఉండే అర్హత ఏ మాత్రం లేదు. కాంగ్రెస్ ఓటమి భయంతోనే కొడంగల్ ఉప ఎన్నికల మాటెత్తడం లేదు..' అని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీలందరికీ బోధన రుసుములు

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించిన బోధన ఫీజులు, ఉపకారవేతనాలను మార్చిలోగా చెల్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. కోర్సు చివరి ఏడాది విద్యార్థులకే చెల్లించాలని తొలుత నిర్ణయించినా.. తాజాగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులందరికీ ఇవ్వనుంది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధినిధి నుంచి అవసరమైన నిధులు వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆయా సంక్షేమశాఖలు ప్రభుత్వాన్ని కోరాయి. ఈ నిధి నుంచి రూ.300 కోట్ల వరకు ఖర్చుచేయాలని భావిస్తోంది. ఈ నిధులు అందుబాటులోకి వస్తే 2017-18 విద్యాసంవత్సరానికి ఇప్పటి వరకు అనుమతించిన దరఖాస్తుల బకాయిలన్నీ చెల్లించవచ్చని ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖలు భావిస్తున్నాయి.

- ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బోధన ఫీజులకింద రూ.2,500కోట్లు విడుదలచేసింది. ఇందులో 2015-16 సంవత్సరానికి సంబంధించిన బకాయిలకింద రూ.563కోట్లుచెల్లించింది.
- 2016-17 విద్యాసంవత్సరానికి బోధన ఫీజులు, ఉపకారవేతనాల కింద రూ.1,870కోట్లు చెల్లించారు. మిగతారూ.43కోట్ల నిధులు మార్చిలోగా మంజూరవుతాయని అంచనా వేస్తున్నారు.
- తొలిసారిగా 2017-18 విద్యాసంవత్సరానికి బోధన ఫీజుల విడుదల ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, వికలాంగ విద్యార్థులందరికీకలిపి దాదాపు రూ.67కోట్లు చెల్లించారు.

ఇదీ పరిస్థితి...

2016-17 విద్యాసంవత్సరం

వచ్చిన దరఖాస్తులు	- 13.64 లక్షలు
అనుమతించినవి	- 12.34 లక్షలు
చెల్లించాల్సిన సొమ్ము (డిమాండ్)	- రూ.2,306 కోట్లు
ఇప్పటి వరకు చెల్లించినది	- రూ.1,866 కోట్లు

2017-18 విద్యాసంవత్సరం

వచ్చిన దరఖాస్తులు	- 13.20 లక్షలు
అనుమతించినవి (ఇప్పటికి)	- 6,43,982
చెల్లించాల్సింది	- రూ. 1,048 కోట్లు
ఇప్పటివరకు చెల్లించింది	- రూ.67 కోట్లు

ప్రధాని మాటలు చిన్నపిల్లల్ని తలపిస్తోంది: భట్టి

ఈనాడు, ఖమ్మం: తలుపులు మూసి తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని ప్రధాని మోదీ పార్లమెంట్‌లో చెప్పడం చిన్నపిల్లల మాటలను తలపిస్తోందని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టివిక్రమార్క గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ తలుపులు మూసి తెలంగాణ ఇచ్చిన సమయంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న భాజపా ఎలా సమర్థించిందని ప్రశ్నించారు. తమవల్లే బిల్లు వచ్చిందని అనేక సందర్భాల్లో వెంకయ్యనాయుడు, సుష్మాస్వరాజ్ అన్న విషయాలను గుర్తు చేశారు. ప్రసంగాలతో రాజకీయం చేయడం, మాటలతో మోసం చేసే మోదీ ప్రధాని కావడం దేశ ప్రజల దురదృష్టమన్నారు. మాజీ సీఎం టి.అంజయ్య కులం, గత సంఘటన గురించి అవగాహన లేకుండా మోదీ మాట్లాడారని ఆరోపించారు.

సోనియా కాళ్లు మొక్కినప్పుడు గుర్తులేదా?

- అప్పుడు కాంగ్రెస్ దౌర్భాగ్యపు పార్టీగా కనిపించలేదా?
- మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ కాంగ్రెస్ నేతల ధ్వజం
- కాంగ్రెస్, రాహుల్‌పై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సందర్భంగా మీ కుటుంబమంతా వెళ్లి సోనియాగాంధీ కాళ్లు మొక్కినప్పుడు కాంగ్రెస్ దౌర్భాగ్యపు పార్టీగా కనిపించలేదా? అని పలువురు కాంగ్రెస్ నేతలు మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. మీ నాయన(కేసీఆర్) రాజకీయ ఓనమాలు కాంగ్రెస్‌లోనే నేర్చుకున్నారని.. ఆయన కూడా దౌర్భాగ్యుడేనా? అని నిలదీశారు. కాంగ్రెస్, రాహుల్‌పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కేటీఆర్ చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు సీఎల్పీ ఉప నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోమటిరెడ్డి, రేవంత్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, దాసోజు శ్రవణ్, అంజన్‌కుమార్, జనార్దన్‌రెడ్డి మాట్లాడారు.

అధికార అహంకారానికి నిదర్శనం... కోమటిరెడ్డి: తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను గౌరవించాల్సిందిపోయి నోటికొచ్చినట్లు మాట్లాడటం కేటీఆర్ అధికార అహంకారానికి నిదర్శనమని కోమటిరెడ్డి అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 సీట్లకుపైగా వస్తాయని, రాకుంటే ఉత్తమ్ సహా నేనూ రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. కేటీఆర్ నా ఆఫీసుకు వచ్చి తెరాసలో చేరితే మంత్రి పదవి ఇస్తానని చెప్పింది నిజమని.. అందుకు సంబంధించిన సీసీ ఫుటేజీని బయట పెట్టాలా? అని ప్రశ్నించారు.

ప్రధాని మోదీ ఆడించినట్లు ఆడుతున్నారు: రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..సహారా ఇండియా, ఈఎస్ఐ ఆసుపత్రుల కుంభకోణంలో కేసీఆర్ జైలుకు వెళ్లే పరిస్థితి ఉన్నందునే ప్రధాని మోదీ ఆడించినట్లు ఆడుతున్నారన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై తెరాస ఎంపీలు మౌనంగా ఉండటానికి కారణం ఇదేనన్నారు. మిషన్ భగీరథలో వేలకోట్ల కుంభకోణం జరిగిందని. . ఎప్పటికైనా కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు..కేసీఆర్ నడవడికి, ఆయన పెంపకానికి నిదర్శనమని శశిధర్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, అంజన్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, శ్రవణ్‌లు విమర్శించారు. పార్లమెంటులో కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీభవన్ ముందు మోదీ దిష్టి బొమ్మ దహనం చేశారు.



ద్విచక్రవాహన ర్యాలీలో షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యే గంగారాం

వంద సీట్లు రాకుంటే రాజకీయ సన్యాసమే: షబ్బీర్‌అలీ

నిజాంసాగర్, న్యూస్‌టుడే: 'రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం.. వంద సీట్లు రాకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటా..' అని మండలి విపక్ష నేత షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభించి, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం తనయుడు కేటీఆర్ కాంగ్రెస్‌ను అసభ్య పదజాలంతో దూషించడం సరికాదన్నారు. కేసీఆర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగానే రాజకీయాల్లోకి వచ్చారని గుర్తుచేశారు. కేటీఆర్ మాట్లాడే ముందు ఆలోచించాలని, తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం తెరాసకు వందసీట్లు రాకుంటే రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌శెట్కార్, మాజీ ఎమ్మెల్యే అరుణతార, ఎల్లారెడ్డి ఇన్‌ఛార్జి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉద్యోగ అవకాశాలు

ఈనాడు బిజినెస్

ఆర్థిక ఫలితాలు..

భెల్ మధ్యంతర డివిడెండు 40%

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన భెల్ నికర లాభం 64 శాతం పెరిగి రూ.153.19 కోట్లకు చేరింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో నికర లాభం రూ.93.54 కోట్లుగా నమోదైంది. సమీక్ష త్రైమాసికంలో టర్నోవరు రూ.6,187.48 కోట్ల నుంచి రూ.6,494.44 కోట్లకు పెరిగింది. ఏప్రిల్- డిసెంబరు వరకు నికర లాభం రూ.280.31 కోట్లు, టర్నోవరు రూ. 18,017.62 కోట్లుగా నమోదయ్యాయి. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై 80 పైసలు (40%) డివిడెండు చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు అనుమతిని ఇచ్చింది.

ఆర్‌క్యాప్ లాభంలో 50% వృద్ధి

దిల్లీ: డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్) నికర లాభం 50 శాతం వృద్ధి చెంది రూ.315 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో కంపెనీ లాభం రూ.209 కోట్లుగా ఉంది. ఇక మొత్తం ఆదాయం 20 శాతం హెచ్చి రూ.3,964 కోట్ల నుంచి రూ.4,771 కోట్లకు చేరుకుందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో అన్ని వ్యాపార విభాగాల్లో లాభదాయకత బాగా మెరుగైందని కంపెనీ వివరించింది. డిసెంబరు 31, 2017 నాటికి కంపెనీ మొత్తం ఆస్తులు 18% పెరిగి రూ.92,109 కోట్లకు చేరాయి.

రాణించిన భారత్ ఫోర్జ్

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో భారత్ ఫోర్జ్ నికర లాభం 77.39% పెరిగి రూ.228.17 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాదిక్రితం ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.128.62 కోట్లుగా నమోదైంది. కార్యకలాపాల ఆదాయం కూడా రూ.990.01 కోట్ల నుంచి రూ.1,390.55 కోట్లకు పెరిగింది. జులై 1 నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఏడాదిక్రితం త్రైమాసిక ఫలితాలతో తాజా ఫలితాలను పోల్చిచూడొద్దని కంపెనీ తెలిపింది.

ఏసీసీ ఫలితాలు ఆకర్షణీయం

దిల్లీ: డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికానికి ఏసీసీ ఏకీకృత ప్రాతిపదికన రూ.205.69 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2016 అక్టోబరు- డిసెంబరులో వచ్చిన రూ.90.92 కోట్లతో పోలిస్తే నికర లాభం రెట్టింపు అయ్యింది. మొత్తం ఆదాయం రూ.3,540.24 కోట్లకు పెరిగింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో ఏకీకృత ఆదాయం రూ.3,102.42 కోట్లుగా నమోదైంది.

ఎన్‌సీఆర్ నుంచి రెండు కొత్త ఏటీఎంలు

ఈనాడు, హైదరాబాద్: ఏటీఎం సేవలు అందుబాటులో లేని ప్రాంతాలపై దృష్టి సారిస్తున్న బ్యాంకులకు ఉపయోగపడేలా ఎన్‌సీఆర్ కార్పొరేషన్ రెండు కొత్త తరహా ఏటీఎంలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో ఒకటి నగదును అందించేది, రెండోది నగదును డిపాజిట్ చేసుకోవడంతోపాటు, తీసుకునేందుకూ వెసులుబాటు కల్పిస్తుంది. కార్డుతోపాటు, బయోమెట్రిక్‌ను ఉపయోగించి వీటిని వాడేందుకు అవకాశం ఉందని ఎన్‌సీఆర్ తెలిపింది. కొత్త ఏటీఎంల విడుదల సందర్భంగా ఎన్‌సీఆర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఉపాధ్యక్షుడు జోస్ రెసెండిజ్ మాట్లాడుతూ.. ఈ కొత్త యంత్రాలు బ్యాంకులకు తమ ఏటీఎం నెట్‌వర్క్‌ను ఆధునికీకరణ చేసేందుకు, ఎక్కువగా నగదు ఆధారిత లావాదేవీలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ఇబ్బంది కాకుండా చూసుకునేందుకు తోడ్పడతాయన్నారు.

క్రిప్టో కుబేరులొచ్చారు

- తొలిసారిగా ప్రచురించిన ఫోర్బ్స్
- క్రిస్ లార్సెన్‌కు అగ్రస్థానం

న్యూయార్క్: ఫోర్బ్స్ తొలిసారిగా క్రిప్టోకరెన్సీ కుబేరుల జాబితాను విడుదల చేసింది. అంటే కేవలం క్రిప్టోకరెన్సీ(ఊహాజనిత కరెన్సీ) ఆధారంగా అత్యంత ధనవంతులైన వారికి ఇందులో చోటు ఉంటుందన్నమాట. జాబితాలో 7.5-8 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.48750-52,000 కోట్లు)తో రిపుల్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ లార్సెన్ అగ్రస్థానంలో నిలిచారు. బ్లాక్‌చైన్ సాంకేతిక ఆధారంగా సీక్రెట్ ఆల్గారిథమ్స్‌ను ఉపయోగించి 'తవ్వితీసేవే' ఈ క్రిప్టోకరెన్సీలు. వీటిపై ఎవరికీ నియంత్రణ ఉండదు. ఇటీవలి కాలంలో భారీ లాభాలతో ఇవి ప్రపంచం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. ఫోర్బ్స్ ప్రకారం..

- ✦ చాలా ఎక్కువగా ఉపయోగించే బిట్‌కాయిన్, ఈథెరీమ్, ఎక్స్‌ఆర్‌పీల సగటు ధర గతేడాదిలో ఏకంగా 14,409 శాతం పెరిగింది.
- ✦ ప్రస్తుతం 1500 క్రిప్టోకరెన్సీలు ఉండగా.. వాటి విలువ 550 బిలియన్ డాలర్లు(రూ.35.75 లక్షల కోట్లు)గా ఉంది. 2017 ప్రారంభంతో పోలిస్తే ఈ విలువ 31 రెట్లు ఎక్కువ కావడం గమనార్హం.
- ✦ జోసెప్ లుబిన్(1-5 బి. డాలర్లు), చాంగెపెంగ్ జో(1.1-2 బిలియన్ డాలర్లు), కామరాన్ అండ టైలర్ వింక్‌లీవాస్(900 మి. డాలర్లు-1.1 బి. డాలర్లు)లు జాబితాలో చోటు దక్కించుకున్నారు.
- ✦ ఇంకా బ్రియాన్ ఆమ్‌స్ట్రాంగ్, మాథ్యూ రోజక్, ఆంటోనీ డి లారియో, బ్రోక్ పియర్స్, మైఖేల్ నోవోగ్రాజ్, బ్రెండన్ బ్లమర్, డాన్ లారిమర్, వాలరీ వావిలోవ్, ఛార్లెస్ హాస్కిన్సన్, బ్రాడ్ గార్లింగ్‌హౌస్, బారీ సిల్బర్ట్, విటాలిక్ బ్యూటరిన్, టిమ్ డ్రాపర్, సాంగ్ చి-హ్యూంగ్ తదితరులూ ఉన్నారు.
- ✦ క్రిప్టోకరెన్సీ కుబేరుల సగటు వయసు 42 కావడం గమనార్హం. అదే ఫోర్బ్స్ 400 అమెరికా కుబేరుల సగటు వయసు 67గా ఉంది.

భారత్‌లో క్రిప్టోకరెన్సీ చట్టబద్ధం కాదని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



రిపుల్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ లార్సెన్

గూగుల్‌కు సీసీఐ రూ.136 కోట్ల జరిమానా

దిల్లీ: ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌కు భారత్ భారీ జరిమానా విధించింది. ఆన్‌లైన్ శోధనకు సంబంధించి అన్యాయపూరితంగా వ్యవహరించినందుకు, గూగుల్‌కు రూ.136 కోట్ల జరిమానా విధిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2012లో దాఖలైన ఫిర్యాదులకు సంబంధించి ఈ ఆదేశాలిచ్చింది. అన్యాయపూరిత వ్యాపార లావాదేవీలకు సంబంధించి అంతర్జాతీయంగా గూగుల్‌కు ఇలాంటి జరిమానాలు విధించడం అత్యంత అరుదు. ఆన్‌లైన్ శోధనలో తనకు ఉన్న అగ్రస్థానాన్ని గూగుల్ దుర్వినియోగం చేసిందని, సంస్థ అవలంబించిన విధానాలతో కొందరికి ప్రయోజనాలు దక్కగా, పోటీ సంస్థలు, మరికొన్ని కంపెనీలకు నష్టం వాటిల్లిందనే ఫిర్యాదులు దాఖలయ్యాయి. దీనిపై గూగుల్ ఇచ్చిన వివరణలను కూడా క్షుణ్నంగా పరిశీలించామని, తదుపరి జరిమానా విధించాలని నిర్ణయించినట్లు సీసీఐ తెలిపింది. 2013, 2014, 2015 ఆర్థిక సంవత్సరాలలో గూగుల్‌కు చెందిన వేర్వేరు వ్యాపార విభాగాల ద్వారా దేశీయంగా లభించిన సగటు ఆదాయంలో, 5 శాతానికి సమానమైన రూ.135.86 కోట్లను జరిమానాగా సీసీఐ విధించింది. మాట్రిమోని డాట్ కామ్, కన్జ్యూమర్ యూనిటీ అండ్ ట్రస్ట్ సొసైటీ (కట్స్) సంస్థలు 2012లో గూగుల్‌పై చేసిన ఫిర్యాదులకు సంబంధించి, ఈ జరిమానాను సీసీఐ విధించింది. కాంపిటీషన్ చట్టంలోని నాలుగో సెక్షన్‌ను గూగుల్ అతిక్రమించలేదని భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కాగా సీసీఐ నిర్ణయాన్ని పూర్తిగా అధ్యయనం చేశాక, స్పందిస్తామని గూగుల్ ప్రతినిధి పేర్కొన్నారు.

బడ్జెట్‌లో అత్యంత నిరుత్సాహకర నిర్ణయమది

ద్రవ్య స్థిరీకరణపై దువ్వూరి

సింగపూర్: ద్రవ్యలోటు లక్ష్యాన్ని సడలించడం ద్వారా బడ్జెట్‌లో అత్యంత నిరుత్సాహకర నిర్ణయాన్ని తీసుకున్నారని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విమర్శించారు. అలా చేయడం వల్ల ప్రభుత్వానికి వ్యయాలు చేయడానికి ఎక్కువ అవకాశం లభిస్తుందా లేదా అన్నదీ ప్రశ్నార్థకమేనని ఆయన అభిప్రాయపడ్డారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'యూపీఏ ప్రభుత్వమైనా.. ఎన్‌డీఏ ప్రభుత్వమైనా ద్రవ్య స్థిరీకరణ విషయంలో ఆర్థిక మంత్రులు ఎపుడూ ఒకేలా ఆలోచిస్తుంటారు. అదేమని అంటే.. ఈ సారి మాత్రం పరిస్థితులు వేరని అంటూనే ఉంటారు. అలాగే ప్రతీ సారీ లక్ష్యాన్ని సడలించినపుడు.. ఇకపైన క్రమశిక్షణగా ఉంటామని అంటారు. కానీ ప్రతీసారీ స్థూల ఆర్థిక వ్యయాలు భారీగానే చేస్తూ ఉంటార'ని పేర్కొన్నారు. 'ద్రవ్యలోటు పరిమాణం కంటే ఇంకా ఆందోళన కలిగించే అంశం ఏమంటే.. పెరుగుతున్న రెవెన్యూ లోటుపై ఏ మాత్రం క్రమశిక్షణ లేకపోవడమ'ని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపాదిత జాతీయ బీమా పథకంపై మాట్లాడుతూ 'ఆ పథకాన్ని ఎలా రూపకల్పన చేస్తారు. ఎలా అమలు చేస్తారన్న దానిపై సంక్షేమ ఫలాలు ఆధారపడి ఉంటాయ'ని అన్నారు. ఇక 50 వస్తువులపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడంపై నిరుత్సాహం వ్యక్తం చేశారు.

మేధోహక్కుల సూచీలో భారత్‌కు 44వ స్థానం

వాషింగ్టన్: అంతర్జాతీయ మేధో హక్కుల (ఐపీ) సూచీలో భారత్ స్థానం గణనీయంగా మెరుగుపడింది. యూఎస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ 50 దేశాలతో రూపొందించిన జాబితాలో భారత్ 44వ స్థానంలో నిలిచింది. గతేడాది 45 దేశాల జాబితాలో 43వ స్థానాన్ని పొందిన సంగతి విదితమే. భారత్ మరికొన్ని, అర్థవంతమైన సంస్కరణలు చేపడితే ప్రయోజనం ఉంటుందని యూఎస్ చాంబర్స్ పేర్కొంది. '5వ సూచీలో భారత్ 25 శాతం (35లో 8.75) మార్కులు సాధించగా, 6వ సూచీలో గణనీయంగా మెరుగుపడి 30 శాతం (40కి 12.03) సాధించింది' అని యూఎస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్‌కు చెందిన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) తెలిపింది. కొత్త సూచికల్లో సమర్థంగా వ్యవహరించడంతో పాటు కంప్యూటర్‌తో నిర్వహించే ఆవిష్కరణల్లో పేటెంట్లు సాధించేలా సానుకూల సంస్కరణలు రూపొందించడం, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను అందరికీ తెలిసేలా చేయడం వల్ల భారత్ స్థానం మెరుగుపడిందని నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో 37.98 పాయింట్లతో అమెరికా అగ్రస్థానంలో నిలవగా, తరవాత స్థానాల్లో యునైటెడ్ కింగ్‌డమ్ (37.97 పాయింట్లు), స్వీడన్ (37.03 పాయింట్లు) నిలిచాయి.

పాత గృహ రుణాలు చౌకే ఇక!

- 2016 ఏప్రిల్‌కు ముందు..
- ఆర్‌బీఐ నిర్ణయం నేపథ్యం

దిల్లీ: మీరు ఏప్రిల్ 1, 2016 కంటే ముందు గృహ రుణాలు తీసుకున్నారా?. అయితే మీపై నెలవారీ వాయిదాల(ఈఎమ్ఐ) భారం తగ్గే అవకాశం కనిపిస్తోంది. గతంలో తీసుకున్న గృహ రుణాలు చౌకయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఎమ్‌సీఎల్‌ఆర్‌తో ప్రామాణిక రేటు(బేస్ రేటు)ను అనుసంధానం చేయాలని ఆర్‌బీఐ నిర్ణయించడం ఇందుకు కారణం. నిధులపై వ్యయాలకు అనుగుణంగా నిర్ణయించే రుణాల రేటు (ఎమ్‌సీఎల్‌ఆర్) వ్యవస్థను ఏప్రిల్ 1, 2016న ఆర్‌బీఐ అమల్లోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1, 2016కు ముందు తీసుకున్న గృహ రుణాలు ప్రామాణిక రేటు ఆధారంగా తీసుకున్నవి. ఇవన్నీ ఆయా బ్యాంకులు నిర్ణయించుకున్న రేట్లు కావడంతో తాజా నిర్ణయంతో ఆ రేట్లు తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎమ్‌సీఎల్‌ఆర్ అమలు వల్ల ప్రస్తుత ప్రామాణిక రేటుతో అనుసంధానమై ఉన్న రుణాలు సైతం ఎమ్‌సీఎల్‌ఆర్ వ్యవస్థలోకి వస్తాయని ఆర్‌బీఐ భావించింది. కానీ బ్యాంకు రుణాల్లో ఎక్కువ భాగం ప్రామాణిక రుణ రేటుతోనే అనుసంధానమై ఉండడాన్ని ఆర్‌బీఐ గమనించింది. అంతక్రితం పరపతి విధాన ప్రకటనల్లోనూ ఆర్‌బీఐ ఈ విషయమై ఆందోళన వ్యక్తం చేసినా బ్యాంకులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ తన పరపతి విధాన సమీక్షలో ఎమ్‌సీఎల్‌ఆర్‌తో బేస్‌రేటును అనుసంధానం చేయాలని నిర్ణయించింది.

చాలా ఖాతాలన్నీ ఆ విధానం కిందే..

ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ఖాతాలు బేస్ రేటు వ్యవస్థలోనే ఉన్నాయి. ఆర్‌బీఐ కీలక రేట్లు తగ్గించినా.. వినియోగదార్లకు బదిలీ జరగడం లేదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్.ఎస్. విశ్వనాథన్ పేర్కొన్నారు. బీపీఎల్‌ఆర్, బేస్ రేటు వ్యవస్థలో బ్యాంకులు తమ సొంత పద్ధతుల ద్వారా కనీస రుణ రేటును నిర్ణయించుకుంటాయి. ఎమ్‌సీఎల్‌ఆర్ కింద నిధులపై చేసే వ్యయాలకు అనుగుణంగా రేటును నిర్ణయించాల్సి ఉంటుంది. అయితే బ్యాంకులు మాత్రం తమ ఇష్టారీతిన బేస్ రేటునే పాటించడంతో వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నాయని ఆర్‌బీఐ పలు సందర్భాల్లో ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంకులు పరపతి(కీలక రేట్ల తగ్గింపును) బదిలీ చేయడం లేదని అసహనం వ్యక్తం చేసింది.



ఎంఫ్లక్స్ వన్



హ్యుందాయ్ ఎలైట్ ఐ20తో షారుక్



కవాసకీ వాల్కన్ ఎస్

ఎంఫ్లక్స్ ఇ-బైక్ ప్రోటోటైప్

ఎలక్ట్రిక్ స్పోర్ట్ బైకు ఎంఫ్లక్స్ వన్‌ను అంకుర సంస్థ ఎంఫ్లక్స్ మోటార్స్ ప్రదర్శించింది. 2019 ఏప్రిల్‌లో ఇది విపణిలోకి రానుంది. 9.7కి.వా లిథియం-ఐయాన్ బ్యాటరీతో పనిచేసే ఈ బైకు గరిష్ఠ వేగం గంటకు 200 కి.మీ.

సుజుకీ.. లగ్జరీ స్కూటర్

125సీసీ లగ్జరీ స్కూటర్ బర్గ్‌మన్ స్ట్రీట్, కొత్త బైకు జీఎస్ఎక్స్-ఎస్ 750 మోడళ్లను సుజుకీ వాహన ప్రదర్శనలో విడుదల చేసింది. 2019-20 నాటికి 10 లక్షల వాహనాలను విక్రయించడమే లక్ష్యమని వెల్లడించింది. 2017-18లో కంపెనీ అమ్మకాల్లో 20 శాతం వృద్ధి నమోదు చేసింది.

గ్రేటర్ నోయిడాలో తొలి రోజే మెరుపులు మెరిపించిన వాహన ప్రదర్శన.. రెండో రోజు మరింత మైమరపించింది. గురువారం నాటి ప్రదర్శనలో మారుతీ సుజుకీ వంటి దిగ్గజ సంస్థలతో పాటు అంకురాలు, విద్యుత్ వాహన సంస్థలు కొత్త కార్లు, బైకులతో సందడి చేశాయి. దాదాపు 12 అంకుర సంస్థలు వాహన ప్రదర్శనలో పాల్గొని తమ వినూత్న ఉత్పత్తులను ప్రదర్శించాయి. కొన్ని సంస్థలు పర్యావరణహిత వాహనాలతో ఆకట్టుకున్నాయి. వాయువేగంతో దూసుకెళ్లే స్పోర్ట్స్ కారులు, బైకులు రెండో రోజు ప్రదర్శనలో ప్రత్యేకత సంతరించుకున్నాయి. పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుండటంతో పర్యావరణ అనుకూల వాహనాలకే పెద్ద పీట వేస్తున్నామని కంపెనీలు పేర్కొన్నాయి. కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి అనంత్ గీతే వాహన ప్రదర్శనను తిలకించారు. రెండు నెలల్లోగా వాహన విధాన ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో మురిపించిన వాహనాల్లో కొన్ని..

22 మోటార్స్.. ఎలక్ట్రిక్ స్కూటర్ ఫ్లో

స్మార్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఫ్లో'ను విద్యుత్ ద్విచక్ర వాహన సంస్థ ట్వంటీ టూ మోటార్స్ వాహన ప్రదర్శనలో విడుదల చేసింది. దీని ధర రూ.74,740. వచ్చే మూడేళ్లలో 2 లక్షల వాహనాలను విక్రయించడమే లక్ష్యమని ఈ అంకుర సంస్థ చెబుతోంది. కృత్రిమ మేధ అనుసంధానం కలిగిన ఈ స్కూటర్‌ను రిమోట్‌తో గుర్తించే సదుపాయం ఉంది. అయిదు గంటలు పూర్తిగా ఛార్జింగ్ చేసే 80 కి.మీ మైలేజీని ఫ్లో ఇస్తుంది. దీని గరిష్ఠ వేగం గంటకు 60 కి.మీ.



మారుతీ.. 2018 స్విఫ్ట్

ధగధగలు

రెండో రోజూ కొత్త వాహనాల కళకళ



డీసీ టీసీఏతో సోనాక్షి సిన్హా



టీవీఎస్ అపాచీ ఆర్‌ఆర్ 310

మారుతీ.. కొత్త స్విఫ్ట్

మారుతీ సుజుకీ ప్రజాదరణ పొందిన హ్యాచ్‌బ్యాక్ మోడల్ స్విఫ్ట్‌లో కొత్త వెర్షన్‌ను వాహన ప్రదర్శనలో విడుదల చేసింది. దీని ధర రూ.4.99- 8.29 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. ఇప్పటికే ఈ కారు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. 1.2 పెట్రోల్ ఇంజిన్ వేరియంట్, 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్ వేరియంట్లలో ఇది లభించనుంది. డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్, ఈబీడీ వంటి అధునాతన భద్రతా సదుపాయాలు ఇందులో ఉన్నాయి.

లోహియా.. విద్యుత్ ఆటో

లోహియా గ్రూప్‌నకు చెందిన లోహియా ఆటో.. బ్యాటరీతో నడిచే త్రిచక్రవాహనం 'కంఫర్ట్ ఇ ఆటో'ను విడుదల చేసింది. దీని ధర రూ.1.49 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ). సెంట్రల్ లాకింగ్, జీపీఎస్ దీని ప్రత్యేకతలు. ఈ ఆటో గరిష్ఠ వేగం గంటకు 30 కి.మీ. ఒక్కసారి ఛార్జింగ్‌తో 80 కి.మీ మైలేజీని అందిస్తుంది. సరకు వాహనం హమ్‌సఫర్ 2000 (ధర రూ.1.95 లక్షలు), ప్రయాణికుల ఆటో హమ్‌సఫర్ డీఎల్ఎక్స్ (ధర రూ.1.90 లక్షలు) ఇందులో ఉన్నాయి.

క్లీవ్‌లాండ్ సైకిల్‌వెర్క్స్.. హుషారు

అమెరికా బైకు తయారీ సంస్థ క్లీవ్‌లాండ్ సైకిల్‌వెర్క్స్ రెండు కొత్త మోడళ్లలో భారత విపణిలోకి అడుగుపెట్టింది. రెండో రోజూ వాహన ప్రదర్శనలో ఏస్, మిస్‌ఫిట్ బైకులను ప్రదర్శించింది. 2019లో 5000 బైకుల అమ్మకాలే లక్ష్యమని తెలిపింది. 229సీసీ ఫోర్ స్ట్రోక్ ఇంజిన్ కలిగిన ఏస్ విభాగంలో మూడు ఉప మోడళ్లు ఏస్ డీలక్స్, ఏస్ స్క్రాంబ్లర్, ఏస్ కెఫేలు ఉన్నాయి. ఇక మిస్‌ఫిట్ మోడల్ 229సీసీ ఎయిర్‌కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది.

పినాకిల్ ఫినెట్జా.. ఇది విభిన్నం

విలాసవంతమైన మోటార్‌హోమ్ (ఇంటి తరహా సదుపాయాలు ఉన్న వాహనం) 'ఫినెట్జా'ను పినాకిల్ స్పెషాలిటీ వెహికల్స్ ఆవిష్కరించింది. దీంతో పాటు ఎగ్జిక్యూటివ్ బిజినెస్ వ్యాన్ ఒపిసియా, కస్టమైజ్డ్ టూరర్ మెగ్నిఫీసియా, ప్రోడక్ట్ డిస్‌ప్లే వ్యాన్ ఎగ్జిబికాలను విడుదల చేసింది. దేశీయ పర్యాటకంలోని అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా కంపెనీ అడుగులు వేస్తోంది. ఫినెట్జా ధర రూ.15-25 లక్షల మధ్య ఉంటుందని తెలిపింది.

సెన్సెక్స్ ▲ 330
34413

నిఫ్టీ ▲ 100
10577

రూపాయి 64.26 ▲
(ఒక అమెరికా డాలరుకు) 2 పైసలు

బంగారం 30005 ▼
(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 380

వెండి 37670 ▼
ముంబయిలో కిలో రూ.లలో 765

ముడి చమురు 64.60 ▼
(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	24,341	–551
నాస్‌డాక్	6,907	–144
నిక్కీ 225 (జపాన్)	21,891	+245
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	30,451	+128
షాంఘై(చైనా)	3,262	–47
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,170	–108
డాక్స్ (జర్మనీ)	12,260	–330


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.55	67.89
పౌండ్ స్టెర్లింగ్	81.39	94.35
యూరో	71.90	83.40
జపనీస్ యెన్/100	53.54	62.09
ఆస్ట్రేలియా డాలరు	45.81	53.00
సింగపూర్ డాలరు	44.13	52.28
థాయ్ బాత్/100	184.41	220.48
బహ్రెయిన్ దీనార్	158.55	181.70
కువైట్ దీనార్	177.40	220.83
ఒమన్ రియాల్	155.27	177.64
సౌదీ రియాల్	15.57	18.46
యూఏఈ దిర్హమ్	15.94	18.63





గురువారం నిఫ్టీ కదలికలు

10 శాతం తగ్గిన గ్రాన్యూల్స్ లాభం

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి గ్రాన్యూల్స్ ఇండియా ఏకీకృత ప్రాతిపదికన రూ. 35.01 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ. 39.06 కోట్లతో పోలిస్తే 10 శాతం పైగా తగ్గింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ. 363.74 కోట్ల నుంచి రూ. 411.59 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ. 1,197.05 కోట్ల ఆదాయంపై రూ. 112.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మూడో మధ్యంతర డివిడెండును బోర్డు సిఫారసు చేసింది. రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు 25 పైసలు (25%) డివిడెండు చెల్లిస్తారు.

మళ్లీ అమెరికా గుబులు..: మదుపర్లు ఈక్విటీ నుంచి బాండ్ల మార్కెట్ వైపు మొగ్గు చూపడంతో అమెరికా మార్కెట్లు మళ్లీ భారీగా పతనమయ్యాయి. కడపటి సమయానికి డోజోన్స్ 551 పాయింట్లు, నాస్‌డాక్ 144 పాయింట్ల చొప్పున నష్టంతో ట్రేడ్ అవుతున్నాయి.

హమ్మయ్య.. లాభాలొచ్చాయ్

- సూచీల వరుస నష్టాలకు తెర
- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు

సమీక్ష

ఎట్టకేలకు మదుపర్లకు ఉపశమనం. ఏడు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. తక్కువ స్థాయిల వద్ద ఐటీ, ఔషధ, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు ఇందుకు కలిసొచ్చాయి. ముడి చమురు ధరలు ఆరు వారాల కనిష్ఠానికి చేరడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 34,208.11 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 34,634.35 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అనంతరం లాభాల స్వీకరణ ఎదుర్కొన్న సెన్సెక్స్, చివరకు 330.45 పాయింట్ల లాభంతో 34,413.16 పాయింట్ల వద్ద ముగిసింది. గత ఏడు సెషన్లలో సూచీ 2,200 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం కీలకమైన 10,550 స్థాయి ఎగువకు చేరింది. 100.15 పాయింట్లు పెరిగిన సూచీ 10,576.85 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,479.55- 10,637.80 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 23 లాభాలతో ముగిశాయి. సన్‌ఫార్మా 6.32%, డాక్టర్ రెడ్డీస్ 3.18%, ఎస్‌బీఐ 2.97%, ఇన్ఫోసిస్ 2.33%, యాక్సిస్ బ్యాంక్ 1.75%, టాటా స్టీల్ 1.64%, హెచ్‌డీఎఫ్‌సీ 1.50%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.45%, హిందుస్థాన్ యునిలీవర్ 1.44% చొప్పున రాణించాయి.

మార్కెట్ కబుర్లు

- చౌక, మధ్య తరగతి ఆదాయ వర్గాల గృహ సముదాయ ప్రాజెక్టుల అభివృద్ధి నిమిత్తం **హెచ్‌డీఎఫ్‌సీ కేపిటల్ అడ్వయిజర్స్, ప్రెస్టీజ్ గ్రూపులు** కలిసి రూ. 2,500 కోట్ల నిధిని ఏర్పాటు చేయనున్నాయి.
- **గెలాక్సీ సర్ఫెక్టంట్స్** షేరు శుభారంభం చేసింది. స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన మొదటి రోజే అదరగొట్టింది. బీఎస్ఈలో షేరు 14.73 శాతం పెరిగి రూ. 1,698.10 వద్ద ముగిసింది.
- పుణె కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న విద్యుత్ వాహనాల అంకుర సంస్థ టార్క్ మోటార్స్‌లో 45 శాతం వాటా కొనుగోలుకు రూ. 30 కోట్ల పెట్టుబడిని **భారత్ ఫోర్జ్** పెట్టనుంది.
- తమిళనాడు, కర్ణాటకలో రెండు సంస్థల నుంచి 160 మెగావాట్ల సౌర విద్యుత్ ఈపీసీ ఆర్డర్లు లభించాయని **సీమెన్స్** తెలిపింది.
- క్యూఐపీ, రైట్స్ ఇష్యూ, మలివిడత పబ్లిక్ ఆఫర్‌ల మార్గంలో షేర్ల జారీ ద్వారా రూ. 1000 కోట్లు సమీకరించనున్నట్లు **కెనరా బ్యాంక్** వెల్లడించింది.
- పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు **ఫైన్ ఆర్గానిక్ ఇండస్ట్రీస్** సెబీకి దరఖాస్తు సమర్పించింది. తొలి పబ్లిక్ ఆఫర్‌లో (ఐపీఓ) భాగంగా ప్రస్తుత వాటాదార్లకు చెందిన 76,64,994 ఈక్విటీ షేర్లను కంపెనీ విక్రయించనుంది.
- **ఫోర్టిస్ హెల్త్‌కేర్** ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్‌లు కంపెనీ బోర్డు డైరెక్టర్ల పదవికి రాజీనామా చేశారు. వీరిద్దరి రాజీనామాపై 13న జరిగే సమావేశంలో బోర్డు చర్చిస్తుంది.

వామా ఇండస్ట్రీస్ ఆదాయం రూ.29 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఐటీ మౌలిక సదుపాయాల కంపెనీ వామా ఇండస్ట్రీస్ 2017, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి రూ. 28.95 కోట్ల అమ్మకాలపై రూ. 1.28 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం అమ్మకాలు రూ. 5.65 కోట్లు, లాభం రూ. 6.64 లక్షలు ఉన్నట్లు తెలిపింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
సీఈఎస్‌సీ	154	152	1749	1650
గ్లెన్‌మార్క్ ఫార్మా	104.7	477.10	2203.66	2535
బల్‌రాంపూర్ చినీ	61.42	175.20	1007.50	999
ఎస్‌ఆర్‌ఎఫ్	131	108	1418	1212
రాంకో సిస్టమ్స్	3.77	3.08	127.63	113.52
టీవీ టుడే	35.72	26.32	173.58	140.88
ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా	9.6	5.7	175.7	155.5
కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్	31.2	19.9	965.3	763.3
బజాజ్ ఎలక్ట్రికల్స్	36.83	29.71	1140.70	1052.08
జేపీవీఎల్	(194.41)	(172.96)	970.17	723.58
హైడెల్‌బర్గ్ సిమెంట్	31.76	(3.58)	500.5	471.41
టేక్ సొల్యూషన్స్	41.95	37.77	409.38	345.34
ధనలక్ష్మి బ్యాంక్	(21.7)	(8.1)	270.11	290.22
ఎరోస్ ఇంటర్నేషనల్	67.16	95.64	204.97	335.78
సెయిల్	43.16	(794.84)	15443.13	12,688.47
ముత్తూట్ ఫైనాన్స్	464	291	1567	1346
హిందుజా గ్లోబల్ సొల్యూషన్స్	48.97	47.22	978.51	959.68
ట్రెంట్	37.89	37.72	525.55	446.72
టొరెంట్ ఫార్మా	20	234	1012	1225
టాటా కమ్యునికేషన్స్	10.12	1.26	4188.65	4450.92
పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ	529	397	-----	-----
బాంబే డైయింగ్	3.38	(5.57)	635.08	495.88
ఏబీబీ	171.52	162.81	-----	-----
ఫ్యూచర్ కన్జూమర్	(3.09)	(11.26)	788.66	558.02

నేటి బోర్డు సమావేశాలు: ★ బీపీసీఎల్ ★ హెచ్‌పీసీఎల్ ★ ఆయిల్ ఇండియా ★ ఓఎన్‌జీసీ ★ టాటా స్టీల్ ★ ఎంఅండ్ఎం ★ ఎస్‌బీఐ ★ ఓబీసీ ★ బీఓబీ ★ సిండికేట్ బ్యాంక్ ★ యూకో బ్యాంక్ ★ బాటా ఇండియా ★ ఇండియా సిమెంట్స్ ★ ఎన్‌ఎఫ్‌సీఎల్ ★ ఆర్‌సీఎఫ్ ★ మారికో ★ నేషనల్ అల్యూమినియం ★ ఏబీ క్యాపిటల్ ★ ఆల్కెమ్ ల్యాబొరేటరీస్ ★ ఆంధ్రా పెట్రో ★ అవంతి ఫీడ్స్ ★ సెంట్రల్ బ్యాంక్ ★ సెంట్రమ్ ★ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ★ జిల్లెట్ ఇండియా ★ జీఈ షిప్పింగ్ ★ హోటల్ లీలా ★ రాంకీ ★ శోభా ★ సుజ్లాన్

పెరిగిన ఆంధ్రా బ్యాంకు నష్టం

- మూడో త్రైమాసికానికి రూ.532 కోట్లు
- మొండి బకాయిల కేటాయింపులతో భారం
- ప్రభుత్వం నుంచి రూ.1,890 కోట్ల నిధుల సమీకరణ!
- ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా షేర్ల జారీ



ఈనాడు, హైదరాబాద్: మొండి బకాయిలకు భారీగా కేటాయింపులు చేయడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఆంధ్రా బ్యాంకు నష్టం మరింతగా పెరిగింది. 2016, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి రూ. 56.70 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిన బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి రూ. 532.02 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. 2017-18 రెండో త్రైమాసికంలో బ్యాంకు నికర నష్టం రూ. 385.11 కోట్లు ఉంది. సమీక్ష త్రైమాసికానికి వడ్డీ ఆదాయం రూ. 4,408.57 కోట్ల నుంచి రూ. 4,549.26 కోట్లకు పెరగ్గా.. మొత్తం ఆదాయం రూ. 5,012.86 కోట్ల నుంచి రూ. 5,093.43 కోట్లకు చేరిందని బ్యాంకు తెలిపింది. మొత్తం వ్యయం రూ. 4,102.45 కోట్ల నుంచి రూ. 3,763.11 కోట్లకు తగ్గినప్పటికీ.. కేటాయింపులు పెరగడం బ్యాంకుపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. మొండి బకాయిలకు కేటాయింపులు రూ. 803.91 కోట్ల నుంచి రూ. 1,744.99 కోట్లకు చేరగా.. మొత్తం కేటాయింపులు రూ. 828.71 కోట్ల నుంచి రూ. 2,423.34 కోట్లకు పెరిగాయి. బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి 11.36 శాతం నుంచి 12.17 శాతానికి చేరింది. బ్యాంకులో ప్రభుత్వ వాటా ఏడాది క్రితం ఇదే కాలంలో 61.26 శాతం కాగా.. 2017, డిసెంబరు నాటికి 69.77 శాతం ఉంది. నికర నిరర్థక ఆస్తులు 6.98 శాతం నుంచి 7.72 శాతానికి పెరిగినట్లు ఆంధ్రా బ్యాంకు తెలిపింది. కేంద్ర ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ ఇష్యూ చేయడం ద్వారా ఈక్విటీ మూలధనాన్ని పెంచుకోవాలని బ్యాంకు బోర్డు నిర్ణయించింది. అనుమతులకు అనుగుణంగా ప్రీమియంతో కలిపి రూ. 1,890 కోట్ల విలువైన షేర్లను ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా ప్రభుత్వానికి జారీ చేస్తారు. దీంతో ఈ మేరకు బ్యాంకుకు నిధులు లభిస్తాయి. బ్యాంకులో ప్రభుత్వ వాటా పెరుగుతుంది.


కేడిలా లాభంలో 68% వృద్ధి

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో కేడిలా హెల్త్‌కేర్ నికర లాభం ఏకీకృత ప్రాతిపదికన 67.73 శాతం పెరిగింది. ఏడాదిక్రితం ఇదే త్రైమాసికంలో రూ. 323.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా.. సమీక్ష త్రైమాసికంలో రూ. 543.3 కోట్లుగా నమోదైంది. కార్యకలాపాల ఆదాయం కూడా 38.63 శాతం వృద్ధితో రూ. 3,191.8 కోట్లకు చేరింది. 2016-17 అక్టోబరు-డిసెంబరులో ఆదాయం రూ. 2,302.3 కోట్లుగా ఉంది.

ఎస్ఎంఎస్ ఫార్మా లాభం రూ.12 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఆదాయం తగ్గినప్పటికీ.. ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ నికర లాభం పెరిగింది. 2017, డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు రూ. 12.14 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో లాభం రూ. 9.6 కోట్లు ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ. 126.48 కోట్ల నుంచి రూ. 103.87 కోట్లకు తగ్గింది. 2017-18 తొలి తొమ్మిది నెలలకు రూ. 365.32 కోట్ల ఆదాయంపై రూ. 30.74 కోట్ల లాభం నమోదైనట్లు తెలిపింది.

8న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా (ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	340
బెంగళూరు	365	చెన్నై	380
9వ తేదీకి		చిత్తూరు	373
విజయవాడ/గోదావరి	335	నమక్కల	365

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 405.10 (407.00) 2952821
AMBUJA CEMEN 261.90 (248.30) 4063203
ASIAN PAINTS 1124.05 (1121.10) 1185917
AUROBIND PHA 601.85 (616.10) 4415403
AXIS BANK LT 568.45 (559.35) 5816886
BAJAJ AUTO L 3157.95 (3135.55) 202895
BAJAJ FINANC 1662.15 (1641.65) 750746
BHARTI AIRTE 429.80 (430.25) 5563903
BHARTI INFRA 349.20 (338.55) 1436457
BOSCH LTD 19592.25 (19244.75) 19788
BPCL 478.20 (476.25) 6038834
CIPLA 612.65 (569.25) 8349913
COAL INDIA L 300.00 (297.60) 3286814
DR. REDDYS 2180.45 (2111.40) 889623
EICHER MOTOR 28198.00 (28010.45) 68533
GAIL 461.85 (460.30) 3560673
HCL TECH 944.35 (938.55) 1448268
HDFC 1811.80 (1785.35) 1865933
HDFC BANK 1880.95 (1872.80) 1292861
HERO MOTOCOR 3582.20 (3566.40) 325607
HINDALCO IND 245.20 (246.00) 10180978
HINDUSTAN UN 1329.55 (1312.65) 1146084
HPCL 399.80 (396.35) 6767391
ICICI BANK 333.85 (332.55) 10294899
INDIABULLS H 1314.40 (1274.10) 1594358
INDIAN OIL 385.60 (404.75) 7736486
INDUSINDBANK 1670.85 (1661.75) 801569
INFOSYS LTD 1134.25 (1109.05) 4403622
ITC 274.10 (275.15) 9779911
KOTAK MAHIND 1051.75 (1036.30) 1839297
LARSEN & TOU 1347.40 (1333.75) 1932082
LUPIN 812.45 (806.05) 2057573
M&M 752.20 (747.10) 3024010
MARUTI SUZIK 9030.70 (8921.80) 465683
NTPC LTD 163.70 (165.45) 6238973
ONGC 188.70 (190.00) 4540513
POWER GRID C 193.20 (195.50) 18864371
RELIANCE IND 904.55 (894.40) 6320734
SBI 301.40 (292.80) 18932796
SUN PHARMA 584.10 (549.50) 13707589
TATA CONSULT 2974.20 (2955.05) 1377502
TATA MOTORS 374.85 (377.80) 12452396
TATA STEEL L 671.45 (661.80) 5845590
TECH MAHINDR 608.25 (603.10) 2894969
ULTRATECH 4167.00 (4081.55) 188256
UPL LIMITED 718.05 (701.25) 1603409
VEDANTA LIMI 314.45 (315.70) 16604938
WIPRO 289.80 (289.35) 5297067
YES BANK LTD 335.00 (332.90) 7785799
ZEE ENTERTAI 584.80 (581.15) 1194015

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1594.85 (1578.50) 104852
ACC 1693.25 (1587.40) 1516076
ASHOK LEYLAN 134.15 (132.90) 24389428
AVENUE SUPER 1165.55 (1122.65) 493415
BAJAJ FINSER 5057.25 (5012.05) 154586
BANK OFBAROD 156.20 (153.95) 6839457
BEL 156.95 (157.85) 7025928
BHEL 95.15 (94.25) 22688194
BRITANNIA 4628.00 (4550.45) 99666
CADILA HEALT 405.20 (396.35) 3105912
COLGATE PALM 1100.85 (1099.25) 160079
CONTAINER 1341.35 (1342.55) 209186
CUMMINS INDI 839.60 (818.45) 156840
DABUR INDIA 340.30 (338.35) 1463375
DLF LIMITED 229.35 (225.25) 8201053
EMAMI LIMITE 1115.70 (1125.55) 63514
GLAXOSMI CON 6188.70 (6281.40) 5823
GLAXOSMI PHA 2461.65 (2440.00) 9975
GLENMARK PHA 579.60 (569.10) 2067700
GODREJ CONSU 1017.55 (1011.70) 391678
HAVELLS INDI 520.90 (504.20) 998079
HINDUSTAN ZI 287.30 (288.90) 4075914
ICICI PRU LI 420.70 (422.30) 987932
IDEA CELLULR 85.55 (84.30) 15343661
INTERGLOBE A 1255.90 (1211.90) 1329062
JSW STEEL LT 304.20 (290.00) 8028713
LIC HOUS.FIN 514.45 (502.75) 1708087
MARICO LIMIT 300.10 (300.35) 1187715
MCDOWELL 3154.50 (3127.15) 258332
MOTHERSON 364.00 (355.00) 2672494
MRF 70171.05 (68827.45) 12304
NHPC LTD 28.70 (28.50) 4548550
NMDC LTD 133.70 (129.95) 2968350
OIL INDIA 362.10 (356.05) 587556
ORACLE FIN S 4092.80 (4096.80) 83924
P&G HYG&HEAL 9273.65 (9088.85) 6789
PETRONET LNG 248.90 (246.15) 1691407
PIDILITE IND 884.90 (865.15) 836120
PIRAMAL ENTE 2705.80 (2650.70) 180086
PNB 159.35 (156.55) 16358889
POWER FIN CO 110.15 (109.40) 3906768
RURAL ELEC C 150.55 (149.05) 4192965
SAIL 86.00 (82.85) 10365411
SHREE CEMENT 17005.05 (16996.55) 16094
SHRIRAM TRAN 1337.60 (1325.20) 351971
SIEMENS 1226.00 (1217.30) 202974
SUN TV LTD 1006.55 (933.10) 1927256
TATA POWER 85.05 (84.70) 3975580
TITAN IND 800.75 (783.65) 2219546
TORRENT PHAR 1380.85 (1375.75) 156061

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 7.41 (7.78) 18731
AMAR RAJA BA 810.20 (790.45) 19074
ANDHRA BANK 47.20 (46.35) 327501
ANDHRA CEMEN 12.02 (11.58) 33236
ANDHRA PAPER 325.10 (309.35) 22415
ANDHRA PETRO 68 (65.75) 138120
ANDHRA SUGAR 500.05 (493.45) 14739
ASTRA MICROW 106.65 (105.10) 47016
AUROBINDO PH 601.90 (616.75) 346663
AVANTEL SOFT 568.70 (517) 14623
AVANTI FEEDS 2523.20 (2423.55) 29080
BALAJI AMIN 637.95 (616.25) 14714
BHAGYA NAG 43.20 (40.10) 12839
BRILLIANT SE 12.25 (12.85) 815428
COROMAN FERT 545.85 (542.75) 10253
CUBEX TUB 24.55 (23.60) 7230
CYBERMATE 3.43 (3.16) 50580
CYIENT LIMIT 624 (605.55) 29063
DIVI'S LAB 1028.60 (1011.80) 294887
DR REDDY 2178.95 (2111.70) 56913
GATI CORPN 117.05 (119.80) 266775
GAYATRI PROJ 202.70 (195.20) 448494
GMR INFRASTR 19.35 (19.10) 3151806
GOLDST INFRA 198.70 (189.40) 29045
GRANULES (I) 118.55 (119.20) 287257
GSS AMERICA 34.40 (34.70) 19356
GVK POWER 19.65 (18.75) 1907193
HBL NIFE POW 59.25 (55.85) 163980
IDL INDUSTRS 601.65 (612.25) 10469
IKF SOFT 0.99 (1.04) 126734
ILFS ENGINEE 46.85 (44.65) 34406
INNAREDY COM 4.18 (4.12) 16415
IVRCL INFRAS 5.06 (4.91) 164433
KAKATIYA CEM 314.85 (306) 12275
KALLAM SPG 23.95 (23) 33041
KAVERI SEED 473.50 (470.85) 84448
KCP LTD 138.50 (132.45) 49626
KERNEX MICRO 43.55 (44.80) 45138
KNR CONSTRUC 306.65 (306.95) 10315
LANCO INDUS 367.80 (354.30) 40674
LANCO INFRAT 1.38 (1.41) 2789818
LOKESH MACH 64.55 (61.45) 31900
MADHUCON PRO 30.05 (28.60) 68660
MEGA SOFT 14.49 (13.80) 10280
MIC ELECTRON 7.97 (7.94) 70440
MOLDTK PLA 349.45 (342.40) 7357
MSR INDIA LT 39.50 (37.90) 8882
NAGARJAGRICH 47.75 (45.50) 50011
NATCO PHARMA 826.75 (831.45) 44833
NAVA BH VENT 147.70 (144.35) 38384
NCC 113.70 (110.45) 410917
NCL IND 256.95 (244.05) 22032
NEHA INTER 8.37 (7.61) 26876
NETTLINX 84 (83.45) 21259
NIHAR INFO 13.25 (13.20) 2895
OIL COUNTRY 46.45 (45.60) 9781
PANYAM CEMEN 55.25 (52.70) 21655
PENNER IND 59.55 (59.40) 107889
PITTI LAMIN 85.40 (79.25) 22918
PRAJAY ENGS 14.80 (14.15) 43852
PRISM CEMENT 133.70 (121.90) 160983
PRUDENTL PHA 4.95 (4.34) 309202
RAIN INDUSTR 383.40 (362.20) 923923
SAMKRG PIST 310.70 (297.05) 6848
SAMPRE NUTRI 58.90 (62) 13659
SATVAH. ISPA 25.30 (23.55) 11567
SMS PHARMA 95.75 (91.10) 11245
SOUTH BIO TE 3.46 (3.50) 21741
SREE RAYAL A 62 (61.70) 343421
SRINIVASA SH 67.65 (64.10) 11581
STEEL EXCHAN 31.55 (30.05) 11336
SUJANA METAL 1.45 (1.40) 54500
SUJANA UNIVE 0.97 (0.97) 42260
SURANA TELE 5.52 (5.50) 16200
SUVEN PHARMA 197.85 (192) 72445
TAJ GVK HOTE 174.60 (172.55) 9854
TANLA 32.65 (31.35) 82331
TRANS BIOTEK 2.24 (2.17) 13926
TRENDY KNIT 0.22 (0.21) 111991
VICEROY HOTE 16.15 (15.95) 111879
VIMTA LABS 194.75 (190.55) 9910
VISAKA IND 680.90 (655.70) 10629
VISTA PHARMA 40.05 (40.25) 10751
VIVIMED LABS 86.40 (83.95) 208703
YBRANT DIGIT 6.03 (5.75) 1240577
ZENOTECH LAB 45 (44.20) 14921
ZENTECH 117.85 (118.40) 34889

స్తంభించిన ఆంధ్రప్రదేశ్

ఈనాడు, అమరావతి: కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెదేపా ఎంపీలు పార్లమెంటులో చేస్తోన్న నిరసనకు పార్టీశ్రేణులు పూర్తి మద్దతు ప్రకటించాయి. రాష్ట్ర మంత్రులు స్వయంగా నిరసనల్లో పాల్గొన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, స్థానికసంస్థల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ గాంధీ, అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. పలువురు మంత్రులు ప్లకార్డులు చేతపట్టి ప్రదర్శనలు చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఉయ్యూరులో మండుటెండలో గుండు చేయించుకుని నిరసన తెలిపారు. కొన్నిచోట్ల అర్ధనగ్న ప్రదర్శనలు, అరగుండు చేయించుకుని వినూత్న పద్ధతుల్లో నిరసించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కళా వెంకట్రావు గుంటూరు లాడ్జి సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి నక్కా ఆనందబాబు తెదేపా శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. మంత్రి పరిటాల సునీత అనంతపురం జిల్లా రామగిరిలో 'సేవ్ ఏపీ' అంటూ విద్యార్థులతో కలిసి నడిచారు. అనంతపురం జిల్లా కణేకల్లులో నిర్వహించిన ధర్నాలో మంత్రి కాలవ శ్రీనివాసులు కేంద్ర ప్రభుత్వ తీరుని, వైకాపా వైఖరిని దుయ్యబట్టారు. మచిలీపట్నం బస్టాండ్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర, ఒంగోలులో మంత్రి శిద్దా రాఘవ రావు ప్రదర్శనలో పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శనలో...

కేంద్రం అన్యాయం చేస్తోందంటూ పాలకొల్లులో ఎమ్మెల్యే రామానాయుడు, ఎమ్మెల్సీ రామ్మోహన్ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో సీనియర్ నాయకుడు నిరసనపల్లి నాగేశ్వరరావు అర గుండు, అర మీసం తీయించుకుని వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ధర్నాచౌక్ వద్ద సెంట్రల్ నియోజకవర్గ తెదేపా, పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తూర్పు నియోజకవర్గ తెదేపా ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. విశాఖపట్నంలో గాజువాకలో హైవేపై నిర్వహించిన ప్రదర్శనలో పల్లా శ్రీనివాసరావు, మద్దిలపాలెం కూడలిలో తెలుగుతల్లి విగ్రహం వద్ద రామకృష్ణబాబు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మాజీ మంత్రి మృణాళిని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా తెదేపా అధ్యక్షురాలు గౌతు శిరీష మండలంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అరెస్టైన తెదేపా నాయకులకు సంఘీభావం ప్రకటించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట, గజపతినగరం, నెల్లిమర్ల, పార్వతీపురం నియోజకవర్గాల్లో తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోళ్ల లలితకుమారి, కె.ఎ.నాయుడు, పతివాడ నారాయణస్వామినాయుడు, బొబ్బిలి చిరంజీవులు, ద్వారపురెడ్డి జగదీష్, జి.సంధ్యారాణి పాల్గొన్నారు. కడప జిల్లా రాజంపేటలో తెదేపా నాయకులు గాంధీవిగ్రహం వద్ద నిరసన తెలిపారు.




గురువారం ఏపీ బంద్ నేపథ్యంలో ఉద్యోగులు, సందర్శకులు లేక బోసిపోయిన వెలగపూడి సచివాలయ ప్రాంగణం ★ గుంటూరు బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులు

ఇంటిపట్టునే భాజపా నేతలు: చినరాజప్ప


ఈనాడు, న్యూస్‌టుడే యంత్రాంగం: రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలన్నీ నిరసన తెలుపుతుంటే భాజపా నేతలు ఇంటిపట్టునే ఉన్నారని ఏపీ హోంమంత్రి చినరాజప్ప ఆరోపించారు. రాష్ట్రానికి సహకరించడంలో భాజపా విఫలమైందని, పార్లమెంటులో తెదేపా ఎంపీల నిరసనకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తరఫున ర్యాలీలు నిర్వహించామని హోంమంత్రి తెలిపారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రి సుజనాచౌదరి రాజ్యసభలో మాట్లాడుతుంటే వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. గాజువాకలో మంత్రి గంటా శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాలే తమకు ముఖ్యమని, అవసరమైతే కేంద్రంలోని భాజపాతో పొత్తు వదులుకుంటామన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ తలుపులు మూసి ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ అన్యాయం చేసిందని, నేడు భాజపా ప్రభుత్వం తలుపులు తెరిచి అన్యాయం చేసిందని మంత్రి భూమా అఖిలప్రియ ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించినర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి రావాల్సిన నిధులన్నింటినీ సాధించే వరకు విశ్రమించేది లేదని తెదేపా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు స్పష్టం చేశారు. దిల్లీలో తెదేపా ఎంపీలు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా గుంటూరు లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

గళమెత్తిన జనం.. నినదించిన రాష్ట్రం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ గళమెత్తింది. విభజన హామీల అమలు విషయంలో జరుగుతోన్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ నినదించింది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేదంటూ ఆవేదనను, అసంతృప్తిని, ఆగ్రహావేశాల్ని వ్యక్తపరిచింది. సీపీఐ, సీపీఎం తదితర వామపక్షాల పిలుపు మేరకు గురువారం నిర్వహించిన రాష్ట్ర బంద్ పూర్తిగా విజయవంతమైంది. ప్రశాంతంగా ముగిసింది. వైకాపా, కాంగ్రెస్, జనసేన పార్టీలు మద్దతు ప్రకటించి బంద్‌లో పాల్గొన్నాయి. పలు ప్రజా, పాత్రికేయ, కార్మిక సంఘాలు ప్రదర్శనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించారు. సమారు 11వేల ఆర్టీసీ బస్సులు డిపోల్లోనే ఆగిపోవడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ప్రైవేటు వాహనాలు కూడా పెద్దగా నడవలేదు. అన్ని ప్రధాన నగరాలు, జిల్లా, మండల కేంద్రాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ప్రభుత్వ విద్యాసంస్థలకు ముందే సెలవు ప్రకటించడంతో అవి తెరుచుకోలేదు. ప్రైవేటు విద్యాసంస్థలను యాజమాన్యాలు స్వచ్ఛందంగా మూసివేసి బందుకు మద్దతు ప్రకటించాయి. అక్కడక్కడ ప్రభుత్వ కార్యాలయాలు కూడా పనిచేయలేదు. సినిమా థియేటర్ల యాజమాన్యాలు ఉదయం ఆటను నిలిపేసి బంద్‌కు సహకరించాయి. పలుచోట్ల న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రను గురువారం నిలిపేసి బంద్‌కు మద్దతు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏఎస్‌పేట మండలం జువ్వలగుంటపల్లి వద్ద విద్యార్థులతో కలిసి జగన్ ప్రదర్శించారు. అనంతపురం జిల్లా హిందూపురంలో జరిగిన బంద్, నిరసన కార్యక్రమాలకు ఏపీ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి హాజరయ్యారు. కర్నూలులో జరిగిన బంద్, నిరసన ప్రదర్శనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విజయవాడలో జరిగిన కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పాల్గొన్నారు.

పోరు మరింత తీవ్రం

- సస్పెండైనా ఫర్వా లేదు
- ఎంపీలతో చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్



ఈనాడు, అమరావతి: అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ అందరినీ కలుపుకొని పోవడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం కూడా సాయంపై అరుణ్ జైట్లీ స్పష్టంగా ఎలాంటి ప్రకటనా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపాలో జాతీయ స్థాయి పార్టీ తరహా వైఖరి కనిపించడం లేదన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో పోరును మరింత తీవ్రం చేయాలని ఎంపీలకు సూచించారు. బడ్జెట్ సమావేశాల తొలి విడతలో శుక్రవారం ఒక్కరోజే ఉన్నందున మరింతగా రాష్ట్ర ప్రజల మనోభావాలను, ఆకాంక్షల్నీ నిరసన రూపంలో వెల్లడించాలని చెప్పారు. సస్పెండైనా ఫర్వా లేదనీ, ఇదే రీతిలో నిరసనలు కొనసాగించాలని సూచించారు. గురువారం రాత్రి దుబాయ్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర మంత్రి సుజనా చౌదరి, కొందరు ఎంపీలతో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు వ్యూహరచన చేసుకుంటూ పోరును కొనసాగిద్దామని, జైట్లీ ప్రకటన ఏ మాత్రం సంతృప్తిని కలిగించే విధంగా లేదని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు సమాచారం.

ఏపీ అంతర్భాగం కాదా?: దేశంలో ఆంధ్రప్రదేశ్ అంతర్భాగం కాదని భారతీయ జనతా పార్టీ భావిస్తోందని, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీగా వ్యవహరించడం లేదని చంద్రబాబుకు ఎంపీలు ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా వ్యవహరిస్తోందని, రాష్ట్రానికి ఏమీ చేసే ఆలోచన ఉన్నట్లు లేదని చెప్పారు. అరుణ్ జైట్లీతో మాట్లాడిన విషయాలను ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి సుజనా చౌదరి వివరించారు. రెవెన్యూ లోటు భర్తీ, ప్రత్యేక ప్యాకేజీ అంశాలు తన శాఖ పరిధిలోనివేనని, వాటి గురించే తాను ప్రసంగంలో చెప్పగలనని జైట్లీ తెలిపారని సుజనా వివరించారు. ఇతర శాఖలకు సంబంధించిన విషయాలు, హామీలపై ప్రధాని మోదీగానీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షాగానీ చెప్పాల్సి ఉంటుందని తేల్చి చెప్పారని తెలిపారు. దీంతో వారు ఏమీ మాట్లాడుకోకుండా సభలో ప్రకటనలు చేస్తే ఎలా అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇప్పటివరకూ అనుసరిస్తున్న వ్యూహానికీ, ఇకపై వ్యవహరించాల్సిన వ్యూహానికీ తేడా ఉంటుందని పేర్కొన్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఏపీకి నెరవేర్చని హామీల జాబితాను తెదేపా సిద్ధం చేసింది. ఆ హామీలు 19 ఉన్నాయి. వీటి వివరాలతో కూడిన జాబితాను ఉభయ సభల్లో అన్ని పార్టీల ఎంపీలకు అందజేయనున్నారు.

విభజన హామీలపై ఉమ్మడి కూటమితో ముందుకు

జేపీతో సమావేశమైన పవన్ కల్యాణ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకునే దిశగా సమష్టిగా ముందుకు వెళ్లనున్నట్లు లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విభజన హామీల సాధనకు దిశానిర్దేశం చేయాలని కోరుతూ పవన్ గురువారం సాయంత్రం జయప్రకాష్ నారాయణతో బేగంపేట లోక్‌సత్తా కార్యాలయంలో సమావేశమయ్యారు. అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు. జేపీ మాట్లాడుతూ.. కాలుమీద కాలేసుకుని బతికే వెసులుబాటున్నా, హీరోగా చూసేందుకు లక్షలమంది డబ్బులు చెల్లిస్తున్నా.. ఇవన్నీ కాదని చిన్న వయసులోనే పవన్ కష్టాల కోర్చుతున్నారన్నారు. దీన్నిబట్టి సమాజంపై ప్రేమ, తపన ఆయనకు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రస్తుతం సామరస్య వాతావరణం ఏర్పడుతోందని, దాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని వివరించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. హామీలను సాధించే దిశగా ఉమ్మడి కూటమి ముందుకు వెళుతుందన్నారు. రోడ్ల మీదకు వచ్చి నిరసనలు చేయడం కంటే మేధావులు, విద్యావంతులు, అనుభవజ్ఞులు తదితరులతో మాట్లాడి కేంద్రం దృష్టికి సమస్యను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు.



జేపీతో పవన్

మిత్రపక్షంపై ఆ వ్యాఖ్యలేంటి?

- సోము వీర్రాజుపై అమిత్‌షా తీవ్ర అసంతృప్తి

ఈనాడు అమరావతి: తెదేపా పైనా, ముఖ్యమంత్రి చంద్రబాబు పైనా భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు చేయడంపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. వీర్రాజుతో అమిత్‌షా బుధవారం ఫోన్లో మాట్లాడినట్టు భాజపా వర్గాల సమాచారం. మిత్రపక్షమైన తెదేపా విషయంలో సంయమనంతో వ్యవహరించాలని, ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు తగవని అమిత్‌షా గట్టిగానే చెప్పినట్టు తెలిసింది. సోము వీర్రాజు ఇటీవల పలు సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. కర్నూలులో మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలకూ దిగారు. తీవ్రమైన ఆరోపణలూ చేశారు. మిత్రపక్ష పార్టీ ఎమ్మెల్సీగా ఉండి ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల తెదేపా వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ప్రశ్నించే హక్కు ప్రజలకుంది

- తెదేపా నిరసనలపై దుబాయ్ నుంచి సమీక్షించిన ముఖ్యమంత్రి

ఈనాడు, అమరావతి: 'విభజన జరిగి నాలుగేళ్లయినా ఇంకా ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. ప్రజల్లో సెంటిమెంటును గౌరవించాలి. నిరసనల అణచివేత చర్యలకు పాల్పడవద్దు. జరిగిన అన్యాయంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి' అని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు, ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌తో ఒప్పందం చేసుకునేందుకు దుబాయ్ వెళ్లిన ఆయన అక్కడ నుంచే జిల్లాల వారీగా పార్టీ శ్రేణుల నిరసన ప్రదర్శనలపై సమీక్షించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బందుపైనా కలెక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు.

జైట్లీ నోట పాత పాటే!

- 2 రోజుల కిందట చెప్పిందే మళ్లీ...
- స్పష్టమైన హామీ ఇవ్వని కేంద్ర మంత్రి
- ఏ అంశంపైనా వివరణ లేదు
- సంతృప్తి చెందని తెదేపా ఎంపీలు
- ఆయన ముందే నిరసన

ఈనాడు, దిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి చెప్పిందే చెప్పారు. బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చేటప్పుడు ఏపీకి ఇచ్చిన హామీల అమలుపై మరింత స్పష్టత, నిర్దిష్ట గడువు చెబుతారేమోనని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. గురువారం సాయంత్రం 6.30 గంటలకు బడ్జెట్‌పై చర్చకు సమాధానమివ్వడానికి లేచి నిలిచిన ఆయన ప్రసంగం మొదలుపెడుతూ తాను ఏపీ అంశాలపై వివరంగా చివరలో చెబుతానని ప్రకటించడంతో ఆందోళన చేస్తున్న ఎంపీలతోపాటు ప్రజల్లో ఆశలు చిగురించాయి. చివరకు ఆయన చేసిన ప్రసంగాన్ని చూసి అంతా హతాశులయ్యారు. మరోసారి మోసం చేశారన్న భావనను ఎంపీలు వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగం అయిన వెంటనే సభలో తెదేపా, వైకాపా ఎంపీలు ఆందోళన కొనసాగించే అవకాశం ఉండటంతో స్పీకరు సుమిత్రా మహాజన్ వెంటనే సభను శుక్రవారానికి వాయిదావేసి వెళ్లిపోయారు. గురువారం సాయంత్రం అరుణ్ జైట్లీ మాట్లాడుతూ.. ఏపీ మిత్రులు గత నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నారని, అందుకు స్పందించాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌ను విభజించినప్పుడు మేం ఏపీ ప్రజల హక్కుల కోసం పోరాడాం. తెలంగాణ ఏర్పాటు కోసం మేం మద్దతిచ్చినప్పటికీ దానివల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థికంగా ప్రతికూల పరిస్థితులు ఉంటాయని చెప్పాం. అందువల్లే ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని వాగ్దానం చేశారు. ప్యాకేజీలో పలు అంశాలున్నాయి. అందులోని చాలా అంశాలు అమలు చేశాం. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. మేం ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిన కేంద్రీయ సంస్థలకు నిధులిచ్చాం. ఇదివరకున్న కేంద్రీయ సంస్థలు తెలంగాణ ప్రాంతానికి వెళ్లడంతో ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటు చేశాం. వాటికి నిధుల విడుదల కొనసాగిస్తాం. చట్టంలో చెప్పిన అన్ని సంస్థల ఏర్పాటుకు అవసరమైన నిధులిస్తాం. (ఎప్పుడు? అని గల్లా జయదేవ్ అడిగినప్పుడు) ఏదైనా సంస్థ ప్రారంభమైన వెంటనే ఆటోమేటిక్‌గా వాటికి నిధులిస్తాం. (అప్పుడు శివప్రసాద్ జోక్యం చేసుకుంటూ అది పాత పాట అన్నారు) ఇప్పటికే రాజధాని నిర్మాణానికి కొంత మొత్తం ఇచ్చాం. వెనుకబడిన జిల్లాలకు చెల్లింపులు చేశాం. పోలవరానికి నాబార్డు ద్వారా రూ.4,500 కోట్లు ఇచ్చాం. పోలవరం ప్రాజెక్టు వ్యయంలో అత్యధిక మొత్తాన్ని కేంద్రమే చెల్లిస్తుందని ఇప్పటికే చెప్పాం. ఆ భారాన్ని మేమే తీసుకున్నాం. డబ్బులు చెల్లిస్తూ పోతున్నాం. ఇప్పుడు రెండు అంశాలపై కసరత్తు జరుగుతోంది. అందులో తొలి అంశం... ప్రత్యేక ప్యాకేజీ కింద చెప్పిన మొత్తం చెల్లింపు. ఆ డబ్బు విదేశీ ఆర్థిక సంస్థల సాయంతో చేపట్టే ప్రాజెక్టులకు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అందుకు సమయం పడుతుందన్న ఉద్దేశంతో అదే మొత్తాన్ని నాబార్డు ద్వారా అందించాలని గత జనవరి 3వ తేదీన ముఖ్యమంత్రి నాకు లేఖ రాశారు. మేం దీనికి ఏర్పాట్లు చేస్తున్నాం. బుధవారం దీనిపై సమావేశం జరిగింది. నిన్న ఆర్థికశాఖ వ్యయ విభాగంతో జరిగిన చర్చలు రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మతమా? లేదా? అని తెలుసుకోవడానికి అధికారులు తిరిగి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయం తెలిసిన వెంటనే మేం దానిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తాం. రెవెన్యూ లోటుకు సంబంధించి మేం మరో ప్రతిపాదన చేశాం. వాళ్లు మరింత రావాలంటున్నారు. మా ప్రతిపాదనను రాష్ట్ర అధికారులు అక్కడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లెక్కల మధ్య ఉన్న గ్యాప్‌ను తగ్గించడానికి మేం ప్రయత్నిస్తున్నాం. వచ్చే ఒకటి రెండు రోజుల్లో ఈ రెండు అంశాలపై ఒక నిర్ణయానికి వస్తాం. ఇక మిగిలింది రైల్వే, పెట్రోలియంశాఖలకు సంబంధించిన అంశాలే. వాటిపై మేం ఇప్పటికే వివిధశాఖలతో చర్చిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మా మిత్రులతో మాట్లాడుతున్నాం. సాధ్యమైనంత ఉత్తమ పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోని మా మిత్రులకు సంతృప్తినిచ్చేలా సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటాం. మేం ఏపీ ప్రజల పట్ల పూర్తి సానుభూతితో ఉన్నాం. అందువల్ల వారి సమస్యలన్నీ పూర్తి సానుభూతితో పరిశీలిస్తాం' అని జైట్లీ పేర్కొన్నారు.



అప్పులతో సంతోష పెట్టాలా?

అప్పులు తెచ్చి రాష్ట్రాలకు పంచలేమన్న భావనను జైట్లీ వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏపీ దగ్గర డబ్బులు లేవు. ఇప్పటికే కేంద్రం ఈ ఏడాదిలో ఆమోదించిన రుణాలు రూ.58 వేల కోట్లకు చేరాయి. వాటిలో కొంత మొత్తాన్ని వీరికి ఇచ్చి ఉంటే వీరి ముఖాల్లో నవ్వులు పూసి ఉండేవేమో అని వెల్‌లో ఆందోళన చేస్తున్న తెదేపా ఎంపీలను చూపిస్తూ జైట్లీ వ్యాఖ్యానించారు. జయదేవ్ నన్ను మరింత అడుగుతున్నారని పేర్కొన్నారు. జైట్లీ ప్రసంగం అయిన వెంటనే తెదేపా సభ్యులు ఆయన ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రసంగంలో కొత్త అంశమేమీ చెప్పలేదని పేర్కొన్నారు. సుజనా చౌదరి ఆయనతో మాట్లాడారు.

15 రోజుల్లో పరిష్కారం చూపాలి: సుజనా

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వం 15 రోజుల్లో పరిష్కారం కనుగొనాలని కేంద్ర మంత్రి సుజనా చౌదరి రాజ్యసభలో డిమాండు చేశారు. సభలో ఆందోళనలు కొనసాగుతున్న తరుణంలో పరిష్కరించడానికి ఏమైనా సూచనలుంటే చెప్పాలని ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఆయనకు సూచించారు. దాంతో మంత్రి లేచి 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని ఎలా అశాస్త్రీయంగా, అహేతుకంగా ఆమోదించారో సభకు తెలుసు. అందుకు రెండు జాతీయ పార్టీలు బాధ్యత వహించాలి. అందుకు కట్టుబడకుండా పోవడంవల్లే ఈ పీటముడి పడింది. కేంద్రం సమాఖ్య వ్యవస్థను గౌరవించాలి. గత మూడున్నరేళ్లలో కొన్ని వాగ్దానాలు అమలు చేయలేదు. ప్రత్యేక హోదా, రెవెన్యూ లోటు భర్తీ, స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్‌లాంటి అపరిష్కృత సమస్యలున్నాయి. ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో వాటికి సమాధానమివ్వాలి. 15 రోజుల్లో పరిష్కారం కనుగొంటే బాగుంటుంది' అని సూచించారు.

జైట్లీ, సుజనా మధ్య వాగ్వాదం

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలుపై గురువారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ చేసిన ప్రకటనపై కేంద్ర మంత్రి సుజనా చౌదరి నిరసన వ్యక్తం చేశారు. సాయంత్రం లోక్‌సభ ముగిసిన తర్వాత రాజ్యసభ లాబీల్లో ఆయన ఆర్థిక మంత్రి జైట్లీతో వాగ్వాదానికి దిగారు. మీరు చెప్పిన సమాధానం ఏమాత్రం సంతృప్తికరంగా లేదని, తెలుగుదేశం పార్టీ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు పూర్తిగా నిరాశకు గురైనట్లు చెప్పారు. మీ నుంచి ఇలాంటి ప్రకటన వస్తుందని తాము ఊహించలేదన్నారు. రెండుసార్లు ప్రకటన చేసినా ఎందుకు సంతృప్తి లేదని జైట్లీ అడగ్గా.... ఇలాంటి డొల్ల ప్రకటనలతో ప్రజలను మోసపుచ్చలేరని వాదనకు దిగారు. రాజకీయ పార్టీలు ఉంటాయి పోతాయి... కానీ ప్రజలకు చట్టబద్ధంగా ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని పేర్కొన్నారు. అందుకు జైట్లీ స్పందిస్తూ... రెవెన్యూ లోటు, ఈఏపీలు మాత్రమే తన శాఖకు సంబంధించిన విషయాలని, అందుకే వాటిపై చెప్పానని, మిగిలిన అంశాలు విభిన్నశాఖల పరిధిలోకి వస్తాయి కాబట్టి ఆ శాఖలే చెపాల్సి ఉంటుందని పేర్కొన్నట్లు తెలిసింది.

రాజ్యసభలో కొనసాగిన నిరసన

ఈనాడు, దిల్లీ: రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల నిరసన గురువారమూ కొనసాగింది. సభ ప్రారంభం కాగానే తెదేపా సభ్యులు సీఎం రమేశ్, గరికపాటి మోహనరావు, తోట సీతారామలక్ష్మి, టీజీ వెంకటేశ్‌లు వెల్‌లోకి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ప్లకార్డుతో తన నిరసన కొనసాగించారు. బడ్జెట్‌పై కేంద్రసహాయ మంత్రి సుజనాచౌదరి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న సమయంలో వైకాపా సభ్యుడు విజయసాయిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో ఉండి బడ్జెట్ ఆమోదించి సభలో వ్యతిరేకత వ్యక్తం చేయడం సరికాదన్నారు. విజయసాయి రెడ్డి లేవనెత్తిన పాయింట్ ఆఫ్ ఆర్డర్‌పై ఛైర్మన్ వెంకయ్యనాయుడు స్పందిస్తూ... మంత్రివర్గంలో ఉన్నప్పటికీ సూచనలు చేయొచ్చు ఫర్వాలేదని చెప్పారు. సందిగ్ధ పరిస్థితుల్లో మంత్రి పరిష్కార మార్గం చూపించొచ్చన్నారు. తెలుగు ఎంపీల నిరసన రాత్రి సభ వాయిదా పడే వరకు కొనసాగించారు. ఏపీకి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఎంపీలు తమ కుర్చీల వద్దకు వెళ్లాలని పలుసార్లు ఛైర్మన్ సూచించారు.

రైల్వే జోన్‌పై ప్రకటన చేయాలి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే జోన్‌ను వెంటనే ప్రకటించాలని తెదేపా ఎంపీ రామ్మోహన్ నాయుడు డిమాండు చేశారు. ఇతర రాష్ట్రాల ప్రయోజనాలపైనే ఏపీ ఆధారపడాలా? అని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. జోన్ ప్రకటన చేసిన తర్వాత దానిపై ఎటువంటి చర్చ అయినా చేపట్టాలని కోరారు. గురువారం లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రామ్మోహన్ నాయుడు తన ప్రసంగాన్ని సభలో ఉంచారు.

ఏపీ ఎంపీల నిరసనల హోరు

- పార్లమెంటు ఉభయ సభల్లో ఆందోళన ఉద్ధృతం

ఈనాడు, దిల్లీ: లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల ఆందోళన మరింత ఉద్ధృతమైంది. గురువారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6.45 వరకూ వారు నిరసనలను కొనసాగించారు. పార్లమెంటు ప్రారంభం కాకముందు గాంధీ విగ్రహం ఎదుట, ప్రారంభమైన వెంటనే లోక్‌సభ వెల్‌లోకి వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. వారి ఆవేదనను కేంద్రం పెడచెవిన పెట్టినట్లు కనిపించింది. బడ్జెట్‌పై ప్రసంగించిన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గతంలో ఎన్నోసార్లు చెప్పిన మాటలనే పునరుద్ఘాటించి ఎంపీల ఆందోళనలను లెక్కచేయబోమన్న సంకేతమిచ్చి వెళ్లిపోయారు. తెలుగుదేశం ఎంపీలు గాంధీ విగ్రహం దగ్గర, వైకాపా ఎంపీలు గేట్-1 దగ్గర ఉదయం సమయంలో ధర్నాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ డిమాండ్లను వినిపిస్తూ నినదించారు. 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే వారంతా సభలోకి ప్రవేశించి వెల్‌లోకి వెళ్లిపోయారు. ఇందులో తోట నరసింహం, కేశినేని నాని, అవంతి శ్రీనివాస్, నిమ్మల కిష్టప్ప, కె.రామ్మోహన్ నాయుడు, రవీంద్ర, కొనకళ్ల నారాయణ, మాగంటిబాబు, శివప్రసాద్, మాల్యాద్రి, గల్లా జయదేవ్, రాయపాటి సాంబశివరావు పాల్గొన్నారు. వైకాపా నుంచి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాద్ వెల్‌లోకి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. 'వియ్ వాంట్... అని తెదేపా ఎంపీలు నినదిస్తున్నప్పుడు వారి వెనుక సీట్లో కూర్చున్న సోనియా గాంధీ 'జస్టిస్' అని చిన్నగా అనడం కనిపించింది. ఈ సమయంలోనే స్పీకరు సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాలను కొనసాగించారు. దీంతో తెదేపా ఎంపీలంతా 'అమ్మా నమస్కారం అంటూ చేతులెత్తి.. రాష్ట్రం మండుతోందని న్యాయం జరిగేలా చూడండని విజ్ఞప్తి చేశారు.

పుస్తకాలను ఎత్తుకెళ్లిన శివప్రసాద్: తెదేపా సభ్యులు ఆందోళన కొనసాగిస్తున్న సమయంలోనే స్పీకరు కార్యాలయ సిబ్బంది బల్లపై ఉన్న నిబంధనల పుస్తకాలను చిత్తూరు ఎంపీ శివప్రసాద్ ఎత్తుకెళ్లడం సభలో కలకలం రేపింది. స్పీకరు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్నట్లు మాట్లాడి అక్కడే ఉన్న నిబంధనల పుస్తకాల బండిల్‌ను ఎత్తుకొని వెళ్లారు. స్పీకరు జోక్యం చేసుకుని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు తెదేపా సభ్యులను తన కార్యాలయంలోకి పిలిపించుకున్న స్పీకరు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తెదేపా సభ్యులు ఆమెకు బదులిస్తూ.. 'మేమూ ఎంపీలమే. మామీద ఆగ్రహం వ్యక్తం చేయకండి. ప్రజల మనోభావాలను చెప్పడానికి మేం ఆందోళన చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించేంతవరకూ ఆందోళన కొనసాగుతుంది' అని చెప్పినట్లు తెలిసింది.

ఈ రోజెందుకు రారు..సోనియాతో తెదేపా ఎంపీలు: వాయిదా అనంతరం సభ పునఃప్రారంభం కావడానికి ముందు సోనియా వద్దకు తెదేపా ఎంపీలు కేశినేని నాని, అవంతి శ్రీనివాస్, పండుల రవీంద్ర బాబు వెళ్లి తమ ఆందోళనకు మద్దతివ్వాలని కోరారు. 'బుధవారం ప్రధాని ప్రసంగం సమయంలో కొంత విరామం ఇచ్చినప్పుడు మేం ప్రభుత్వంతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నామని ఆరోపిస్తూ మీరు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేశారు. ప్రధాని పదవికి గౌరవమిస్తూ ఆయన ప్రసంగానికి మేం అడ్డుతగల్లేదు. అప్పుడు ఆందోళన చేసిన మీరు ఇప్పుడెందుకు వెల్‌లోకి రారు' అని సోనియాతో కేశినేని నాని అన్నారు. అందుకు సోనియా స్పందిస్తూ.. మావాళ్లను వెల్‌లోకి వెళ్లమనే చెబుతున్నాం. వాళ్లే రావడం లేదు' అని సమాధానమిచ్చారు. మరోవైపు తెదేపా, వైకాపా ఎంపీలు ఆందోళన కొనసాగించారు. ప్రశ్నోత్తరాల సమయంలో గడ్కరీ మాట్లాడేటప్పుడు ఆయన ముఖం టీవీల్లో కనిపించకుండా ప్లకార్డులు అడ్డుపెట్టడానికి గల్లా జయదేవ్ ప్రయత్నించారు.



గురువారం పార్లమెంట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తెదేపా ఎంపీలు

గోవిందా.... గోవిందా... ఏపీ ప్యాకేజీ... గోవిందా, రైల్వే జోన్.. గోవిందా, కడప స్టీల్ ప్లాంట్.. గోవిందా, అమరావతి. అంటూ తెదేపా ఎంపీలు నినాదాలు చేశారు. ఏపీకి టోపీ పెడతారంటూ శివప్రసాద్ పాట పాడారు. నిమ్మల కిష్టప్ప డమరుకం లాంటి బొమ్మ పరికరాన్ని వాయిస్తూ నినాదాలు చేశారు. ఆ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్ లేచి ఇప్పటికే ఆర్థిక మంత్రి ఉభయ సభల్లో ప్రకటన చేశారని, ఈరోజు సాయంత్రం 5.30 గంటలకు బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చే సమయంలో తప్పకుండా మాట్లాడతారని, శాంతించాలని కోరారు. జైట్లీ సమాధానం ఇస్తారని అనంత కుమార్ చెప్పినప్పుడు సోనియా గాంధీ తన సీట్లోంచే 'ఎప్పుడు' అని ప్రశ్నించారు. శివప్రసాద్, పండుల రవీంద్ర, గల్లా జయదేవ్, తోట నరసింహం, కేశినేని నాని, అవంతి శ్రీనివాస్, రామ్మోహన్ నాయుడు కొద్దిసేపు వెల్‌లో అడ్డంగా పడుకుని ప్లకార్డులు చూపుతూ నిరసన కొనసాగించారు. సాయంత్రం 5 గంటల సమయంలో అరుణ్ జైట్లీ వద్దకు మంత్రి సుజనా చౌదరి వచ్చి తమ డిమాండ్లతో కూడిన పత్రాన్ని ఆయనకు అందించారు.

ముందు మా గురించే మాట్లాడండి: జైట్లీ బడ్జెట్‌పై చర్చకు సమాధానం చెప్పడానికి లేచినప్పుడు తెలుగుదేశం సభ్యులంతా ఆయన ముందు ప్లకార్డులు పట్టుకుని నిల్చొని నిరసన మొదలుపెట్టారు. రాష్ట్రంలో ఆందోళనలు కొనసాగుతున్నందున తొలుత ఏపీ గురించి మాట్లాడాలని శివప్రసాద్ కోరారు. జైట్లీ స్పందిస్తూ... తాను ఏపీపై మాట్లాడతానని బదులిచ్చారు. శివప్రసాద్ జోక్యం చేసుకుంటూ.. తొలుత ఆంధ్రాపైనే మాట్లాడాలని కోరారు. జైట్లీ అంగీకరించలేదు. మధ్యలో అద్వాణీ జోక్యం చేసుకుని ఆయన చెబుతారని తెలిపారు. జైట్లీ బడ్జెట్‌పై ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఐఎంఎఫ్ మదర్ ఆఫ్ ఆల్ డేటా అని అన్నప్పుడు టీఎంసీ సౌగత్ రాయ్, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గేలు నవ్వారు. అప్పుడు శివప్రసాద్ మేం ఇక్కడ ఆందోళనలు చేస్తుంటే అందరూ జోక్‌లేసుకుంటున్నారంటూవ్యాఖ్యానించారు. జైట్లీ బడ్జెట్‌పై మాట్లాడుతున్నప్పుడు.. రైల్వే మంత్రి గోయల్ కేంద్ర మంత్రి సుజనా చౌదరి పక్కన కూర్చొని ఏదో మాట్లాడుతూ కనిపించారు. ఏపీ గురించి పెద్దగా మాట్లాడతానన్నట్లు జైట్లీ తొలి నుంచీ ఊరిస్తూ వెళ్లారు. చివరకు పాతపాటే పాడారు. ఆయన ప్రసంగం విని తెదేపా, వైకాపా సభ్యులు ఉస్సూరుమన్నారు.

రాహుల్ నాకూ అధ్యక్షుడే: సోనియా

దిల్లీ: ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి, లౌకికత్వాన్ని, సహనశీలతను పెంపొందించేందుకు, దేశాన్ని ఆర్థిక పురోగతి బాటలో పయనించేలా చేసేందుకు వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఓడించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ అన్నారు. ఈ లక్ష్య సాధన కోసం భావసారూప్యం గల పార్టీలతో కలసి పనిచేస్తామని వెల్లడించారు. గురువారం సీపీపీ భేటీలో ఆమె ప్రసంగిస్తూ భాజపాపై, మోదీ ప్రభుత్వంపై విమర్శలను సంధించారు. ' 'రాహుల్ మీకే కాదు..నాకూ అధ్యక్షుడే. నాతో కలసి పనిచేసిన విధంగానే రాహుల్‌తోనూ అంతే అంకితభావం, విధేయతతో పనిచేస్తారని ఆశిస్తున్నాను'' అని సోనియా అన్నారు. దేశ రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా మారుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వాస్తవాలకు దూరంగా జరుగుతోందని, బుధవారం నాటి ప్రధాని ప్రసంగం దీనికి తార్కాణమని పేర్కొన్నారు.

1.10 లక్షల గ్రామాలను ఆప్టికల్ ఫైబర్‌తో అనుసంధానం: కేంద్రం

దిల్లీ: ''భారత్ నెట్'' ప్రాజెక్టులో భాగంగా 1.10 లక్షల గ్రామ పంచాయతీలను ఆప్టికల్ ఫైబర్‌తో అనుసంధానించామని లోక్‌సభకు కేంద్రం గురువారం తెలిపింది. కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లిఖిత పూర్వకంగా స్పందిస్తూ.. '2018 జనవరి 21 నాటికి 1,10,848 గ్రామాలను ఆప్టికల్ ఫైబర్‌తో అనుసంధానించాం. దీని కోసం 2,58,635 కి.మీ. ఆప్టికల్ ఫైబర్‌ను ఉపయోగించాం'అని ఆయన తెలిపారు. మార్చి 2019 కల్లా మిగతా 1.5 లక్షల గ్రామాలనూ అంతర్జాలంతో అనుసంధానించేందుకు భారత్ నెట్ రెండో దశను ప్రారంభించామని వివరించారు.

నమోదిత బయోమెట్రిక్ సాధనాలే వాడాలి

ఆధార్ ధ్రువీకరణ సంస్థలకు యూఐడీఏఐ ఆదేశం

ఈనాడు, దిల్లీ: వచ్చే నెల 1 నుంచి నమోదిత బయోమెట్రిక్ సాధనాలను మాత్రమే ఉపయోగించాలని ఆధార్ ధ్రువీకరణ సంస్థలకు.. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆదేశాలిచ్చింది. లేకుంటే సేవలకు అంతరాయం కలుగుతుందని స్పష్టంచేసింది. ''ప్రజల బయోమెట్రిక్ వివరాలను సేకరించేటప్పుడే ఎన్‌క్రిప్ట్ అయ్యేలా చూడటం కోసం నమోదిత పరికరాలనే ఉపయోగించడం చాలా అవసరం. నమోదు కాని పరికరాల వల్ల ప్రజల వ్యక్తిగత వివరాలకు ముప్పు ఏర్పడుతుంది'' అని యూఐడీఏఐ.. ఒక ప్రకటనలో పేర్కొంది.

పాత వాహనాల మార్పిడికి ప్రోత్సాహం!

ఈనాడు, దిల్లీ: వాహన కాలుష్యంలో అత్యధిక భాగం 15ఏళ్లకు మించిన వాహనాల నుంచే వెలువడుతోందన్న అంచనాల నేపథ్యంలో పాతవాటిని సాధ్యమైనంత త్వరగా రహదారులపై నుంచి తప్పించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేసేందుకు వాహన యజమానులకు ప్రోత్సాహం అందించాలని, పన్నుల భారంలో వెసులుబాటు కల్పించాలని భావిస్తోంది. దీని కోసం ''వాహన శ్రేణుల స్వచ్ఛంద ఆధునికీకరణ'' పేరుతో ఓ కొత్త కార్యక్రమాన్ని రూపొందించే యత్నంలో కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ఉంది. ''జీఎస్టీ ఆమోదం పొందటం ద్వారా పాత వాహనాల మార్పిడికి అయ్యే ప్రోత్సాహక వ్యయాన్ని కేంద్ర రాష్ట్రాలు సమంగా భరించే వీలుంటుంది. పాత వాహనాల విడిభాగాలను కొత్త వాహనాల తయారీలో వినియోగించుకోవచ్చు. దీనివల్ల కొత్త వాహనాల తయారీ వ్యయం 22 శాతం తగ్గుతుంది. మరో వైపు పాత వాహనాలను వదిలించుకోవటం వల్ల కాలుష్యాన్నీ నియంత్రించవచ్చు'' అని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

సచిన్ కుమార్తె పేరిట నకిలీ ట్విటర్ ఖాతా

ముంబయి: క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ కుమార్తె సారా తెందుల్కర్ పేరిట ట్విటర్‌లో నకిలీ ఖాతా సృష్టించిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సారా పేరిట ఉన్న ట్విటర్ ఖాతాలో.. ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను నిందిస్తూ గతేడాది అక్టోబరులో ట్వీట్ కనిపించింది. దీనిపై సచిన్ ప్రతినిధులు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ముంబయిలోని అంధేరీ ప్రాంతానికి చెందిన నితిన్ శిసోదె సచిన్ కుమార్తె పేరిట నకిలీ ఖాతా తెరిచి ట్వీట్లు చేసినట్లు గుర్తించారు. అతణ్ని అరెస్టు చేశారు. కొందరు బాలీవుడ్ ప్రముఖుల పేరిట కూడా నితిన్ ట్విటర్‌లో నకిలీ ఖాతాలు సృష్టించినట్లు విచారణలో బయటపడింది.

లాలు కుమార్తె, అల్లుడికి సమన్లు

దిల్లీ: బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలుప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి, అల్లుడు శైలేష్‌కుమార్‌కు ప్రత్యేక న్యాయస్థానం గురువారం సమన్లు జారీ చేసింది. మార్చి 5న తమ ముందు హాజరు కావాలని న్యాయమూర్తి ఎన్.కె.మల్హోత్ర ఆదేశించారు. హవాలా మార్గంలో అక్రమ లావాదేవీలు జరిపారని డిసెంబరు 23, 2017న ఈడీ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని పరిశీలించిన న్యాయమూర్తి పైమేరకు ఆదేశాలు జారీ చేశారు.

కాలమే సమాధానం చెబుతుంది: రజనీ

చెన్నై, న్యూస్‌టుడే: నటుడు కమల్‌హాసన్‌తో కలిసి రాజకీయ ప్రయాణం కొనసాగించే అంశానికి కాలమే సమాధానం చెబుతుందని సూపర్‌స్టార్ రజనీకాంత్ వ్యాఖ్యానించారు. గురువారం చెన్నైలోని తన నివాసం వద్ద రజనీకాంత్ విలేకరులతో ఆయన మాట్లాడారు. వ్యవస్థ బాగోలేదని గతంలో చేసిన వ్యాఖ్యలు తమిళనాడును ఉద్దేశించా? లేక దేశానికి వర్తిస్తాయా? అని పాత్రికేయులు ప్రశ్నించగా 'తమిళనాడు గురించే' అని బదులిచ్చారు. ముందు తమిళనాడులో వ్యవస్థను బాగు చేద్దామని తెలిపారు. కమల్‌హాసన్‌తో కలిసి రాజకీయ ప్రయాణం చేస్తారా? అని ప్రశ్నించగా ' 'కాలమే దానికి సమాధానం చెబుతుంది'' అని పేర్కొన్నారు.

మేధోసంపత్తిని పెంచే ఉపకారవేతన పథకం

దిల్లీ: ప్రతిష్ఠాత్మక సంస్థల బీటెక్ విద్యార్థులు ఐఐఎస్సీ, ఐఐటీల్లో పీహెచ్‌డీ చేసేందుకు చేయూతనిచ్చే ప్రధానమంత్రి ఉపకారవేతన పథకం ద్వారా మేధోసంపత్తి పెరుగుతుందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి ప్రకాశ్‌జావడేకర్ గురువారం తెలిపారు. 2018-19 నుంచి ఏడేళ్ల పాటు అమల్లో ఉండే ఈ (రూ. 1650 కోట్ల) పథకాన్ని కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదించింది. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు, ప్రముఖ విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన సిబ్బంది కొరతను అధిగమించడం ఈ పథకం లక్ష్యాలుగా మంత్రి వివరించారు. దీనిద్వారా ఐఐఎస్సీ, ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, ఐఐఐటీల్లో బీటెక్ పూర్తిచేసిన లేదా చివరి సంవత్సరం చదువుతున్నవారు.. సమీకృత ఎంటెక్, ఎంఎస్సీ విద్యార్థులు నేరుగా పీహెచ్‌డీ ప్రవేశాలు పొందవచ్చు. ఎంపికైన వెయ్యి మంది విద్యార్థులకు తొలి రెండేళ్లు, మూడు, నాలుగైదు సంవత్సరాల్లో వరుసగా నెలకు రూ. 70 వేలు, రూ. 75 వేలు, రూ. 80 వేలు వంతున అందజేస్తారు.

'ప్రజాస్వామ్య పద్ధతుల్లో తలాక్ బిల్లును ప్రతిఘటిస్తాం'

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: 'ముమ్మారు తలాక్' బిల్లులో చాలా లోపాలున్నాయని అఖిల భారత ముస్లిం పర్సనల్ న్యాయ మండలి (ఏఐఎంపీఎల్‌బీ) వ్యాఖ్యానించింది. వీటిని పరిష్కరించే వరకూ తాము కృషిచేస్తామని పేర్కొంది. బిల్లును స్వాగతిస్తున్నామని.. సవరణలు, మార్పులు తీసుకొస్తే ఆమోదిస్తామని ఏఐఎంపీఎల్‌బీ అధికార ప్రతినిధి మౌలానా సయ్యద్ ఖలీల్ ఉర్ రహమాన్ సజ్జాద్ నౌమానీ అన్నారు. తాము సూచించిన ప్రతిపాదనలు పట్టించుకోని పక్షంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో బిల్లును ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ కంచన్‌బాగ్‌లో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అధ్యక్షతన గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లు రాజ్యాంగం, ప్రాథమిక హక్కులతో పాటు మహిళలు, పిల్లల హక్కుల చట్టాలను ఉల్లంఘిస్తోందన్నారు.

తరలింపు తప్పని సరైతే.. సౌకర్యాలు కల్పించండి

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం వినతి

ఈనాడు, హైదరాబాద్: ఏపీ హైకోర్టును తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేయడం తప్పనిసరైతే.. తమ సౌకర్యాలను దృష్టిలో పెట్టుకోవాలని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు చల్లా ధనంజయ ఆధ్వర్యంలో ఏపీ హైకోర్టు భవనాల పరిశీలన కమిటీ ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎక్కడైతే శాశ్వత భవనం ఏర్పాటు చేయనున్నారో అక్కడికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో తాత్కాలిక భవనం ఉండేలా చూడాలని కోరారు. శాశ్వత నిర్మాణానికి పునాదిరాయి వేశాకనే తాత్కాలిక భవనంలోకి హైకోర్టు తరలింపు ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. తాత్కాలిక భవనంలోనూ సుమారు వేయి కార్లు, రెండువేల ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలం, 500 ఛాంబర్లకు తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

ప్రజలతో అనుసంధానమైతేనే గౌరవం

- మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ఉద్ఘాటన
- డాక్టర్ ఎం.ఎస్.సంజీవిరావు ప్రస్థానంపై పుస్తకం విడుదల

ఈనాడు - దిల్లీ

నియోజకవర్గ ప్రజలతో నిరంతరం అనుసంధానమైతేనే నాయకులకు గౌరవం, ప్రేమాభిమానాలు లభిస్తాయని మాజీ రాష్ట్రపతి డాక్టర్ ప్రణబ్ ముఖర్జీ పేర్కొన్నారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి అనేకసార్లు ఎంపీగా ఎన్నికైన డాక్టర్ ఎం.ఎస్.సంజీవి రావు (కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు తండ్రి) ప్రస్థానంపై రూపొందిన పుస్తకాన్ని గురువారం సాయంత్రం ప్రణబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ మధ్యనున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'చరవాణులు సయితం అందుబాటులోకి రాని రోజుల్లో డాక్టర్ సంజీవి రావు అప్రతిహతంగా కాకినాడ నుంచి ఎంపీగా భారీ ఆధిక్యాలతో ఎన్నికవుతూ వచ్చారు. దానికి కారణమేమిటని ఒకసారి ఆయన్ని అడిగాను. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండడమే విజయ రహస్యమని చెప్పారు. ఆయన మాటలు సమకాలీన రాజకీయ నాయకులందరికీ ఒక సందేశం. సంజీవిరావు మాదిరిగానే రాజకీయ నేతలంతా తమ ప్రజలతో అనుసంధానం కావాలి. అలాంటి బంధంతోనే వారు గౌరవాభిమానాలను సాధించగలరు' అని ప్రణబ్ చెప్పారు.



'ఏ కంట్రిబ్యూషన్ ఇన్ టైమ్ - ఇండియాస్ ఎలక్ట్రానిక్స్ రెవల్యూషన్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, మాజీ ప్రధాని మన్మోహన్, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

ఏపీ ఆధునికీకరణలో కీలకపాత్ర ఆయనదే

ఆంధ్రప్రదేశ్ ఆధునికీకరణలో సంజీవిరావుది కీలక పాత్ర అని ప్రణబ్ చెప్పారు. 'దేశాభివృద్ధికి శాస్త్రీయ జిజ్ఞాస అవసరమనే స్ఫూర్తిని పండిట్ నెహ్రూ నుంచి సంజీవిరావు పుణికి పుచ్చుకున్నారు. దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఇతర సాంకేతిక సంస్థల విస్తృతికి ఆయనెంతో కష్టపడ్డారు. దేశంలో టెలికాం పరిశ్రమ ఎదగడానికి శాం పిట్రోడాతో కలిసి తన వంతు కృషి చేశారు. ఇందిర, రాజీవ్‌గాంధీల ప్రభుత్వాల్లో మేమిద్దరం కలిసి పనిచేశాం. పళ్లంరాజుతోనూ కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింద'న్నారు. తన తండ్రి జీవితం యువతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పళ్లంరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఏపీ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సహా పలువురు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధిపై దృష్టి పెట్టాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

దిల్లీ: గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంపై దృష్టి సారించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఇందుకోసం పెద్ద కంపెనీలు జిల్లాలను దత్తతను తీసుకొని శిక్షణ ఇవ్వాలని సూచించారు. గురువారం సీఐఐ, నీతి ఆయోగ్‌లు నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు జీవనోపాధితో పాటు ఆత్మగౌరవం, స్వయం ఉపాధి, అభివృద్ధి, అవకాశాలపై కూడా దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించేంతవరకు వలసలు ఆపలేమని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు జీవనోపాధి కల్పించేలా విధానాలు, శిక్షణ ఉండాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పన ప్రభుత్వం, పరిశ్రమల ఉమ్మడి బాధ్యతగా ఉండాలని చెప్పారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రసంగిస్తూ దేశంలోని యువతను సంపదగా మార్చుకోవాల్సి ఉందన్నారు. నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ మాట్లాడుతూ యువత కోరుకునే ఉద్యోగం లభించేలా విధానాలు రూపొందించే పనిలో ఉన్నామన్నారు.

దేశ భద్రత పాఠాలు ప్రణబ్ నుంచి నేర్చుకోండి: జైట్లీ

దిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో చీకటి వ్యవహారం ఉందంటూ ఆరోపణలు సంధిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మండిపడ్డారు. విమానాల కొనుగోలు విలువను వెల్లడించాలంటూ దేశ భద్రతతో ముడిపడిన అంశాలను ఆ పార్టీ నేతలు ప్రస్తావించటం సరికాదని హితవు పలికారు. ఈ విషయంలో గతంలో రక్షణ మంత్రిగా పనిచేసిన ప్రణబ్ ముఖర్జీ నుంచి పాఠాలు నేర్చుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు గురువారం లోక్‌సభలో జైట్లీ సమాధానమిస్తూ ''గతంలో మీ పార్టీ ప్రభుత్వానికి అవినీతి కళంకం అంటింది. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వానికి ఆ తరహా మరకలు అంటించాలని యత్నిస్తున్నారు. మాకు వ్యతిరేకంగా ఏమీ కనుగొనలేక రాఫెల్ ధరను వెల్లడించాలని కోరుతున్నారు'' అంటూ చురకలు వేశారు. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్ రాజీ పడుతోందని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వాల్లో రక్షణ శాఖ మంత్రులుగా ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోనీలు ఉన్న సమయంలో ఆయుధ వ్యవస్థల ఒప్పంద వివరాలు వెల్లడించటం దేశ భద్రత ప్రయోజనాలకు మంచిది కాదని 15 సందర్భాల్లో పార్లమెంటుకు తెలిపారని ఆయన గుర్తు చేశారు.

ఏదో మతలబు ఉంది.. రాహుల్: ఎన్డీయే ప్రభుత్వంపై దాడిని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం కూడా కొనసాగించారు. రాఫెల్ ఒప్పందంపై తాను అడిగిన ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానమివ్వటంలేదని, దీనిలో ఏదో మతలబు ఉందని రాహుల్ అన్నారు. అవినీతికి పాల్పడిన వారిని రక్షించాలని ప్రధాని భావిస్తున్నట్లుందని ఆరోపించారు. రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ రాఫెల్ విమానాల ధరను వెల్లడిస్తానని తొలుత ప్రకటించారని, ఇప్పుడేమో అధికారిక రహస్యమని దాటవేస్తున్నారని... ఈ రెండు ప్రకటనల్లో ఏది సరైనదని పార్లమెంటు వెలుపల రాహుల్ ప్రశ్నించారు. అనంతరం ఓ ట్వీట్‌లో ''అవినీతి వెల్లడి కాకూడదనో, ప్రధానినో ఆయన మిత్రుడినో రక్షించాలని ఆమె మనసు మార్చుకున్నారేమో''నని పేర్కొన్నారు.

'మాణిక్' వద్దు...'హీరా'ను తీసుకోండి

- త్రిపుర సర్కార్‌పై మోదీ విమర్శలు

సోనాముర, కైలాశహర్(త్రిపుర): మాణిక్ సర్కార్ ఆధ్వర్యంలోని వామపక్ష ప్రభుత్వాన్ని విసిరికొట్టి 'హీరా' (వజ్రం)ను తెచ్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. త్రిపుర రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం రంగమటియా మదరస్సా ఆవరణ, కైలా శహర్‌లలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. అదృష్టం మారాలన్న ఆశతో ప్రజలు 'మాణిక్యాన్ని' ధరిస్తారని, కానీ ఈ మాణిక్ వారి జీవితాలను మార్చలేకపోయారని విమర్శించారు. అందువల్ల ఈ సర్కారును తొలగించాలని కోరారు. రాష్ట్ర ప్రగతికి హీరా (హెచ్.ఐ.ఆర్.ఎ) అవసరమని అన్నారు. హీరాలో.. హెచ్ అంటే హైవేస్ (జాతీయ స్థాయి రహదారులు), ఐ అంటే ఇంటర్నెట్ (అంతర్జాలం), ఆర్ అంటే రోడ్‌వేస్ (రహదారి మార్గాలు), ఎ అంటే ఎయిర్‌వేస్ (వాయు మార్గాలు) అని వివరించారు. త్రిపుర చాలాకాలంగా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, తాము రవాణా సౌకర్యాలు విస్తరించడం ద్వారా ఈ రాష్ట్రం రూపురేఖలు మార్చాలని భావిస్తున్నట్టు చెప్పారు. అందుకోసమే హీరాను తీసుకొచ్చామని అన్నారు. 'మాణిక్‌ను తీసివేసి 'హీరా'ను ధరించాలని కోరారు.



గురువారం త్రిపురలోని కైలాశహర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

త్రిపుర ప్రజలను బానిసలుగా మార్చిన కమ్యూనిస్టులు: త్రిపుర రాష్ట్ర ప్రజలను కమ్యూనిస్టులు బానిసలుగా మార్చారని, భయభ్రాంతుల్లో నెట్టారని మోదీ ఆరోపించారు. 'ఎవరికైనా రేషన్ కార్డు కావాలంటే పార్టీ ఆఫీసుకు వెళ్లాలి. ఎవరైనా హత్యకు గురయితే సీపీఎం నాయకులు అనుమతి లేనిదే పోలీసులు కేసు నమోదు చేయరు. అన్నింటికీ తమపైనే ఆధారపడేలా కమ్యూనిస్టులు ప్రజలను బలవంతం చేస్తున్నారు. ఇది కొత్త తరహా బానిసత్వమ'ని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేశారని అన్నారు.

త్రిపురకు మూడు 'టి'లు కావాలి: త్రిపుర 'టి' (తేనీరు)కు మంచి పేరుందని, రాష్ట్రం అభివృద్ధికి మరో మూడు 'టి'లు కావాలని మోదీ అన్నారు. ట్రేడ్ (వాణిజ్యం), టూరిజం (పర్యాటకం), ట్రైనింగ్ (శిక్షణ) అవసరమని తెలిపారు. కేంద్రం పంపిస్తున్న నిధులను రాష్ట్రం ఖర్చు చేయడం లేదని, వ్యయం వివరాలను కూడా పంపడం లేదని అన్నారు. రోజ్‌వ్యాలీ చిట్‌ఫండ్ కుంభకోణంలో మాణిక్ సర్కార్ ప్రభుత్వానికి సంబంధం ఉందని ఆరోపించారు.

వేతన జీవులు, వయోధికులకు రూ.12వేల కోట్ల వరకూ లబ్ధి: జైట్లీ

దిల్లీ: కొత్త బడ్జెట్‌లో వేతన జీవులు, వృయోధికులకు రూ.12వేల కోట్ల వరకు ఉపశమనం కలిగించామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను విధింపును ఆయన సమర్థించుకున్నారు. లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు గురువారం ఆయన సమాధానమిస్తూ పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల దీర్ఘకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని, వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మన దేశం నిలుస్తుందని తెలిపారు. ఎన్డీయే అధికారం చేపట్టిన తర్వాత ఎన్నో విషయాల్లో మార్పు వచ్చిందన్నారు.

రేణుక నవ్వు వివాదంతో రాజ్యసభ వాయిదా

దిల్లీ: కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి పార్లమెంటులో నవ్వినతీరుపై ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్య దుమారం రేపుతోంది. రామాయణం ధారావాహిక తర్వాత 'అలాంటి' నవ్వును ఇప్పుడూ చూస్తున్నానంటూ బుధవారం పార్లమెంటులో ప్రధాని చేసిన వ్యాఖ్యను కాంగ్రెస్ సభ్యులు గురువారం రాజ్యసభలో లేవనెత్తి ఆందోళన చేపట్టారు. స్త్రీలను చిన్నచూపు చూసే విధంగా, రోత పుట్టించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయనీ, వాటిని ఉపసంహరించుకుని, ప్రధాని క్షమాపణలు కోరాలనీ వారు పట్టుపట్టారు. ఈ వివాదంతో సభ వాయిదా పడింది. తనపై మోదీ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యపై వీడియోను ట్వీట్ చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజీజుపై హక్కుల తీర్మానం ప్రవేశపెడతానని రేణుక విలేకరులకు చెప్పారు. ఆగ్రహం కలిగించే రీతిలో ఆమె నవ్వినా మోదీ ఎంత ప్రశాంతంగా ఉన్నారో చెప్పడానికే ఆ వీడియోను పంచుకున్నానని రిజీజు వివరించారు. సభలో సభ్యురాలిపై సాక్షాత్తూ ప్రధాని అలా వ్యాఖ్యానించడం అభ్యంతరకరమనీ, ఇవి దిగ్భ్రాంతి కలిగించాయనీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుమిత్రాదేవ్ చెప్పారు. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యల్ని భాజపా తిప్పికొట్టింది. పార్లమెంటరీ సంప్రదాయాలను అగౌరవపరిచేలా రేణుక వ్యవహరించారని పార్టీ ప్రధాన కార్యదర్శి భూపేందర్ యాదవ్ ప్రత్యారోపణ చేశారు. ప్రధాని ప్రసంగిస్తుండగా అలా నవ్వడం సభా మర్యాద కాదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, పార్టీ నేత సహస్రబుద్ధే పేర్కొన్నారు.

ఖలీదా జియాకు అయిదేళ్ల జైలు శిక్ష

- బంగ్లా మాజీ ప్రధానికి, మరో అయిదుగురికి శిక్షలు ఖరారు
- అవినీతి కేసులో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెల్లడి
- సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం!

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియా (72) అవినీతికి పాల్పడినందుకు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించాలని ఢాకాలోని ప్రత్యేక న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది. డిసెంబరులో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ఆమె అనర్హురాలవుతారని భావిస్తున్నారు. దివంగతుడైన తన భర్త జియాఉర్ రెహ్మాన్ పేరుతో 'జియా అనాథల ట్రస్టు'ను ఖలీదా ఏర్పాటు చేశారు. దాని ద్వారా 2.10 కోట్ల టాకాల (సుమారు 2.50 లక్షల డాలర్లు/ లేదా రూ.1.67 కోట్లు) విదేశీ విరాళాలను అక్రమంగా కాజేసినట్లు ఆమెపై అభియోగాలున్నాయి. పలాయనంలో ఉన్న జియా తనయుడు తారిఖ్ రెహమాన్ (బంగ్లాదేశ్ జాతీయ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు) సహా మరో అయిదుగురికి ఇదే కేసులో పదేళ్ల చొప్పున జైలు శిక్షలు పడ్డాయి. ట్రస్టు నుంచి 2.15 కోట్ల టాకాలు (సుమారు రూ.1.85 కోట్లు) దిగమింగిన కేసులోనూ ఆమె నిందితురాలు. ఇలాంటి 20కి పైగా కేసులు జియాపై ఉన్నాయి. ఖలీదా జియా ఆరోగ్య పరిస్థితి, సామాజిక స్థితి దృష్ట్యా తక్కువ శిక్షనే విధిస్తున్నట్లు న్యాయమూర్తి మహమ్మద్ అఖ్తరుజ్జమాన్ ప్రకటించారు. తెల్లచీర, నల్ల కళ్లద్దాలు ధరించి న్యాయస్థానానికి హాజరైన ఆమె... తీర్పును వింటూనే ఖిన్నురాలయ్యారు.



శిక్ష పడిన రెండో ప్రభుత్వాధినేత ఆమె: బంగ్లాదేశ్‌కు ప్రధానిగా ఖలీదా జియా మూడుసార్లు ఎన్నికయ్యారు. రాజకీయవేత్తగా మారిన నియంత హెచ్.ఎం.ఎర్షాద్‌కూ అవినీతి కేసులో శిక్షపడనుంది. ఆ రకంగా బంగ్లాదేశ్‌లో అవినీతి కేసుల్లో శిక్షలు పడిన ప్రభుత్వాధినేతల్లో ఆమె రెండో వ్యక్తి అవుతారు. తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని జియా తరఫు న్యాయవాదులు చెప్పారు. జియా స్థాయి దృష్ట్యా కారాగారంలో అన్ని సదుపాయాలూ కల్పిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆమెను తరలిస్తున్నప్పుడు పలుచోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

బ్రిటన్ గణిత ప్రతిభా పోటీలో భారత సంతతి చిన్నారి సత్తా

లండన్: చిన్నారుల కోసం ఉద్దేశించిన గణితశాస్త్ర ప్రతిభా పోటీలో.. ఎనిమిదేళ్ల భారత సంతతి బాలిక సత్తా చాటింది. 'యూకే మ్యాథ్స్ హాల్ ఆఫ్ ఫేమ్' ఆన్‌లైన్ పోటీలో వివిధ దేశాల విద్యార్థులతో పోటీపడి.. సోహినీ రాయ్ చౌధరి 'లీడర్ బోర్డ్'లో చోటు సాధించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వంద మందికే.. ఈ లీడర్ బోర్డ్ జాబితాలో స్థానం ఉంటుంది. దిల్లీలో పుట్టిన సోహినీ.. బ్రిటన్‌లోని నెల్సన్ ప్రైమరీ స్కూల్‌లో చదువుకుంటోంది.

రేపు భూమికి చేరువగా గ్రహశకలం

ప్రమాదమేమీ లేదు: శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: గ్రహశకలం ఒకటి భూమికి చేరువగా రాబోతోంది. అయితే దీనివల్ల ప్రమాదమేమీ లేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నేల నుంచి 64 వేల కిలోమీటర్ల దూరంలో దీని ప్రయాణం సాగుతుందని చెప్పారు. 15-40 మీటర్ల వెడల్పు కలిగిన ఈ ఖగోళవస్తువును 2018సీబీ అని పిలుస్తున్నారు. ఇది.. ఈ వారంలో భూమికి చేరువగా వస్తున్న రెండో గ్రహశకలం. మొదటి దాన్ని ఈ నెల 4న కనుగొన్నారు. దాన్ని 2018 సిసిగా పిలుస్తున్నారు. 15-30 మీటర్ల పరిమాణం కలిగిన ఈ ఖగోళవస్తువు ఈ నెల 6న భూమికి 1.84 లక్షల కిలోమీటర్ల దూరంలో నుంచి వెళ్లింది. దానితో పోలిస్తే 2018సీబీ.. మరింత చేరువగా వస్తుంది. భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున 4.00 గంటలకు ఇది భూమికి గరిష్ఠస్థాయిలో దగ్గరవుతుంది. ఆ దూరం.. భూమికి, చంద్రుడికి మధ్య ఉన్న దూరంలో ఐదో వంతు. ఈ గ్రహశకలం చిన్నగా ఉన్నప్పటికీ, 2013లో రష్యాలోని చెల్యాబిన్స్క్‌లో విధ్వంసం సృష్టించిన ఖగోళవస్తువు కన్నా చాలా పెద్దదని నాసా శాస్త్రవేత్త పాల్ చోడాస్ పేర్కొన్నారు. ఇంత పెద్ద గ్రహశకలాలు ఏడాదికి ఒకటి, రెండు సార్లు మాత్రమే భూమికి చేరువవుతాయని తెలిపారు.



చెన్నై విమానాశ్రయంలో పేలిపోయిన విమానం టైరు

త్రుటిలో తప్పిన విమాన ప్రమాదం

ఎగిరే ముందు పేలిపోయిన టైరు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై నుంచి 199 మంది ప్రయాణికులతో దిల్లీ బయలుదేరిన స్పైస్ జెట్ విమానం రన్‌వేపై వెళ్తుండగా టైరు పేలింది. గురువారం జరిగిన ఈ ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. భారీ శబ్దంతో టైరు పేలడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అనంతరం సిబ్బంది విమానాన్ని నిలిపివేశారు. సహాయక బృందాలు వచ్చి ప్రయాణికులను సురక్షితంగా విమానాశ్రయంలోకి పంపాయి.

ఉగ్రవాదుల పట్ల పాక్‌ది ఉదాసీన వైఖరి

- భారత్, అఫ్గానిస్థాన్‌లను అస్థిర పరుస్తోంది
- ఆర్థికసాయం నిలిపివేయడం సబబే
- విరుచుకుపడిన అమెరికా కాంగ్రెస్ కమిటీ

వాషింగ్టన్: ఉగ్రవాదులు.. అఫ్గానిస్థాన్‌ను అస్థిర పరుస్తున్నా, భారత్‌లో దాడులకు పాల్పడుతున్నా పాకిస్థాన్ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని అమెరికా సెనెట్ సభ్యులు విమర్శించారు. ఆ దేశానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆర్థికసహాయాన్ని నిలిపివేయడం సబబేనన్నారు. అమెరికా, పాకిస్థాన్‌ల మధ్య ఉగ్రవాద వ్యతిరేక సహకారం ప్రధానమని, ఇస్లామాబాద్ అంకితభావం చూపలేదన్నారు. టెడ్ యోహో అధ్యక్షతన విదేశీ వ్యవహారాలపై నిర్వహించిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పలువురు ఎంపీలు పాల్గొన్నారు. వాస్తవమేంటో అమెరికా గ్రహిస్తోందని, ఇరు దేశాల సంబంధాలు మారాల్సిన అవసరం ఉందని టెడ్ యోహో పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్, భారత్‌కు సంబంధించి పాకిస్థాన్ విదేశాంగ విధానంలో సైన్యానిదే పైచేయిగా కనిపిస్తోందని బ్రాడ్ షెర్మన్ అన్నారు. పాకిస్థాన్‌ను పంజాబీలు ఉక్కుపిడికిలితో పరిపాలిస్తున్నారని, వారి ప్రజల పాలిట వారే ఉగ్రవాదులని, అవినీతిపరులని డానా రోహ్రాబెచర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.


ఆ ముగ్గురూ ప్రపంచ ఉగ్రవాదులు: పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న, సహకరిస్తున్న ముగ్గురు తీవ్రవాదులపై అగ్రరాజ్యం కన్నెర్రజేసింది. రహ్మాన్ జెబ్ ఫకీర్ ముహమ్మద్, హిజ్బుల్లా అస్తాం ఖాన్, దిలావర్‌ఖాన్ నాదిర్‌ఖాన్ అనే ముగ్గుర్ని ప్రపంచ ఉగ్రవాదులుగా ప్రకటించింది. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, గల్ఫ్‌లో అల్‌ఖైదా, లష్కరే తోయిబా, తాలిబన్ ఉగ్రవాద సంస్థల కోసం విరాళాలు పోగు చేస్తున్నారని, ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారని, విధ్వంసకర ఆయుధాలను సరఫరా చేస్తున్నారని అమెరికా ట్రెజరీ శాఖ కార్యదర్శి సైగల్ మండేల్కర్ తెలిపారు. ఇలాంటి ప్రమాదకర వ్యక్తులకు, సంస్థలకు పాకిస్థాన్ ఆశ్రయం కల్పించకూడదన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న అమీనుల్లా అనే కరడుగట్టిన ఉగ్రవాదికి ఈ ముగ్గురూ సహకరిస్తున్నారు.

సీబీఐ రహస్య నివేదిక మీ ఇంటికి ఎలా చేరింది?

- చిదంబరాన్ని ప్రశ్నించిన భాజపా ఎంపీ
- రాజ్యసభలో గందరగోళం

దిల్లీ: సీబీఐకి సంబంధించిన ఒక రహస్య నివేదిక.. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఇంటికి ఎలా చేరిందని భాజపా సభ్యుడు భూపేంద్ర యాదవ్ గురువారం రాజ్యసభలో ప్రశ్నించారు. దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రాజ్యసభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. బడ్జెట్‌పై చర్చలో భాగంగా చిదంబరం తన ప్రసంగాన్ని ముగించిన వెంటనే యాదవ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. యూపీఏ హయాంలో కీలక మంత్రిత్వశాఖలను నిర్వహించిన చిదంబరం దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఆగ్రహం చెందిన కాంగ్రెస్ సభ్యులు.. వెల్‌లోకి దూసుకెళ్లారు. మోదీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యాదవ్.. వ్యక్తిగత ఆరోపణలు చేశారని, రికార్డుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ డిమాండ్ చేశారు. రికార్డులను పరిశీలించి ఒక నిర్ణయం తీసుకుంటామని సభాధ్యక్ష స్థానంలో ఉన్న రంగరాజన్ చెప్పారు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందంపై దర్యాప్తునకు సంబంధించిన ఈ ముసాయిదా నివేదికను 2013లో సీబీఐ రూపొందించింది. గత నెల 13న దిల్లీలోని చిదంబరం కుటుంబానికి చెందిన ఒక ప్రాంగణంలో ఈడీ అధికారులు దీన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ రోజున వారు దిల్లీ, చెన్నైల్లో చిదంబరం కుమారుడు కార్తి చిదంబరానికి సంబంధించిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించారు.

అంతర్గత దర్యాప్తు జరుపుతున్న సీబీఐ: సదరు నివేదిక.. చిదంబరం ఇంటికి ఎలా చేరిందన్నదానిపై సీబీఐ అంతర్గత దర్యాప్తు జరుపుతోంది. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ వ్యవహారంపై తాము 2013లో సుప్రీం కోర్టుకు ఒక ముసాయిదా నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించినట్లు సీబీఐ వర్గాలు తెలిపారు. అందులోని అంశాలు.. చిదంబరం ఇంట్లో స్వాధీనం చేసుకున్న నివేదికలోని అంశాలతో సరిపోలాయని వివరించాయి. దర్యాప్తు అధికారులు తనను సంప్రదించినప్పుడు స్పందించాలని చిదంబరం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



102.34 క్యారెట్ల బరువైన ఈ వజ్రాన్ని సోథిబే సంస్థ లండన్‌లో వేలానికి పెట్టింది. ప్రపంచంలోనే బరువైన వజ్రాల రంగు, స్పష్టత అంశాల్లో మేలైనదిగా గుర్తింపు ఈ వజ్రం వేలంలో రూ.200కోట్లు పలుకవచ్చని అంచనా.

ఛాంపియన్స్



ఇలాగే ఇంకో నాలుగైదేళ్లు..

కేప్‌టౌన్: ఫార్మాట్‌తో సంబంధం లేకుండా, స్వదేశం విదేశం అని తేడా లేకుండా భీకర ఫామ్‌లో కొనసాగుతూ పరుగుల వరద పారిస్తున్న విరాట్ కోహ్లి.. తాను ఇంకో నాలుగైదేళ్లు ఇప్పుడున్న తీవ్రతతోనే ఆడాలనుకుంటున్నట్లు చెప్పాడు. "ఈ ఏడాది నాకు 30 ఏళ్లు పూర్తవుతాయి. 34-35 ఏళ్ల వరకు ఇదే తరహాలో ఆడాలనుకుంటున్నా. అందుకే నేనెంతో శ్రమిస్తాను. ఎప్పుడూ ఒకే తీవ్రతతో ఆడాలనుకుంటాను. అది పోతే మైదానంలో నేనెలా ఉంటానో తెలియదు. అందుకే ఆ తీవ్రత కొనసాగాలని కోరుకుంటున్నా. మ్యాచ్‌కు సన్నద్ధం కావడం, సరైన తిండి తినడం.. ఇలాంటివన్నీ జాగ్రత్తగా చూసుకుంటా. జట్టు కోసం నా వల్ల అయిందంతా చేయడానికి ప్రయత్నిస్తా" అని విరాట్ చెప్పాడు. మూడో వన్డేలో సాధించిన శతకం కోసం కొంచెం ఎక్కువగానే కష్టపడ్డట్లు కోహ్లి తెలిపాడు.



నమ్మశక్యంగా లేదు: దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో భారత యువ స్పిన్నర్లు యుజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్‌ల బౌలింగ్ సాగుతున్న తీరు తనకు నమ్మశక్యంగా అనిపించడం లేదని కోహ్లి అన్నాడు. "సొంతగడ్డపై బ్యాటింగ్‌కు అనుకూలించే వికెట్ల మీదా వాళ్లిద్దరూ చక్కటి ప్రదర్శన చేశారు. టీ20ల్లో క్రమం తప్పకుండా వికెట్లు తీశారు. కాబట్టి ఇక్కడా రాణిస్తారనే అనుకున్నాం. ఐతే ఈ స్పిన్ ద్వయం ప్రత్యర్థిని ఏమాత్రం నిలువనీయకుండా చేస్తుండటం అమోఘం. మూడో వన్డేలోనూ వీళ్లిద్దరే ఎనిమిది వికెట్లు పంచుకున్నారు. ఇది నమ్మశక్యంగా అనిపించట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరు స్పిన్నర్లు ఇంత గొప్పగా బౌలింగ్ చేయడం ఇంతకుముందెన్నడూ చూడలేదు. వీరి బౌలింగ్‌ను వర్ణించడానికి మాటల్లేవు. చాహల్, కుల్‌దీప్ ధైర్యవంతులైన బౌలర్లు. ప్రతి ఓవర్లోనూ బ్యాట్స్‌మెన్‌కు ప్రశ్నలు సంధిస్తారు. వికెట్లు తీయగలిగే బంతులు రెండు మూడు విసురుతారు. బంతిని చాలా సేపు గాల్లో ఉంచుతారు. బ్యాట్స్‌మెన్ షాట్లు ఆడేలా పురిగొల్పుతారు. అప్పుడప్పుడు వీరి బౌలింగ్‌లో సిక్స్ కొట్టొచ్చు. కానీ వాళ్లు బెదిరే రకం కాదు. ప్రస్తుత సిరీస్‌లో రెండు జట్లకు మధ్య తేడా వీళ్లే" అని కోహ్లి అన్నాడు.

విరాట్ ఒక మేధావి



"నా దృష్టిలో గొప్ప బ్యాట్స్‌మన్ అంటే కోహ్లీలా బౌలర్ల బలాలు, బలహీనతల్ని బట్టి టెక్నిక్‌ను మార్చుకోవాలి. విరాట్ ఒక మేధావి. ప్రస్తుతం అతనే ప్రపంచ అత్యుత్తమ బ్యాట్స్‌మన్. కోహ్లి బ్యాటింగ్ విధానమే ప్రతిసారీ అతను ఎక్కువ పరుగులు చేయడానికి అవకాశమిస్తోంది. టెక్నిక్ బాలేకుంటే ఎప్పుడో ఒకసారి బాగా ఆడి.. మిగతా సమయాల్లో విఫలమవుతారు. నిలకడగా పరుగులు సాధించాలంటే టెక్నిక్ కోహ్లి తరహాలో ఉండాలి. అతనో పరిపూర్ణ ఆటగాడు. అందుకే పిచ్ ఎలా ఉన్నా అతడికి ఇబ్బంది ఉండదు"

– పాకిస్థాన్ మాజీ కెప్టెన్ మియాందాద్



డివిలియర్స్ వచ్చేస్తున్నాడు

జొహానెస్‌బర్గ్: భారత్‌తో వన్డే సిరీస్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న దక్షిణాఫ్రికాకు స్వల్ప ఊరట! ఆ జట్టు స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ వేలి గాయం నుంచి కోలుకున్నాడు. అతను మళ్లీ జట్టులోకి వచ్చాడు. ఏబీ చివరి మూడు వన్డేలకు అందుబాటులో ఉంటాడు. టెస్టు సిరీస్‌లో ఆడిన డివిలియర్స్ తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ భారత్.. దక్షిణాఫ్రికాను సునాయాసంగా ఓడించింది. ఏబీ రాక.. ఏకపక్షంగా సాగుతున్న సిరీస్‌పై మళ్లీ ఆసక్తిని పెంచేదే. తొలి వన్డే తర్వాత డుప్లెసిస్, రెండో వన్డే తర్వాత డికాక్ కూడా గాయాలతో సిరీస్‌లో మిగతా మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. డుప్లెసిస్ స్థానంలో రెండు, మూడు వన్డేలకు యువ ఆటగాడు మార్‌క్రమ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. మిగతా మూడు మ్యాచ్‌ల్లో ఏబీ కెప్టెన్సీ చేపట్టే అవకాశముంది. జోహానెస్‌బర్గ్‌లో శనివారం నాలుగో వన్డే జరగనుంది.

ఏబీ.. కోహ్లీలా ఆడాలి


సౌరభ్ గంగూలీ

టెస్టు సిరీస్ ఓడాక కూడా ఆరు వన్డేల సిరీస్ తొలి మూడు మ్యాచ్‌ల్లో గెలిచి 3-0 ఆధిక్యం సాధించడం అమోఘం. ఇది కోహ్లి, అతడి సహచరుల దృఢమైన వ్యక్తిత్వాన్ని చాటుతుంది. ఇక విరాట్ గురించి ఏమని చెప్పాలి? నేను సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్, సెహ్వాగ్, పాంటింగ్, లారా లాంటి వాళ్లతో ఆడటం నా అదృష్టం. ఇతనూ వాళ్ల స్థాయి వాడే. కేవలం అతడి నియంత్రణ, పరిస్థితులకు తగ్గట్లు సర్దుబాటు చేసుకునే సామర్థ్యం మాత్రమే కాదు ప్రతి మ్యాచ్‌లోనూ అతడి శక్తి సామర్థ్యాలు, చూపించే తీవ్రత నాకు గొప్పగా అనిపిస్తాయి. కోహ్లి స్థాయిలోనే చాహల్, కుల్‌దీప్ కూడా ప్రశంసలకు అర్హులు. వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా కోల్పోయిన 30 వికెట్లలో 21 వీళ్ల ఖాతాలోకే చేరాయి. ఈ గణాంకాల కంటే కూడా దక్షిణాఫ్రికా బ్యాటింగ్ లైనప్ మీద వీళ్లిద్దరూ చూపుతున్న మానసిక ప్రభావం చర్చనీయాంశం. పిచ్‌లు పూర్తిగా స్పిన్‌కు అనుకూలించకపోయినా వీళ్లిలా చెలరేగడం ఎక్కువ సంతృప్తినిస్తోంది. బుధవారం తాత్కాలిక కెప్టెన్ మార్‌క్రమ్ ఔటైన తీరు.. భారత స్పిన్నర్లతో మానసిక యుద్ధంలో దక్షిణాఫ్రికా ఓడిపోయిందనడానికి రుజువు. సిరీస్‌లో ఇంకో మూడు మ్యాచ్‌లు మిగిలుండగా.. డివిలియర్స్ పునరాగమనం దక్షిణాఫ్రికాకు ఊరటనిచ్చే విషయం. అతడి రాక దక్షిణాఫ్రికా రాతను మార్చేస్తుందని అనుకోను. అయితే అతను కోహ్లీలా ఆడే ప్రయత్నం చేయాలి. తుది జట్టు ఎంపికలో దక్షిణాఫ్రికా తీరు ఆశ్చర్యపరుస్తోంది. మోర్నీ మోర్కెల్‌ను పక్కన పెట్టడమేంటో అర్థం కావడం లేదు. తర్వాతి మూడు మ్యాచ్‌ల్లో అతను కచ్చితంగా ఆడాలి.

బుమ్రా ఐపీఎల్ వదిలేసి..



"నేరుగా వికెట్లకు బంతి వేసే బుమ్రా ఇంగ్లాండ్ పిచ్‌లపై రాణించలేడు. టీమ్‌ఇండియా క్రికెటర్లను కౌంటీల్లో ఆడేందుకు బీసీసీఐ అనుమతించడం లేదు. ఏటా కనీసం నెల పాటు కౌంటీ క్రికెట్ ఆడితే బుమ్రా మరింత అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. ఐపీఎల్‌కు విరామం ఇచ్చి కౌంటీ క్రికెట్ ఆడమని బుమ్రాకు బోర్డు చెప్పాలి. బుమ్రా తన టెస్టు కెరీర్‌ను గొప్పగా ఆరంభించాడు. క్రీజుకు దూరంగా బంతిని వేసి స్వింగ్ చేయగలిగే సామర్థ్యాన్ని అతను అందిపుచ్చుకోవాలి. అదే అతను వికెట్లు మరింతగా తీయడానికి ఉపయోగపడుతుంది. దానికి బుమ్రా మణికట్టును కొద్దిగా వాడాలి" – పాక్ మాజీ పేసర్ వసీం అక్రమ్



'ఈనాడు'తో రవీంద్ర జడేజా

వాళ్లలా తిప్పలేం..

వేళ్లతో బంతిని తిప్పే తనలాంటి స్పిన్నర్లతో పోలిస్తే.. మణికట్టు స్పిన్నర్లకు చాలా అనుకూలతలు ఉంటాయని రవీంద్ర జడేజా అన్నాడు. వాళ్లలా తాము అన్ని పిచ్‌లపైనా బంతిని స్పిన్ చేయలేమని చెప్పాడు. అయితే.. తాను ఎప్పటికప్పుడు వైవిధ్యం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నానని తెలిపాడు. రవిచంద్రన్ అశ్విన్‌లానే తాను కూడా కొత్త అస్త్రాలతో ఐపీఎల్ బరిలోకి దిగనున్నానని అన్నాడు. విజయ్ హజారే వన్డే టోర్నీ కోసం హైదరాబాద్ వచ్చిన జడేజాతో ముఖాముఖి 'ఈనాడు'కు ప్రత్యేకం.

ఈనాడు – హైదరాబాద్

దక్షిణాఫ్రికాలో ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాకపోవడం నిరాశకు గురిచేసిందా?

అంతర్జాతీయ క్రికెట్లో లేదా దేశవాళీల్లో.. ఎక్కడ అవకాశం లభించినా ప్రతిసారి నూటికి నూరుశాతం ప్రదర్శన ఇచ్చా. శ్రీలంకతో సిరీస్‌లో అవకాశం లభించింది. బాగా ఆడాను. నిరుడు 10 మ్యాచ్‌ల్లో 54 వికెట్లు తీశా. అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ నేనే. దేనికైనా సమయం, అవకాశం రావాలి. తుది జట్టు కూర్పు అన్నిటికంటే ముఖ్యం.

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌ల్లోనూ పేస్ వికెట్లు ఉంటాయి.. అక్కడైనా అవకాశం లభిస్తుందని అనుకుంటున్నారా?

అంతర్జాతీయ క్రికెట్లో నేను కొత్తగా నిరూపించుకోవాల్సిందేమీ లేదు. తొమ్మిదేళ్లుగా ఆడుతున్నా. నా సత్తా ఏంటో ప్రపంచానికి తెలుసు. నా నైపుణ్యం, సత్తాపై నమ్మకం ఉన్నాయి. ఎవరి కోసమో ఆడను. ఎవరినో సంతృప్తి పరచడానికి ఒత్తిడి తెచ్చుకోను. ఫార్మాట్ ఏదైనా నూటికి నూరు శాతం ఆడటం.. ఆటను ఆస్వాదించడమే నాకు తెలిసిన విషయం. నిజానికి నేను ఇప్పటికీ జట్టుతోనే ఉన్నా. నా అవసరం ఉన్న ప్రతిసారీ నాకు పిలుపొస్తూనే ఉంది.

టీమ్‌ఇండియాలో చోటుకు సీనియర్ బౌలర్లు కష్టపడే పరిస్థితి రావడం ఎలా అనిపిస్తోంది?

పోటీ మంచిదే. అప్పుడే అత్యుత్తమ ఆట బయటకు వస్తుంది. పోటీ లేకపోతే మెరుగవ్వలేం. ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడు అత్యుత్తమంగా ఆడటం కోసం ప్రయత్నిస్తాం. కష్టపడతాం. అది మనకు, జట్టుకు మంచిది. లేకపోతే ఎక్కడ ఉన్నామో అక్కడే ఉండిపోతాం. ప్రతి సిరీస్‌కు మెరుగవుతూనే ఉండాలి. అప్పుడే జట్టులో చోటుంటుంది.

ఐపీఎల్‌లో అశ్విన్ లెగ్ స్పిన్ ప్రయత్నిస్తానని అంటున్నాడు. మరి మీరేం చేయాలనుకుంటున్నారు?

పరిమిత ఓవర్ల క్రికెట్లో రాణించాలంటే ఎప్పటికప్పుడు బౌలింగ్‌కు పదును పెట్టుకోవాలి. తెలివిగా బౌలింగ్ చేయాలి. అమ్ముల పొదిలో కొత్త అస్త్రాలు చేర్చుకుంటూనే ఉండాలి. ఐపీఎల్‌లో వికెట్లు మందకొడిగా ఉంటాయి. కాబట్టి వైవిధ్యం చూపాలి. అందుకే అశ్విన్ లెగ్ స్పిన్‌కు ప్రయత్నిస్తున్నట్లున్నాడు. నేను కూడా కొత్త మార్గాలు అన్వేషిస్తున్నా. నా బౌలింగ్‌లో వేగాన్ని ఇంకా బాగా వాడుకోవాలని అనుకుంటున్నా. బ్యాట్స్‌మెన్‌ను అయోమయానికి గురి చేసి.. ఫలితం రాబట్టాలని చూస్తా.

మణికట్టు స్పిన్నర్లకు ప్రాధాన్యం పెరిగిందని అనుకోవచ్చా?

మణికట్టు స్పిన్నర్లకు చాలా అనుకూలతలున్నాయి. లెగ్ స్పిన్‌తో పాటు గూగ్లీ వేయొచ్చు. వేళ్లతో బంతిని తిప్పే నాలాంటి స్పిన్నర్లకు అలా చేయడం కష్టమే. ప్రతి వికెట్‌పై బంతిని తిప్పలేం. ఐపీఎల్‌లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. పరిస్థితులకు తగ్గట్లు బంతులు సంధించాలి.

ఐపీఎల్‌పై ఎలాంటి ప్రణాళికతో ఉన్నారు?

నా నైపుణ్యానికి పదును పెట్టుకుంటున్నా. బ్యాటింగ్‌పై ఎక్కువగా దృష్టిసారిస్తున్నా. ఎక్కడ అవకాశం లభించినా నా నైపుణ్యాన్ని మెరుగు పర్చుకుంటా. ఇప్పట్నుంచి వెనుదిరిగి చూడను. అవకాశాల్ని సృష్టించుకుంటా.

భారత పేస్ బౌలింగ్‌పై మీ విశ్లేషణ ఏంటి?

నాణ్యత పెరిగింది. పేస్, స్వింగ్ అద్భుతంగా ఉంది. గంటకు 140 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో బంతులు వేస్తున్నారు. మన బౌలర్ల వయసు కూడా తక్కువే. మన బౌలింగ్‌ను చూసి విదేశాల్లో ప్రత్యర్థి జట్లు భయపడే పరిస్థితి వచ్చింది. పచ్చని వికెట్లను చూసి మనవాళ్లు వెనుకంజ వేయడం లేదిప్పుడు. నిజానికి భారత్‌కు పచ్చని వికెట్ ఇవ్వాలా లేదా అని విదేశీ జట్లే ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నాయి. ఇదే అతిపెద్ద సానుకూలాంశం.



మంచులో క్రికెట్ మెరుపులు

వీరూ జట్టుపై అఫ్రిది సేన ఘనవిజయం



సెయింట్‌మారిజ్ (స్విట్జర్లాండ్): మంచు పర్వతాల్లో నిన్నటి తరం స్టార్ క్రికెటర్ల మెరుపులు ఆసక్తి రేకెత్తించాయి. శుక్రవారం షాహిద్ అఫ్రిది నేతృత్వంలోని రాయల్స్, వీరేంద్ర సెహ్వాగ్ సారథ్యంలోని డైమండ్స్ మధ్య పోరు అభిమానుల్ని అలరించింది. స్విట్జర్లాండ్‌లో మంచుతో నిండిన పర్వతం మీద క్రికెట్ మైదానాన్ని తీర్చిదిద్ది, నిర్వహించిన ఈ మ్యాచ్‌లో ఈ మ్యాచ్‌లో రాయల్స్ 6 వికెట్ల తేడాతో డైమండ్స్‌ను ఓడించింది. వీరూ జట్టు ఓడినప్పటికీ.. అతడి మెరుపులు అభిమానుల్ని ఉర్రూతలూగించాయి. అతను 31 బంతుల్లోనే 62 పరుగులు చేశాడు. అందులో 4 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఫోర్‌తో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన వీరూ.. సిక్సర్‌తో ముగించాడు. అతడిని షోయబ్ అక్తర్ ఔట్ చేయడం విశేషం. సైమండ్స్ (40) కూడా రాణించడంతో డైమండ్స్ మొదట 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. రాయల్స్ బౌలర్లలో అబ్దుల్ రజాక్ (4/18) రాణించాడు. అనంతరం అఫ్రిది జట్టు 15.2 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఒవైస్ షా (34 బంతుల్లో 74 నాటౌట్) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ అఫ్రిది డకౌటయ్యాడు. వసీమ్ అక్రమ్, జహీర్ ఖాన్, అజిత్ అగార్కర్, మహ్మద్ కైఫ్, కలిస్, మైక్ హసి, గ్రేమ్ స్మిత్, వెటోరి, జయవర్ధనె, దిల్షాన్, మలింగ తదితరులు ఈ మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ రెండు జట్ల మధ్య శుక్రవారం కూడా మరో మ్యాచ్ ఉంది.



క్వార్టర్స్‌లో భారత జట్లు

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

అలోర్ సెటార్ (మలేసియా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్లు క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాయి. తమ చివరి గ్రూప్ మ్యాచ్‌ల్లో ఓడినా భారత జట్లు ముందంజ వేశాయి. గురువారం మహిళల గ్రూప్-డబ్ల్యు పోరులో భారత్ 1-4తో జపాన్ చేతిలో ఓడింది. పి.వి.సింధు గెలిచినా మిగతా క్రీడాకారిణులు ఓటమి పాలయ్యారు. తొలి సింగిల్స్‌లో సింధు 21-19, 21-15తో అకానె యమగూచిపై నెగ్గి భారత్‌కు శుభారంభాన్ని అందించింది. ఐతే రెండో సింగిల్స్‌లో శ్రీకృష్ణప్రియ 12-21, 12-21తో సయాక సాటో చేతిలో, మూడో సింగిల్స్‌లో అశ్విని పొన్నప్ప 14-21, 12-21తో ఒహోరి చేతిలో పరాజయం చవిచూశారు. తొలి డబుల్స్‌లో సంయోగిత- ప్రజక్త 17-21, 17-21తో తనక- యొనెమొటొ చేతిలో, రెండో డబుల్స్‌లో అశ్విని- సిక్కిరెడ్డి 18-21, 18-21తో మిసాకి- తకహాషి చేతిలో ఓడటంతో 1-4తో జపాన్ చేతిలో భారత్‌కు చుక్కెదురైంది. పురుషుల గ్రూపు-డి చివరి పోరులో భారత్ 2-3తో ఇండోనేసియా చేతిలో పోరాడి ఓడింది. తొలి మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 17-21, 17-21తో క్రిస్టీ చేతిలో పరాజయం చవిచూశాడు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరెడ్డి- చిరాగ్ శెట్టి 18-21, 21-18, 24-22తో అషాన్- కెవిన్‌పై గెలిచి 1-1తో స్కోరును సమం చేశారు. రెండో సింగిల్స్‌లో సాయిప్రణీత్ 21-18, 21-19తో గింటింగ్‌పై నెగ్గి 2-1తో భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. ఐతే రెండో డబుల్స్‌లో అర్జున్- శ్లోక్ 21-14, 16-21, 12-21తో ప్రతమ- సప్రుత్రో చేతిలో, మూడో సింగిల్స్‌లో సుమీత్‌రెడ్డి 12-21, 7-21తో ముస్తఫా చేతిలో ఓడటంతో 3-2తో భారత్‌కు పరాజయం ఎదురైంది.

ఎముకలు కొరికే చలిలో..

నేటి నుంచే శీతాకాల ఒలింపిక్స్

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా): మన ప్రాతినిధ్యం నామమాత్రమే! కానీ చాలా దేశాలకు ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైందే. శీతాకాల ఒలింపిక్స్‌కు వేళైంది. ఎముకలు కొరికే చలిలో విన్యాసాలు చేసేందుకు ఆటగాళ్లు సిద్ధం. దక్షిణ కొరియాలోని ప్యాంగ్ చాంగ్‌లో నేటి నుంచే మంచు క్రీడల సంగ్రామం. నిజానికి ఒక రోజు ముందే ఆటలు మొదలయ్యాయి. కానీ శుక్రవారం ప్యాంగ్‌చాంగ్ ఒలింపిక్ స్టేడియంలో జరిగే ఆరంభ వేడుకతో శీతాకాల ఒలింపిక్స్ అధికారికంగా ప్రారంభం కానున్నాయ్. ఈ నెల 25వ తేదీ ఆటలకు ముగింపు.



జట్లు.. ఆటలు: మొత్తం 92 దేశాల నుంచి జట్లు ఈ శీతాకాల ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాయి. స్కీయింగ్, స్కేటింగ్, లుజ్, ఐస్ హాకీ సహా 15 క్రీడల్లో 102 ఈవెంట్లలో పోటీలుంటాయి

మనోళ్లు ఇద్దరు: భారత్ నుంచి ఇద్దరు శివ్‌కేశవన్, జగదీష్ ఈ మంచు క్రీడా సంరంభంలో తలపడుతున్నారు. లుజ్‌లో కేశవన్, క్రాస్ కంట్రీ స్కీయింగ్‌లో జగదీష్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల సింగిల్స్ లుజ్ హీట్స్ 10, 11వ తేదీల్లో జరుగుతాయి. జగదీష్ పోటీపడే 15 కిమీ నోర్డిక్ స్కీయింగ్ ఫ్రీస్టైల్ ఈవెంట్ 16న జరుగుతుంది.

ప్రసారం: రిలయన్స్ జియో టీవీ యాప్.. జియో టీవీలో శీతాకాల ఒలింపిక్స్ ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ఐఓసీ తన వెబ్‌సైట్ ద్వారా ఒలింపిక్ ఛానెల్‌లో, యూట్యూబ్ ఛానెల్‌లో కూడా క్రీడలను ప్రసారం చేయనుంది.

మువ్వన్నెల రెపరెపలు: శీతాకాల ఒలింపిక్స్ ఆరంభానికి ఓ రోజు ముందు క్రీడా గ్రామంలో భారత పతాకం రెపరెపలాడింది. జట్లను ఆహ్వానించే కార్యక్రమంలో మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు. "క్రీడాగ్రామ మేయర్ భారత బృందాన్ని లాంఛనంగా ఆహ్వానించారు. ఆహ్వాన కార్యక్రమంలో భారత పతాకాన్ని ఎగురవేశారు. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వంగా ఉంది" అని భారత షెఫ్ ద మిషన్ హర్జిందర్ చెప్పాడు.

అతని ఆట అద్భుతం!

మొహిందర్ అమర్‌నాథ్

వన్డే క్రికెట్లో భారత్ ఛాంపియన్. వాళ్లు నం.1 జట్టులాగే ఆడుతున్నారు. విరాట్ వీరవిహారాన్ని మరోసారి చూడడం అద్భుతంగా ఉంది. కెప్టెన్ నిలకడగా రాణించడమనేది చాలా తక్కువ. కానీ గత కొన్నేళ్లుగా కోహ్లి అసాధారణంగా ఆడుతున్నాడు. తనే జట్టును గెలిపిస్తూ సహచరులకు ఒక ఉదాహరణలా నిలుస్తున్నాడు. అతని ఆట అద్భుతం. జట్టుకు అతనో సూపర్‌మ్యాన్. ప్రస్తుత వన్డే సిరీస్‌లో భారత్ మంచి ఆల్‌రౌండ్ ప్రదర్శన చేస్తోంది. చివరి టెస్టులో గెలిచి ఆత్మవిశ్వాసంతో ఆటగాళ్లు వన్డేల్లో అడుగుపెట్టారు. అలాంటి స్థితిలో కెప్టెన్ ముందుండి నడిపిస్తే కచ్చితంగా పరిస్థితులు మారతాయి. టెస్టు సిరీస్‌లో ఇబ్బంది పడి ఆ తర్వాత వన్డే సిరీస్‌లో మెరుగ్గా ఆడిన జట్లను చూశాం. ఉదాహరణకు ఇంగ్లాండ్ తొలుత యాషెష్ టెస్టు సిరీస్‌లో ఘోరపరాజయం పాలైంది. అనంతరం వన్డే సిరీస్‌లో రెచ్చిపోయి ఆడింది. ప్రస్తుత భారత జట్టులోని కీలక ఆటగాళ్లలో బుమ్రా ఒకడు. టెస్టుల్లో అతను చక్కటి ప్రదర్శన చేశాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో అతనెప్పుడూ చక్కటి ప్రదర్శన చేస్తుంటాడు. ఆరంభంలో అతడి బౌలింగ్‌ను ఎదుర్కోవడం కష్టం. మణికట్టు స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, చాహల్ నాణ్యమైన బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ విఫలమవుతూనే ఉన్నారు. స్పిన్నర్లు, పేసర్లు కలిసి వారిని ఒత్తిడిలోకి నెడుతున్నారు. భారత్ వన్డే సిరీస్‌ను శాసించే స్థాయికి చేరుకుంది. దక్షిణాఫ్రికా జట్టులో చాలా సమస్యలున్నాయి. ప్రధాన ఆటగాళ్లైన డివిలియర్స్, ఆమ్లాల వయసు పెరుగుతోంది. వారి స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాళ్లు రాకపోవడంతో భవిష్యత్తులో దక్షిణాఫ్రికా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదముంది. వెస్టిండీస్ లాగే ఆ జట్టు పరిస్థితి తయారైనా ఆశ్చర్యం లేదు.





గురువారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో జరిగిన ఆరె కటికల శంఖారావంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, మంత్రులు జోగు రామన్న, ఈటల రాజేందర్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ. చిత్రంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్, వకుళాభరణం కృష్ణమోహనరావు, బీసీ సంఘాల నేతలు, ఆరెకటిక పోరాట సమితి నాయకులు ★ సభకు తరలివచ్చిన ఆరె కటికలు

మాంసాహార మార్కెట్లను ఆధునికీకరిస్తాం

- ఆరెకటికలకు ఫెడరేషన్ ఏర్పాటు యోచన
- శంఖారావ సభలో మంత్రి ఈటల

నాగోలు - న్యూస్‌టుడే

రాష్ట్రంలో మాంసాహార మార్కెట్లను ఆధునికీకరిస్తామని, ఇందుకోసం ఎన్ని కోట్ల నిధులైనా వెచ్చిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆరెకటిక కులస్థులు ఆత్మగౌరవ, ఆకలి పోరాటం పేరుతో గురువారం నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన శంఖారావ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. కటిక కులస్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తెరాస ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. మటన్, చికెన్ మార్కెట్లను గతంలో పట్టించుకున్న వారేలేరని, తాము మటన్ దుకాణాలను ప్రజలకు సేవచేసే కేంద్రాలుగా భావిస్తున్నామని అన్నారు. తాజాగా రూ.6 కోట్లతో మహబూబ్‌నగర్‌లో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కరీంనగర్, సిద్దిపేటలో అభివృద్ధి చేశామన్నారు. నగరంలోని జియాగూడ, గౌలిగూడ మార్కెట్లను సైతం త్వరలోనే ఆధునికీకరిస్తామన్నారు. ఆరెకటికలకు ఫెడరేషన్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు. వారి పిల్లలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రవేశ పరీక్షలు లేకుండానే అడ్మిషన్లు ఇప్పిస్తామన్నారు. ఆరెకటికలను ఎస్సీల్లో చేర్చాలనే విషయాన్ని సీఎం ద్వారా కేంద్రప్రభుత్వం దృష్టికి తెస్తామన్నారు. ఎంబీసీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌లో రజకులు, నాయీబ్రాహ్మణుల మాదిరిగానే ఆరెకటికలకు నిధులు వెచ్చిస్తామన్నారు. ఆరెకటిక పోరాట సమితి అధ్యక్షుడు గోగికార్ సుధాకర్ మాట్లాడుతూ.. 12 రాష్ట్రాల్లో ఈ కులస్థులు ఎస్సీల్లో ఉన్నారని, తెలంగాణలోనూ ఎస్సీల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. 'కసాయివాడు, కటికోడు' అంటూ ఆరెకటికలను కించపరిచేలా వ్యవహరించే వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ ప్రతినిధి వకుళాభరణం కృష్ణమోహన్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో 28 మంది ఐఏఎస్‌లకు, ఐపీఎస్‌లకు పదోన్నతులు

ముఖ్య కార్యదర్శులుగా పార్థసారథి, చంద్రవదన్, బూసాని, శివశంకర్, విష్ణులు

ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 16 మంది ఐఏఎస్, 12 మంది ఐపీఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. కొత్త హోదాతో వారిని అవే స్థానాల్లో కొనసాగాలని సూచించింది. 1993 బ్యాచ్‌కి చెందిన పార్థసారథి, ఆర్వీ చంద్రవదన్, బూసాని వెంకటేశ్వర్ రావు, ఎన్.శివశంకర్, వీఎన్ విష్ణులకు ముఖ్య కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. 2004 బ్యాచ్‌కి చెందిన కె.నిర్మల, 2005 బ్యాచ్‌కి చెందిన గౌరవ్ ఉప్పల్, కె.ఇలంబర్తి, కె.మానిక్‌రాజ్, ఎ.శరత్, ఎల్.శర్మన్‌లు అదనపు కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. 2008 బ్యాచ్‌కి చెందిన శ్రీదేవసేన, 2009 బ్యాచ్‌కి చెందిన సర్ఫరాజ్ అహ్మద్, ఎన్.సత్యనారాయణ, అర్వింద‌ర్‌సింగ్, ఎం.ప్రశాంతిలు సంయుక్త కార్యదర్శులయ్యారు.

2005 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్‌లు వి.శివకుమార్, వీబీ కమలాసన్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్, పి.విశ్వప్రసాద్, ఎం.రమేశ్... 2006 బ్యాచ్‌కి చెందిన కె.రమేశ్‌నాయుడు, ఏవీ రంగనాథ్, బి.సుమతి, ఎం.శ్రీనివాసులు, వి.సత్యనారాయణ. ఎ.వెంకటేశ్వర్‌రావులు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్ పొందారు.

వైద్యసేవలపై అధికారుల అధ్యయనం

- తమిళనాడుకు వెళ్లిన 12 మంది డీఎంహెచ్‌ఓలు
- పుట్టపర్తికి వెళ్లనున్న 35 మంది సూపరింటెండెంట్లు

ఈనాడు, హైదరాబాద్: పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న మెరుగైన వైద్యసేవలపై అవగాహన కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం వైద్యాధికారులకు ప్రత్యేకంగా అధ్యయన యాత్రను రూపొందించింది. తమిళనాడులో మాతాశిశు సంరక్షణకు అమలుచేస్తున్న ఉత్తమ ప్రమాణాలపై ఇప్పటికే రాష్ట్ర ఆరోగ్యమంత్రి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌తో పాటు కొందరు ఐఏఎస్ అధికారులు పర్యటించి వచ్చారు. అక్కడ అమలుచేస్తున్న విధానాలపై వైద్యాధికారులకూ అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో అమలును ప్రత్యక్షంగా పర్యవేక్షించాల్సింది జిల్లా వైద్య ఆరోగ్యాధికారులే(డీఎంహెచ్‌ఓ) కావడంతో.. 12మంది డీఎంహెచ్‌ఓలను తొలిదశలో అధ్యయనానికి ఎంపిక చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, బాలింతలు, శిశు సంరక్షణ, మధుమేహం, అధిక రక్తపోటు, జీవనశైలి వ్యాధుల చికిత్స తదితరాలు.. క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయనే అంశాలపై అధ్యయనం చేస్తారు. బుధవారమే వైద్యాధికారుల బృందం తమిళనాడుకు చేరుకోగా.. మూడురోజులు సాగే అధ్యయనంలో అక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శిస్తారు.

స్పెషాలిటీ సేవలపై..

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యసేవల అధ్యయనానికి 35 మంది ఆసుపత్రుల సూపరింటెండెంట్లు శుక్రవారం వెళ్లనున్నారు. వీరంతా జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల సూపరింటెండెంట్లే. జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో స్పెషలిస్టు సేవలను బలోపేతం చేసేలా రాష్ట్రప్రభుత్వం 4500 కొత్త పోస్టులను మంజూరుచేసింది. వీటిల్లో 1200 పోస్టులను త్వరలోనే శాఖా నియామక కమిటీ ఆధ్వర్యంలోనే భర్తీ చేయనున్నారు. ఈనేపథ్యంలో స్పెషలిస్టు వైద్యసేవలను సమర్థంగా వినియోగించుకోవడంపై సునిశిత పరిశీలనకు సూపరింటెండెంట్ల బృందం పుట్టపర్తికి వెళ్తోంది. పారిశుద్ధ్యం, పాలనాపర అంశాలను పరిశీలిస్తుంది. ఈ బృందం కూడా మూడు రోజుల పాటు పర్యటిస్తుందనీ వైద్యవర్గాలు తెలిపాయి.

టీఆర్‌టీ దరఖాస్తును సరిచేయని అభ్యర్థులు 30,849 మంది

వారంతా జిల్లా వివరాలు అప్‌లోడ్ చేయాలి

ఎస్‌ఏ బయాలజీ హిందీ, ఆంగ్ల మీడియంలో పోస్టుల్లేవు

టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో 30,849 మంది తమ ఆప్షన్లను పూర్వజిల్లాల ప్రాధాన్యక్రమంలోకి మార్చుకోలేదని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. 31 జిల్లాల నుంచి పూర్వ పదిజిల్లాలకు ప్రాధాన్యత క్రమాన్ని మార్చుకోవాలని అభ్యర్థులకు పలుమార్లు సూచించినా 'ఎడిట్' అవకాశాన్ని వినియోగించుకోలేదని పేర్కొన్నారు. ఆయా అభ్యర్థులు టీఆర్‌టీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు స్థానిక జిల్లా వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఆ విభాగంలో పోస్టుల్లేవు

స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్ కేటగిరీ ఆంగ్లం, హిందీ మీడియంలో పోస్టులు లేనప్పటికీ 1868 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వివరించారు. దరఖాస్తు సమయంలో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు అవకాశమిచ్చినా వినియోగించుకోలేదన్నారు. ఆయా అభ్యర్థులు తమ దరఖాస్తును సవరించుకునేందుకు ఈ నెల 10 నుంచి 12 వరకు మరోసారి చివరి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ అర్హతల ప్రకారం తెలుగు, ఉర్దూ, మరాఠా, కన్నడ మీడియానికి మార్చుకోవాలని సూచించారు. మీడియాన్ని మార్చుకోని అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయబోమని స్పష్టం చేశారు.

రాంగోపాల్ వర్మకు పోలీసుల తాఖీదు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మకు హైదరాబాద్ సైబర్ నేరాల విభాగం పోలీసులు తాఖీదులు జారీ చేశారు. రాంగోపాల్ వర్మ రూపొందించిన గాడ్, సెక్స్ అండ్ ట్రూత్(జీఎస్టీ) వెబ్ సిరీస్ చిత్రంలో అశ్లీల, అసభ్య సన్నివేశాలున్నాయంటూ మహిళా సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతోపాటు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, మహిళలతో నగ్నంగా సినిమాలు తీస్తానంటూ వర్మ వ్యాఖ్యానించారని చెప్పడంతో ఆయనపై కేసు నమోదుచేశారు. విచారణలో భాగంగాహాజరు కావాలంటూ తాఖీదులు పంపగా.. నాగార్జునతో చిత్రషూటింగ్ ముంబయిలో చేస్తున్నామని.. వచ్చేవారం హాజరవుతానంటూ అభ్యర్థించారని అదనపు డీసీపీ (సైబర్ క్రైమ్స్) రఘువీర్ తెలిపారు.

పరీక్షల ఒత్తిడిపై టెలీ కౌన్సెలింగ్!

టోల్ ఫ్రీ నెంబరు ద్వారా మానసిక నిపుణుడిచే సూచనలు

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో పరీక్షల ఒత్తిడి నివారణపై మానసిక నిపుణులచే(సైకాలజిస్టు) టెలీ కౌన్సెలింగ్ ఇప్పించాలని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ యోచిస్తోంది. కేంద్ర మాధ్యమిక విద్యామండలి(సీబీఎస్‌ఈ) గత 21 సంవత్సరాలుగా టెలీ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తోంది. ఈసారి ఫిబ్రవరి 1వతేదీ నుంచి ఏప్రిల్ 2వరకు ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే నిపుణులు కౌన్సెలింగ్ చేస్తారు. అందుకు పదుల సంఖ్యలో ప్రిన్సిపాళ్లకూ సీబీఎస్‌ఈ శిక్షణ ఇచ్చింది. రాష్ట్రంలో సీబీఎస్‌ఈ పాఠ్య ప్రణాళికతో నడిచే పాఠశాలలు సుమారు 300 ఉన్నాయి. రాష్ట్ర విద్యాశాఖ పాఠ్య ప్రణాళిక అమలు చేస్తున్న బడుల్లో పదో తరగతి విద్యార్థులే సుమారు 5.50 లక్షల మంది ఉన్నారు. వారందరూ మార్చి 15 నుంచి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పరీక్షలకు ముందు మానసిక సమస్యలకు గురయ్యే వారిలో పదో తరగతి వారే అధికం. తాజాగా హైదరాబాద్‌లో పది విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఓ సైకాలజిస్టును తాత్కాలికంగా కనీసం నెలపాటు నియమించి టెలీ కౌన్సెలింగ్ ఇప్పించాలని విద్యాశాఖ కమిషనర్ భావిస్తున్నారు. ప్రస్తుతం సర్వశిక్ష అభియాన్(ఎస్‌ఎస్)కు ఇప్పటికే టోల్‌ఫ్రీ నెంబరు(1800 425 3525) ఉంది. దాన్ని వినియోగించుకోవచ్చన్నది ఆలోచన. దీనిపై త్వరగా కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ఏపీ ప్రభుత్వానికి 5, 6 జోన్ల ఇంజినీర్ల జాబితా పత్రాలు

ప్రత్యేక అధికారులతో అమరావతికి దస్త్రాల తరలింపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని 5, 6 జోన్లలో పనిచేస్తున్న సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు, సాంకేతిక అధికారుల సీనియారిటీ జాబితాలను తెలంగాణ నీటిపారుదల శాఖ గురువారం ఏపీ జలవనరుల శాఖ కార్యదర్శికి పంపించింది. ఈ జోన్లలో పనిచేస్తున్న అర్హులైన ఇంజినీర్లకు ఇన్నాళ్లూ ఉద్యోగోన్నతులు లేకుండా పోయాయి. రాష్ట్ర విభజన నాటికి ఆ అధికారుల సీనియారిటీ జాబితా సిద్ధం కాకపోవడంతో ఉద్యోగోన్నతులపై ప్రభావం పడింది. దీనిపై కొందరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీంతో ఫిబ్రవరి ఎనిమిదో తేదీ నాటికి సీనియారిటీ జాబితాను ఏపీకి పంపాలని తెలంగాణకు, నాలుగు నెలల్లోగా ఉద్యోగోన్నతులు పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ అధికారులను హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీఎస్ ఎస్‌కే జోషి.. ఏపీ అధికారులకు లేఖరాశారు. రెండు జోన్ల పరిధిలోని ప్రతి ఇంజినీరుకు సంబంధించిన దస్త్రాలను తీసుకొని ఎన్.ప్రతాప్‌రెడ్డి, రవీంద్ర కుమార్, గోవర్ధనాచారి, రమణారెడ్డితో కూడిన ప్రత్యేక అధికారుల బృందం ఏపీ రాజధాని అమరావతికి వెళ్లింది.

ఇక సహనానికి సమయం లేదు!


సంచలనం రేపుతున్న గల్లా జయదేవ్ ప్రసంగం

"ఐదు బడ్జెట్‌లు అయిపోయాయి.. మిత్ర ధర్మానికి కట్టుబడి ఇప్పటికీ మేం సహనంతో వేచిచూస్తూనే ఉంటే.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇదేనా మీరిచ్చేది?" అంటూ లోక్‌సభా ముఖంగా తెలుగుదేశం పార్టీ ఎంపీ గల్లా జయదేవ్ ప్రధాన మంత్రినీ, ఆర్థిక మంత్రినీ నిలదీస్తూ చేసిన ప్రసంగం ప్రస్తుతం తెలుగు నాట సంచలనం సృష్టిస్తోంది. అందులోని ఆసక్తికర అంశాలు...

"ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ దేశ ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రుల నుంచి సంజాయిషీ కోరుతున్నారు.. మీరు ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ తర్వాత జీఎస్టీ తేవటం తదితర సాంకేతిక ఇబ్బందులతో దీర్ఘకాలం హోదా సాధ్యం కాదన్నారు. దానికి బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు. ప్రత్యేక హోదాతో దక్కే ప్రయోజనాలన్నీ ఇందులోనూ ఉంటాయని హామీ ఇచ్చారు. మనం మిత్రపక్షాలం. 2014 ఎన్నికల్లో కలిసి పోరాడాం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు హామీలిచ్చి గెలిచాం. మిమ్మల్ని మేమెందుకు నమ్మకూడదు? పూర్తిగా విశ్వసించాం. అందుకే నాలుగేళ్లుగా 'మిత్రపక్ష ధర్మాని'కి కట్టుబడి ఎదురుచూస్తున్నాం. ఐదు బడ్జెట్‌లు అయిపోయాయి. మీరు పదేపదే హామీలిస్తూనే ఉన్నారు.. మేం ఎదురుచూస్తూనే ఉన్నాం. మమ్మల్ని సహనంతో ఉండమన్నారు.. ఇంక సహనానికి సమయం లేదు.. హామీలు అమలు చేయడానికి ఇదే ఆఖరి బడ్జెట్. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పటికీ కాదు.

ఎన్నికలొస్తున్నాయని మర్చిపోవద్దు!

మమ్మల్ని లెక్కలోకి తీసుకోకపోవడానికి లోక్‌సభలో మీకు సంఖ్యాబలం ఉందని మాకు తెలుసు. కానీ మీకో విషయం గుర్తుచేస్తున్నా.. ఎన్నికలు ఎంతో దూరంలో లేవు. ఇప్పటి పరిస్థితులు చూస్తుంటే వచ్చే ఎన్నికలు కచ్చితంగా పెను సవాల్‌గానే నిలుస్తాయి. మీ మిత్రపక్షానికి ఇచ్చిన హామీలను మీరు అమలు చేయకపోతే.. ఇతర, కాబోయే మిత్రపక్షాలకు మీరేం సంకేతాలిస్తున్నట్లు? మీరీ విషయాన్ని విస్మరించటానికి లేదు. నేను రాజకీయాలకు కొత్త కావచ్చు. కానీ, విశ్వాసం అంటే ఏమిటో.. భాగస్వామ్యం కొనసాగాలంటే అదెంత ముఖ్యమో నాకు బాగా తెలుసు. దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలకు చివరి రోజులు వచ్చేశాయని అనుకోవటానికేం లేదు. ప్రధాన మంత్రీ... మీ మిత్రపక్షాలకు, కాబోయే భాగస్వాములకు మీరేం సందేశం పంపాలనుకుంటున్నారు? ఇప్పుడు ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల్లాగానే.. మీ మిత్రపక్షం కూడా.. మీరు మమ్మల్ని నిర్లక్ష్యం చేశారనీ, మోసం చేశారనీ.. అవమానించారనే భావిస్తోంది.. మీ వివరణ ఏమిటో చెప్పండి!

> **కానీ మీకో విషయం గుర్తుచేస్తున్నా.. ఎన్నికలు ఎంతో దూరంలో లేవు.. ప్రధాన మంత్రీ... మీ మిత్రపక్షాలకేం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారు?**

వైకాపాకు మద్దతిస్తూ..
దేశానికి ఏం సందేశం పంపుతారు?

తాజా బడ్జెట్‌లో ఏపీ విభజన చట్టంలో చేసిన వాగ్దానాలు.. అమరావతి, పోలవరం, రైల్వేజోన్, ఆర్థికలోటు, ప్రత్యేక ప్యాకేజీ.. ఇవేవీ లేవు. నాడు మన్మోహన్‌సింగ్ సభాముఖంగా చేసిన వాగ్దానాల ప్రస్తావనా లేదు. అసలు అవేగనక లేకుండా ఉంటే ఆ బిల్లు పాస్ అయ్యేదే కాదు. అందువల్ల వాటిని పరమపవిత్రంగా పరిగణించాల్సిందే. వాగ్దానాలను పక్కనపెట్టి, తెలుగుదేశాన్ని బలహీనపరిస్తే మీ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో బలపడుతుందని మీ పార్టీ సభ్యులు కొందరు మిమ్మల్ని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నట్టున్నారు. కొందరు సీనియర్లు ఇచ్చిన దుష్ట సలహాలు విన్నందుకు గత ఎన్నికల్లో సోనియాగాంధీ భారీ మూల్యం చెల్లించుకున్నారు. దేశంలో కాంగ్రెస్‌కు బలమైన రాష్ట్రంగా నిలిచిన ఏపీలో ఆ పార్టీ జీరోకి చేరింది. 25 ఎంపీలు, 175 మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరినీ గెలిపించుకోలేకపోయింది. ఆ పార్టీకి ఇక మీదటా ఆ దుర్గతి తప్పదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించినా తెలంగాణలో తెరాసను విలీనం చేసుకొని గెలవొచ్చని భావించింది. వైఎస్‌ఆర్‌సీపీతో కుదుర్చుకున్న రహస్య ఒప్పందం కారణంగా ఏపీలో వాళ్లు గెలిచి తమకు మద్దతిస్తారు, లేదంటే విలీనం చేస్తారని కాంగ్రెస్ భావించింది. ఏపీ ప్రజలేమీ అవివేకులు కారు. రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. వైకాపా మోసపూరిత కుట్రలను ప్రజలు అర్థం చేసుకున్నారు. అలాంటి తప్పుడు దారులు తొక్కితే.. భాజపా పరిస్థితి బాగుంటుందేమోనన్న అభిప్రాయానికి రాకండి. వైకాపా మరోసారి ప్రజల్ని మోసం చేయాలని చూస్తోంది. వారు బడ్జెట్‌ను ప్రశంసిస్తున్నారు. కేంద్రం మన్నన కోసం.. ఆ నెపాన్ని కేంద్ర ప్రభుత్వం, భాజపాలపై కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, తెదేపాలపై నెట్టాలని చూస్తోంది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారి మద్దతు ఆ పార్టీకి అవసరం. ఈ రోజు మీరు కావొచ్చు.. రేపు ఇంకెవరైనా కావొచ్చు... వైకాపా లాంటి పార్టీలకు మద్దతు ఇస్తూ దేశానికి ఏం సందేశం పంపాలనుకుంటున్నారు. ఏపీలో వైకాపా మీకు బలమైన భాగస్వామ్యం అని భావిస్తున్నారా? అలాగైతే మీ నిర్ణయంలోనూ, నైతికతలోనూ చాలా లోపం ఉన్నట్లే. కొంతమందిని అన్నిసార్లూ ఫూల్స్ చేయొచ్చు. అంతమందినీ కొన్నిసార్లు ఫూల్స్ చేయొచ్చు. కానీ అందర్నీ అన్ని సందర్భాల్లోనూ ఫూల్స్ చేయలేరు. మీకో విషయం చెప్పదలచుకున్నా మిస్టర్ ప్రైమ్‌మినిస్టర్... ఏపీ తెలుగుదేశంకానీ, ఏపీ ప్రజలు కానీ తెలివితక్కువ వాళ్లేంకాదు. మాకు వివరణ కావాలి.

మా సీఎం 29 సార్లు వచ్చారు?
మీరేం ఇచ్చారు?

మా ముఖ్యమంత్రి 29 సార్లు దిల్లీ పర్యటించారు. ఆయన ప్రధాని, ఆర్థిక మంత్రి, హోంమంత్రి సహా ఇతరత్రా మంత్రులను పలుసార్లు కలిసి హామీలను అమలుచేయమని కోరారు. నివేదికల మీద నివేదికలు ఇస్తూనే ఉన్నారు. తాజా నివేదిక ఇక్కడ ఉంది.. కావాలంటే చూడొచ్చు. ఇదేమీ తొలి నివేదిక కాదు. ప్రతి శాఖకూ ఎన్నో నివేదికలు ఇచ్చారు. అయినా ఇంకా సమాచారం కోసం వేచిచూస్తున్నామని, లేదంటే ఇంకా పరిశీలిస్తున్నామని చెప్పడం ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఇప్పటికీ అమలుచేయాల్సిన అంశాలు ఏపీవిభజన చట్టంలో ఇంకా 19 ఉన్నాయి. వాటన్నింటినీ చెప్పాలనుకోవడంలేదు. సమయాభావం రీత్యా ఐదు ప్రధాన అంశాలపై దృష్టిసారిద్దాం. అందులో ప్రత్యేకహోదా, వనరుల లోటు భర్తీ, పోలవరం ప్రాజెక్టు, రైల్వేజోన్ ఏర్పాటు, అమరావతికి ఆర్థికసాయం, గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ రిఫైనరీ ఏర్పాటు, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, జాతీయ ప్రాధాన్య సంస్థలు, నెల్లూరులో దుగరాజపట్నంపోర్టు ఏర్పాటు, అసెంబ్లీ సీట్ల పెంపు, పన్నులోపాల దిద్దుబాటు, కడపలో ఉక్కు పరిశ్రమ, విశాఖ చెన్నై పారిశ్రామిక నడవా ఏర్పాటు, విశాఖ, విజయవాడల్లో మెట్రో, అమరావతి నుంచి మిగతా ప్రాంతాలకు వేగవంతమైన రోడ్డు, రైలు అనుసంధానం, వెనకబడిన జిల్లా అభివృద్ధి, డిస్కంల బకాయిల చెల్లింపు, షెడ్యూలు 9, 10 సంస్థల విభజన, గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం వంటివి ఉన్నాయి. నేను చెప్పినవన్నీ విభజన చట్టంలోనివే తప్ప... ఇతరత్రా మాకు ఇచ్చిన హామీలు కాదు. ఈ హామీల అమలుకు బడ్జెట్ ఎక్కడ? వీటిని ఎలా అమలుచేయాలనుకుంటున్నారు?

మా ఓపికను పరీక్షించొద్దు!

సెప్టెంబరు 7, 2016న ఆర్థికమంత్రి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తూ చేసిన వాగ్దానాలను ఇక్కడ గుర్తుచేయాలనుకుంటున్నాను. కేంద్ర ప్రభుత్వం చివరి వరకూ ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తుందన్నారు. సెప్టెంబరు 2016లో అన్నమాట ఇప్పటి వరకు ఏదీ నెరవేర్చలేదు. మా ఓపికను మీరు పరీక్షించొద్దు. ఈ బడ్జెట్‌లో ప్రత్యేకప్యాకేజీకి కేటాయింపులు కాదు కదా... కనీసం దాని ప్రస్తావనకూడా లేదు. ఇది తీరని అన్యాయం. ఏపీ ప్రజలను మోసం చేయడం కిందే లెక్క. అమరావతి పరిపాలనా నగర శంకుస్థాపనకు ఆర్థిక మంత్రి వచ్చినప్పుడు రాజధాని పరిధిలో భూముల తొలిసారి అమ్మకాలకు క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌ను మినహాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరారు. దీనిపై ఆర్థికమంత్రి సానుకూలంగా స్పందించినా రెండేళ్లు మాత్రమే సమయమిచ్చారు. తొలి అమ్మకం వరకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తిచేస్తున్నా. ఇదే విజ్ఞప్తిని ఇప్పటి వరకు పలుసార్లు చేసినా తగిన హామీ రాలేదు.

విభజన అనంతరం రాష్ట్రానికి కలిగిన భారీ నష్టాన్ని పూడ్చడానికి ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చారన్న అంశం సభకు తెలుసు. పలు రాష్ట్రాలు, ప్రాంతాలకు వివిధ పేర్లతో ఆర్థిక ప్యాకేజీలు ప్రకటించిన విషయం... ఆ ప్రకటనల పరిస్థితి ఏమైందో తెలుసు. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా తమ ప్రత్యేక ప్యాకేజీకి అదే గతి పడుతుందేమోనని భయపడుతున్నారు. 2016 సెప్టెంబర్ 7వ తేదీన ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించాలని మా ముఖ్యమంత్రితోపాటు ఎంతోమంది డిమాండ్ చేశారు. దాన్ని నిర్దిష్టగడువులోగా అమలు చేయాలని కోరారు. ఏపీకి ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు విడుదల చేయాలని, దానికి చట్టబద్ధత కల్పించాలని ఆర్థికమంత్రిని డిమాండ్ చేస్తున్నా. దీనిపై ఆర్థికమంత్రి సమాధానం ఇస్తారని భావిస్తున్నా. విభజన సమయంలో చెప్పిన ప్రత్యేకహోదాతో సమానంగా ప్రత్యేక ప్యాకేజీగా నిధులు ఇస్తామని చెప్పారు. ప్రత్యేకహోదా అంశాన్ని ఇప్పుడు ప్రస్తావించాలని అనుకోవడం లేదు.

వాళ్లకు 6 వేల కోట్లు.. మాకేమో చిల్లర?

ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోని వెనుకబడిన ఏడు జిల్లాలకు ఒడిశాలోని కోరాపుట్-బోలంగిర్-కలహండి తరహాలో స్పెషల్



ప్లాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల్లోని బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని నాటి ప్రధాని రాజ్యసభలో హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.1050 కోట్లు మాత్రమే ఇచ్చారు. కేబీకే, బుందేల్‌ఖండ్ ప్యాకేజీల్లో రూ.6 వేల కోట్లు ఇస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో వెనకబడిన జిల్లాలు జిల్లాకు ఏటా రూ.50 కోట్లు చొప్పున మాత్రమే ఇచ్చారు. అదీ ఈ ఏడాది నిలిపివేశారు. మేం వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ కోరుకుంటున్నాం తప్పితే చిల్లర కాదు.

పోలవరం విషయానికొస్తే 2014-15 అంచనాల ప్రకారం రూ.54వేల కోట్లతో నివేదిక ఇచ్చాం. దీంట్లో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌లకు దగ్గర దగ్గరగా రూ.30 వేల కోట్లు అవుతుంది. పోలవరం సవరించిన అంచనాలు సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ప్రధాని, ఆర్థికమంత్రులకు విజ్ఞప్తిచేస్తున్నా.

విశాఖ, విజయవాడ మెట్రోల
గురించి మాట్లాడరేం? ఇదేం న్యాయం?

రైల్వేజోన్, విశాఖపట్నం, విజయవాడ మెట్రోల విషయానికొస్తే ... ఆర్థికమంత్రి బెంగళూరు మెట్రోకి రూ.17 వేల కోట్లు, ముంబయి సబర్బన్ రైల్వేనెట్‌వర్క్‌కు రూ.51వేల కోట్లు ప్రకటించారు. కానీ విశాఖ, విజయవాడ మెట్రోల గురించి ప్రస్తావించలేదు. కర్ణాటకలో ఎన్నికలు ఉన్నాయి ఆంధ్రప్రదేశ్‌లో లేవు కాబట్టే ఆర్థికమంత్రి ఏపీకి ప్రకటించలేదు. ఇదేం న్యాయం. సబ్‌కా వికాస్ అనే నినాదం మీరు విస్మరించనట్లు కాదా? మంగళవారం రాజ్యసభలో రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ ప్రకటన చేస్తూ... "జోన్ మార్పు చేయడం, జోన్ ఏర్పాటు చేయడంపై పలు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు పూర్తి అయ్యాక ఎలాంటి వివాదాలకు తావులేని ఒక ఆచరణీయ పద్ధతి గుర్తిస్తాం" అన్నారు. ఈ కసరత్తు ఇప్పటికే పూర్తయి ఉండాలి. నాలుగేళ్ల తర్వాత దీన్ని ఎందుకు వింటున్నాం? పీయూష్ గోయెల్ వంటి సీనియర్ నాయకుడిని నుంచి ఇలాంటి సమాధానం వస్తుందని అనుకోలేదు. అమరావతి విషయానికొస్తే విభజన చట్టంలోని సెక్షన్ 94(3) ఏం చెబుతోందంటే... నూతన రాజధానిలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం అసెంబ్లీ, కౌన్సిల్, ఇతరమౌలికసదుపాయాల కోసం కేంద్రం తప్పకుండా ఆర్థికసాయం చేయాలి. సాయం చూస్తామని చెప్పడం కాదు... తప్పకుండా చేయాలి.

రాజధాని నిర్మాణానికి ప్రాథమిక అంచనా రూ.1.2 లక్షల కోట్లు. రానున్న ఐదేళ్లలో రాజ్‌భవన్, సచివాలయం, హైకోర్టు అసెంబ్లీ, కౌన్సిల్ నిర్మాణంతోపాటు భూమి అభివృద్ధి చేయడానికే రూ.42,935 కోట్లు అవసరమవుతుంది. గడిచిన మూడేళ్లలో రూ.500 కోట్లు (2014-15), రూ.550 కోట్లు (2015-16), రూ.450 కోట్లు (2016-17) మాత్రమే ఇచ్చారు. అంతకుమించి ఏమీ ఇవ్వలేదు. విజయవాడ, గుంటూరు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.1000 కోట్లు ఇచ్చారు కానీ అమరావతికి కాదు. కనీసం ఏటా రూ.10 వేల కోట్ల చొప్పున ఇస్తే నాలుగైదేళ్లలో రాజ్‌భవన్, సచివాలయం, హైకోర్టు, తదితరాలకు రూ.42,935 కోట్లు ఇచ్చినట్లు అవుతుంది.

> **కర్ణాటకలో ఎన్నికలు ఉన్నాయి ఆంధ్రప్రదేశ్‌లో లేవు కాబట్టే ఆర్థికమంత్రి ఏపీకి ప్రకటించలేదు. ఇదేం న్యాయం.**

ఈ నిర్లక్ష్యం ఇప్పుడే ఎన్నికల్లేవనేనా?

విభజన చట్టం ప్రకారం ఏపీలో ఏర్పాటు చేయాల్సిన విద్యా సంస్థలకు కేటాయించింది స్వల్పమే. ఇలా చేస్తూ పోతే విద్యా సంస్థలకు ఇచ్చిన హామీలు వాస్తవరూపం దాల్చడానికి 10 నుంచి 30 ఏళ్లుపడుతుంది. ఉదాహరణకు అమరావతిలో ఎయిమ్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీని నిర్మాణానికి రూ.1618 కోట్లు అంచనా అయినప్పటికీ ఒక్కపైసా కూడా కేటాయించలేదు. ఇతర రాష్ట్రాల్లోని ఎయిమ్స్‌లకు ఈ ఏడాది నిధులు కేటాయించారు కానీ ఏపీ ప్రస్తావన లేదు. ఇది కూడా ఏపీలో ఎన్నికలు లేవు కాబట్టేనేమోననిపిస్తోంది. విశాఖ ఉక్కు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ షిప్‌యార్డ్, వైజాగ్ పోర్టు ట్రస్టు ఇలా వేటికీ కేటాయింపులు సరిగా లేవు. ఆంధ్రప్రదేశ్‌కు మొత్తంగా కేటాయించినవి రూ.1,814.16 కోట్లు మాత్రమే అంటే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన నిధులు కనీసం బాహుబలి కలెక్షన్ల కన్నా ఎక్కువ కాదనడం అతిశయోక్తి కాదు.

మీకూ కాంగ్రెస్ పరిస్థితే.. ఊహించుకోండి!

విభజన చట్టం పాస్ చేసినందుకు ఏపీ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. చట్టంలో చెప్పిన కనీస హామీలు అమలు చేయకపోతే భాజపా పరిస్థితి ఎలా ఉంటుందో మీరు ఊహించుకోండి. హామీల అమలు విఫలమైతే మీరు దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని భావించడం తప్ప మాకు మరోదారి లేదు. మీతో సంబంధాలు కొనసాగించే అంశంపై కచ్చితంగా పునరాలోచించాల్సి వస్తుంది. కీలకమైన ఎన్నికల సంవత్సరంలో మీరు మిత్రపక్షాలను అర్థం చేసుకుంటారని భావిస్తున్నా. మిత్రధర్మాన్ని పాటించడానికి హామీలు అమలు చేయడానికి ఇదే ఆఖరి బడ్జెట్. మేం మిత్రధర్మాన్ని ఎంతో ఓపికగా ఇప్పటిదాకా పాటిస్తూవచ్చాం. మిత్రపక్షాలకు ఇలాంటి సందేశం పంపడం కూడా ఇది మాకు ఎలాంటి సంతృప్తిని ఇవ్వలేదు. కానీ మీరు మాకు విధిలేని పరిస్థితిని కల్పించారు. ఇది ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ కాదు. ప్రధానమంత్రి, ఆర్థికమంత్రిలపై మాకు ఇప్పటికీ నమ్మకం ఉంది. మేం సమగ్రమైన వివరణకోసం డిమాండ్ చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు 'ఫూల్స్' కాదని మరోసారి గుర్తు చేయదలచుకొన్నాం.

- ఈనాడు, దిల్లీ

ప్రజల వద్ద అవమానంగా ఉంది

- చంద్రబాబుకి పేరొస్తోందనే రాష్ట్రాన్ని విభజించారు
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చండి: సీఎం రమేశ్

ఈనాడు, దిల్లీ: కేంద్రంలో భాగస్వామ్యులమని రాష్ట్ర ప్రజలకు చెప్పుకోవాలంటేనే అవమానంగా, ఇబ్బందిగా ఉందని గురువారం రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తెదేపా ఎంపీ సీఎం రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టం హామీలు నెరవేర్చకపోవడం, ఏపీ ఇబ్బందులపై తెలుగులో సుదీర్ఘంగా మాట్లాడారు. "ఆంధ్రప్రదేశ్‌కు 42 ఎంపీ సీట్లు ఉండకూడదని, దిల్లీలో రాజకీయంగా మన్నన పొందుతున్న చంద్రబాబును రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే రాష్ట్ర విభజన చేశారు. జనాభా ప్రకారం రెవెన్యూ విభజన చేయకుండా అన్యాయం చేశారు. ఆస్తులు ప్రాంతాల వారీగా విభజించారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఆస్తులున్నాయి. పన్నులు రిఫండ్ ఇవ్వాల్సి రావడంతో రూ.3,800 కోట్లు నష్టపోయాం. లోటు బడ్జెట్ రూ.16వేల కోట్లు తదితర అంశాలన్నీ దృష్టిలో ఉంచుకొని విభజన సమయంలో అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు ప్రత్యేకహోదా ఐదేళ్లు కాదని పదేళ్లు ఉండాలని డిమాండు చేశారు. హైదరాబాద్ తెలంగాణకు వెళ్లిపోయిందని, మిగతా రాష్ట్రాలతో సమానంగా ఏపీ అభివృద్ధి చెందాలని ప్రత్యేకహోదా, వనరుల లోటు పూడ్చడం, పోలవరం ప్రాజెక్టు, రైల్వేజోన్ ఏర్పాటు, అమరావతికి ఆర్థికసాయం వంటి హామీలిచ్చారు. ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ తలసరి ఆదాయం రూ.40 వేలు తక్కువే ఉంది. విభజన తర్వాత రాజధాని లేదు. పరిశ్రమలన్నీ హైదరాబాద్ పరిసరాల్లోనే ఉన్నాయి. కాంగ్రెస్ విభజన శాస్త్రీయంగా చేయలేదని, వచ్చేది భాజపా ప్రభుత్వం కదా డిమాండ్ సాధించుకోవచ్చని కలిసి ఎన్నికలకు వెళితే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తీరా చూస్తే హోదాతో కన్నా ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తామని ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. అది వచ్చేవరకు న్యాయం చేసినట్లుకాదు. నెల క్రితం కూడా ప్రధానిని కలిశాం. నాలుగేళ్లుగా చాలా అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా న్యాయం చేద్దామనిపించడం లేదా? ఇప్పుడు చేయకపోతే ఇక సమయం లేదని ఉభయసభల్లోనూ, బయటా మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నాం. తెలుగు ప్రజలను అవమానించినందుకు 2014లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు రాకుండా చేశారు. ఆ పరిస్థితి భాజపా తెచ్చుకోకూడదు. హామీలు అమలయ్యేవరకు వరకు పోరాడాల్సిందే. దీనిపై నిర్ణయం తీసుకుని ఏపీకి న్యాయం చేయాల్సిందే. రైల్వే జోన్‌పై కారణాలు చెబితే తగదు. తెదేపా, ప్రజలు ఓపిక పట్టలేరు. సమయం అయిపోయింది. కాకినాడలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 14శాతం ఐఆర్‌ఆర్ అడుగుతారు. రాజస్థాన్‌లో అయితే 9శాతం అంటారు ఇదెక్కడిన్యాయం. కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లకు ఒక న్యాయం, ఏపీకి ఒక న్యాయమా? దుగరాజపట్నం పోర్టు చట్టంలోఉంది దాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి. రూ.16 వేల కోట్లు లోటు బడ్జెట్ అని కేంద్రానికి పంపితే రూ.3,950 కోట్లు ఇచ్చారు. మిగిలిన నిధులు వెంటనే విడుదల చేయాలి. ఆర్థిక ఇబ్బంది లేని అసెంబ్లీ సీట్ల పెంపు హామీ కూడా నెరవేర్చరా? చట్టంలో హామీలన్నీ అమలు చేసేవరకు ప్రజలు నిద్రపోరు. మనసులో పెట్టుకొని ఏవిధంగా ఇబ్బందిపెట్టాలో అలా చేస్తారు" అని రమేశ్ అన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.